అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 10-02-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 40 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

హైకోర్టుల్లో దాదాపు 60 లక్షల కేసులు పెండింగ్

సుప్రీంలో 69 వేలకు పైనే : రాజ్యసభలో కేంద్రం

న్యూఢిల్లీ : భారత్‌లోని ఉన్నత న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు లక్షల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. దేశవ్యాప్తంగా 25 హైకోర్టులలో దాదాపు 60 లక్షల వరకు కేసులు, సుప్రీంకోర్టులో 69 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్రం రాజ్యసభలో వెల్లడించింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని పేర్కొంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజు లిఖితపూర్వక సమాధానాన్ని ఇచ్చారు. ఈ సమాచారం ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నాటికి భారత సర్వోన్నత న్యాయస్థానంలో 65,511 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, హైకోర్టులలో 59,87,477 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలహాబాద్ హైకోర్టులో అత్యధికంగా 10.30 లక్షల కేసులు తుది తీర్పు కోసం ఎదురు చూస్తున్నాయి. సిక్కిం హైకోర్టులో అత్యల్పంగా 171 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

లోపాలుంటే సరిచేస్తాం..
ధరణిని రద్దుచేయం

ప్రగతిభవన్‌ను బాంబులతో పేల్చడమే కాంగ్రెస్ విధానమా? : శాసనసభలో మంత్రి కేటీఆర్

- వద్దులపై చర్చ సందర్భంగా శ్రీధర్‌బాబుపై మంత్రి ఫైర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌లో ఏమైనా లోపాలుంటే సరిచేస్తాం గానీ, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయబోమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టాన్ని కమీషన్ల వసూలు కోసం వాడుకుంటున్నవారికి, దాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని, ప్రయివేటు వ్యక్తులను బ్లాక్‌మెయిల్ చేసేవాళ్లకు ధరణి పోర్టల్ ఇబ్బందిగా మారిందని ఎద్దేవాచేశారు. అందుకే వారు గొంతులు చించుకుంటున్నారని విమర్శించారు. ఆ పోర్టల్ రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉందని చెప్పారు. గురువారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతుండగా మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుని మాట్లాడారు. దీంతో పరిస్థితి కేటీఆర్ వర్సెస్ దుద్దిళ్ల అన్నట్టుగా తయారైంది. కేటీఆర్ మాట్లాడుతూ.. ధరణిని రద్దు చేయడం, ప్రగతి భవన్‌ను బద్దలు కొట్టడం, బాంబులతో పేల్చేయాలనడం కాంగ్రెస్ విధానామా? అని కాంగ్రెస్ సభ్యులను ప్రశ్నించారు. ఆరేండ్లలో 30 లక్షల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయనీ, ధరణి తెచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 23.92 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని వివరించారు. ధరణిలోని చిన్నచిన్న లోపాలను భూతద్దంలో పెట్టి చూపించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ధరణిని రద్దు చేయడమే కాంగ్రెస్ పార్టీ విధానమైతే స్పష్టం చెప్పాలని అడిగారు. ఆ పార్టీ హయాంలో లంచం లేకుండా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు చేయకుండా రైతులను రాక్షసంగా ఇబ్బంది పెట్టినట్టే ...8లో

సింగరేణిపై కేంద్రం కుట్రలను భగ్నం చేస్తాం..

కార్మికులు, రాజకీయ పక్షాలతో కలిసి ఐక్య ఉద్యమాలు...

- బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తాం :అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ వివరాలు 8లో..

జైలుకైనా పోతాం..
జాగాలను వదలం

ఎన్నికలకు ముందే..ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి




- డబుల్ ఇండ్లు ఎప్పుడిస్తారో చెప్పాల్సిందే
- పోడు భూములపైదాగుడుమూతలొద్దు : ప్రజాసంఘాల పోరాట వేదిక ధర్నాలో వక్తలు
- అసెంబ్లీ ముగిసేలోపే సమస్యలు పరిష్కరించాలి :ఎస్ వీరయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పోరాడుదాం..పేదలకు ఇండ్లు, ఇంటి జాగాలు ఇచ్చేంత వరకు.. పోరాడుదాం, పోరాడుదాం.. ఇవ్వాలి అందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు .. ఇవ్వాలీ, ఇవ్వాలి..ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలందరికీ పట్టాలు..ఇవ్వాలి.. ఇవ్వాలీ..కష్టజీవులపై పోలీసు నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడుదాం..పోరాడుదా'మంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు.. సర్కారిచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమం తప్పదంటూ హెచ్చరికలు.. ముందస్తు అరెస్టులా? సిగ్గు..సిగ్గు అంటూ స్లోగన్స్. పేదలంటే అలుసా?..పెద్దలంటే ప్రేమా? అంటూ పిడికిళ్లు బిగించి గొంతెత్తిన మహిళలు.. తమ బతుకు బాధలతో ఉయ్యాల, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడిన స్త్రీలు. వెరసి..పేదల బాధలన్నీ హైదరాబాద్‌కు మోసుకొచ్చిన శ్రమజీవుల నినాదాలతో గురువారం ధర్నా చౌక్ దద్దరిల్లింది. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక పిలుపులో భాగంగా నిర్వహించిన ధర్నాలో ప్రజాసంఘాల నేతలు మాట్లాడారు. వేదిక నాయకులు చుక్కా రాములు, జి నాగయ్య, పోతినేని సుదర్శన్, కెఎన్ ఆశాలత అధ్యక్ష వర్గంగా ఉన్నారు.ఇంటి జాగాలు, సాగు భూముల కోసం పేదలు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా పోరాడుతున్నారని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య చెప్పారు. వరంగల్‌లో ప్రారంభమైన ...14లో



అమృత కాలం కాదు..విష కాలం

మతం ఆయుధంగా రాజ్యాంగంపై బీజేపీ దాడి

- ఆహార సబ్సిడీకి బడ్జెట్‌లో 90 వేల కోట్ల కోత : బృందా కరత్

న్యూఢిల్లీ : అమృత కాలం అంటూ బీజేపీ చేస్తున్న నినాదంపై సీపీఐ(ఎం) స్పందించింది. దీనిని విష కాలంగా అభివర్ణించాలని తెలిపింది. రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని ఆయుధంగా వాడుకుంటూ దేశ రాజ్యాంగంపై దాడిని బీజేపీ ప్రారంభించిందని ఆరోపించింది. " తమ ప్రభుత్వం పేదలకు ఉచిత ...14లో

మోగిన ఎమ్మెల్సీ నగారా

తెలుగు రాష్ట్రాల్లో 14 స్థానాలకు ఎన్నికలు

- తొమ్మిది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు
- తెలంగాణలో చెరొక స్థానానికి పోలింగ్



వివరాలు 5లో..

ఆయిల్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా..

ఏపీలో ఊపిరాడక ఏడుగురు కార్మికులు మృతి 8లో..




ఉత్తరాఖండ్‌లో పేపర్ లీక్ నిరసనపై
లాఠీచార్జ్..

ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై సీబీఐ దర్యాప్తునకు నిరుద్యోగ యువత డిమాండ్

- అవకతవకలపై ఆందోళనకారుల్లో పెల్లుబికిన ఆగ్రహం
- పోలీసుల వీరంగం..పలువురికి గాయాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో నిరుద్యోగ యువత ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకులకు వ్యతిరేకంగా వారు చేసిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఈ ఆందోళనల్లో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిరుద్యోగ యువత ఆందోళన చేస్తున్న డెహ్రాడూన్‌లోని గాంధీ పార్క్ వద్దకు పోలీసులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసులు వారిపై లాఠీచార్జ్ జరిపారు. పోలీసు చర్యతో పలువురు యువకులు గాయపడ్డారు. ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన వివిధ నియామక పరీక్షలలో చోటు చేసుకున్న అవకతవకలపై సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ యువత డెహ్రాడూన్‌లో బుధవారమే ధర్నాకు దిగింది. నియామక పరీక్షల్లో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా వారు నినాదాలు వినిపించారు. అయితే, వారి ధర్నాను బలవంతగా ఎత్తివేయడానికి ...14లో

పసుపు రేటు ఢమాల్

సగానికి పడిపోయిన పసుపు ధర



ఈ సీజన్‌లో పసుపు ధర అమాంతం పడిపోయింది. గతేదాదితో పోల్చితే ఏకంగా సగానికి రేటు పడిపోవడం రైతన్నలను తీవ్రంగా కలిచివేస్తోంది. గతేదాది ఈ సమయానికి రూ.8,500 పలికిన క్వింటా ధర.. ప్రస్తుతం కేవలం రూ.4000-రూ.4200 పలుకుతోంది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు.. ఈ యేదాది భారీ వర్షాల వల్ల పంట దిగుబడి తగ్గిపోయిందని దిగులు చెందుతున్న రైతులకు మార్కెట్‌లో ధర తీవ్ర కలవరం పెడుతోంది.

- రెండు విధాలుగా రైతాంగానికి నష్టం
- ఈ యేడు తగ్గిన దిగుబడి
- సాగు తగ్గించుకుంటాం : రైతన్నలు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రస్తుతం నిజామాబాద్ మార్కెట్‌లో గరిష్టంగా క్వింటాకు కేవలం రూ.5910 మాత్రమే పలకడం గమనార్హం. ఒక పసుపు డ్రమ్ము ఉడికించే వరకు రైతుకు అన్నీ ఖర్చులు కలుపుకుని రూ.3,700 అవుతుంటే.. మార్కెట్‌లో ప్రస్తుతం రూ.2,500 వరకు మాత్రమే వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విధంగా డ్రమ్ము పసుపుకు రూ.1200 వరకు నష్టపోతున్నామని, ఇకపై మెల్లిమెల్లిగా సాగు తగ్గిస్తామని రైతులు పేర్కొంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో ఈ యేడాది 30 వేల ఎకరాల్లో పసుపు పంట సాగయ్యింది. సాధారణంగా 35 వేల ఎకరాల వరకు పంట సాగవ్వాల్సి ఉండగా.. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. అయితే ఈ యేడాది అధిక వర్షాలు రైతును నిండాముంచాయి. అధిక వర్షాల వల్ల పంటలోకి నీరు చేరి దుంప తెగుళ్లు సోకి ఆ ప్రభావం దిగుబడిపై పడింది. ఏదో విధంగా పంటను కాపాడుకుని తీరా మార్కెట్‌కు పంట తీసుకొస్తే మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోయాయి. ఓ వైపు పెద్దఎత్తున పంట వచ్చి మార్కెట్ చేరుతుంటే.. మరోవైపు మార్కెట్‌లో ధర తగ్గింది. ప్రస్తుతం నిజామాబాద్ ...8లో

సంక్షేమం,అభివృద్ధిలో తెలంగాణ ఆదర్శం

- మంత్రి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆలోచనలు, దూరదృష్టితో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం శాసనసభలో పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ జనరంజకంగా ఉందని ప్రశంసించారు.

సుస్థిర ఆరోగ్య వ్యవస్థ ఏర్పాటుకు దోహదం

- కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర బడ్జెట్ 2023-24లో చేసిన భారీ కేటాయింపులతో దేశ ఆరోగ్య వ్యవస్థలో సుస్థిరత నెలకొంటుందని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం రాజ్‌భవన్‌లో ఆరోగ్య సంరక్షణ భావనలు-కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు రూ.89,155 కోట్లను కేంద్రం కేటాయించిన నేపథ్యంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు, సేవలు భారీగా పెరుగుతాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో, చౌకగా వైద్యం అందించేందుకు ఈ బడ్జెట్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Raka

అడిగిందేంటి...చెప్పేదేంటి?

మంత్రి కొప్పులకు ఎంఐఎం కౌంటర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అల్పసంఖ్యాక వర్గాల వారికి బ్యాంకు రుణాల మంజూరీ పథకంపై తాము అడిగిన ప్రశ్నకు మంత్రి చెప్తున్న సమాధానానికి సంబంధం లేదని ఎంఐఎం సభ్యుల అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఐఎం సభ్యుడు జాఫర్ హుస్సేన్ 2016-17 నుంచి 2021-22 మధ్యకాలంలో మైనారిటీ వర్గాల నుంచి బ్యాంకు రుణాల మంజూరీ పథకం కింద దరఖాస్తులు తీసుకోని విషయం వాస్తవమేనా? అని ప్రశ్నించారు. దీనికి అనుబంధంగా స్వీకరిస్తే ఆ దరఖాస్తుల సంఖ్య ఎంత? మంజూరీలు ఎన్ని? అసలు ఈ ప్రక్రియ ఏ దశలో ఉంది? ఐదేండ్లలో పథకాల వారీగా బడ్జెట్ మంజూరీ, వాస్తవ వ్యయాలు ఎంత? అని ప్రశ్నలు అడిగారు. దీనికి ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ సమాధానం చెప్తూ డ్రైవర్ సాధికార కార్యక్రమం కింద లబ్దిదారుల వివరాలను సుదీర్ఘంగా చెప్తుండగా, ఎంఐఎం ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం చెప్పాలని కోరారు. దీనిపై మంత్రి సభ్యులు అడిగిన కాలంలో దరఖాస్తులను స్వీకరించామనీ, కొందరికి బ్యాంకు రుణాలు ఇచ్చామనీ చెప్పుకొచ్చారు. 2016-17లో మైనారిటీల ఆర్థిక సంస్థ డ్రైవర్ సాధికార కార్యక్రమం కింద 3,500 దరఖాస్తులు వస్తే, 409 మందికి బ్యాంకు రుణాలు మంజూరైనట్టు తెలిపారు. 2019-20లో 14,351 దరఖాస్తులు వస్తే, 300 మంది లబ్దిపొందారని వివరించారు. 2018-19, 2021-22లో క్రైస్తవ మైనారిటీ ఆర్థిక సంస్థ డ్రైవర్ సాధికార పథకానికి 503 దరఖాస్తులు వస్తే, 218 మంది లబ్దిపొందినట్టు చెప్పారు. అలాగే బ్యాంకు ద్వారా పొందే రుణ పథకానికి 2019-20లో 3,221 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులు వస్తే, వెయ్యి యూనిట్లు అనుతించామనీ, 113 మందికి సబ్సిడీ విడుదలైందని చెప్పారు. ఈ సమాధానాల పట్ల ఎంఐఎం సభ్యులు సంతృప్తి చెందలేదు.

నకిరేకల్ నుంచి బీఆర్ఎస్‌లోకి వలసలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు, ఒక ఉప సర్పంచ్ వారి అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ మంత్రుల సముదాయంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ మోసం బట్టబయలైందనీ, జాతీయత పేరుతో దేశద్రోహానికి పాల్పడ్డారనీ, ఒకరిద్దరికి దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

NATCO Pharma Limited

Regd. Office: Natco House, Road No.2, Banjara Hills, Hyderabad-500 034, Phone: 040-23547532
Email: investors@natcopharma.co.in CIN: L24230TG1981PLC003201, www.natcopharma.co.in

ప్రకటన

మధ్యంతర డివిడెండ్ మరియు రికార్డు తేది ప్రకటన

కంపెనీ ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా 9 ఫిబ్రవరి, 2023న నిర్వహించబడిన వారి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కంపెనీ యొక్క రూ.2/- ఈక్విటీ వాటా ఒక్కింటికి రూ.1.25 (62.50%) చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించారు. ఇందు నిమిత్తం నిర్ణయించబడిన రికార్డు తేది **21 ఫిబ్రవరి, 2023** నాటికి సదరు వాటాల యొక్క బెనిఫిషియల్ ఓనర్స్‌గా డిపాజిటరీల రికార్డుల్లో లేదా కంపెనీ సభ్యుల రిజిస్టర్లలో పేర్లు కనిపిస్తున్న కంపెనీ యొక్క వాటాదారులకు మధ్యంతర డివిడెండ్ చెల్లించబడును. సదరు మధ్యంతర డివిడెండ్ చెల్లింపు 1 మార్చ్, 2023 నుండి ప్రారంభం అవుతుంది.

for NATCO PHARMA LIMITED
సం/- సిహెచ్.వెంకట్ రమేష్
కంపెనీ సెక్రటరీ & కంప్లియన్స్ ఆఫీసర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09-02-2023

NCL BUILDTEK LIMITED

(Formerly NCL Alltek&Seccolor Limited)
CIN: U72200TG1986PLC006601
#10-3-162, NCL Pearl, 5th Floor, Opp.: Hyderabad Bhawan (Near Rail Nilayam), Sarojini Devi Road, East Maredpally, Secunderabad – 500026
Ph. No.040 - 68313333 / 3346, Website: www.nclbuildtek.com
Email: companysecretary@nclbuildtek.com;

మధ్యంతర డివిడెండ్, రికార్డు తేదీ& పుస్తక ముగింపునకు సంబంధించిన ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు **గురువారం, 09, ఫిబ్రవరి,2023** తేదీన నిర్వహించుకున్న సమావేశంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి **మధ్యంతర డివిడెండ్‌ను 15శాతం** అనగా ప్రతి ఒక్క రూ.10 విలువ కలిగిన ఈక్విటీ వాటాపై రూ. 1.50/-గా నిర్ణయించడం జరిగింది.

ఇంకనూ, కంపెనీల చట్టం,2013 ప్రకారం వర్తింపదగిన నిబంధనలకు అనుగుణంగా, కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్లు 09, ఫిబ్రవరి,2023 తేదీన నిర్వహించుకున్న సమావేశంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి **'రికార్డు తేదీ'గా శుక్రవారం,17, ఫిబ్రవరి,2023** నిర్ణయించబడింది మరియు దీనికి అనుగుణంగా మధ్యంతర డివిడెండ్ యొక్క చెల్లింపును రూఢీ చేయడం కోసం నిర్ణయం తీసుకోవడం జరిగింది.

ఇంకనూ ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనా కంపెనీ యొక్క సభ్యుల యొక్క **రిజిస్టర్ & వాటాల యొక్క బదిలీ పుస్తకాలు** మధ్యంతర డివిడెండ్ నిమిత్తం **తేది:18,ఫిబ్రవరి,2023 నుంచి 20,ఫిబ్రవరి, 2023 వరకు** (రెండు రోజులు కలుపుకొని) మూసివేయబడి ఉంటాయని తెలియజేయనైనది.

For NCL Buildtek Limited
(Formerly NCL Alltek & Seccolor Ltd)
సం/-
యు.దివ్య భారతి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది:09-02-2023

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ)

సర్కిల్ శాస్త్ర- హైదరాబాద్, రీజెన్సీ ప్లాజా, మైత్రి వివార్ ఏరియా, గాయత్రి నగర్, ప్లాట్‌నెం.3, అమీర్‌పేట్, హైదరాబాద్ 500 038. ఇ-మెయిల్: cs4732@pnb.co.in

అనుబంధం-4 (రూల్ 8(1) ప్రకారం)
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

దిగువ పేర్కొన్న సంతకందారు మరియు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (ఇ-ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(12)తో పాటు చదవదగిన రూల్ 3కు అనుగుణంగా రుణగ్రహీతలు/హామీదారులు/తనఖాపెట్టినవారు: **మెసర్స్ వసంతవాణి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్, శ్రీ సిహెచ్ భరత్ మరియు శ్రీమతి సిహెచ్ శ్రీవాణి** గారు బకాయి ఉన్న నోటీసులో పేర్కొన్న విధంగా తేది:30-09-2022 నాటికి బకాయి ఉన్న రూ. 11,60,538.53 (రూపాయలు పదకొండు లక్షల అరవై వేల ఐదు వందల ముప్పై ఎనిమిది మరియు యాభై మూడు పైసలు మాత్రమే) మరియు తేది:01-10-2022 నుంచి చెల్లించాల్సిన భవిష్య వడ్డీ,కాస్టులను కలుపుకొని చెల్లించాలని కోరుతూ **29-10-2022** తేదీన డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది. డిమాండ్ నోటీసు పంపించిన తర్వాత కొంత మొత్తాన్ని ఇప్పటికే చెల్లించడం జరిగింది. మిగతా మొత్తాన్ని సదరు నోటీసు ముట్టిన తేదీ నుంచి 60రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది.

రుణగ్రహీత బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువపేర్కొన్న అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(4) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని మరియు దీనితో పాటు చదవదగిన రూల్ 8 ప్రకారం **08, ఫిబ్రవరి,2023** తేదీన దిగువ పేర్కొన్న ఆస్తులను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఇందుమూలంగా రుణగ్రహీతకు ప్రత్యేకించి మరియు సమస్త ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా సదరు సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు. ఎలాంటి లావాదేవీలు నిర్వహించినా **పంజాబ్ నేషనల్ బ్యాంక్** (ఇ-ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్) యొక్క ఛార్జికు లోబడి ఉంటుందని హెచ్చరించడమైనది. రుణగ్రహీత **తేదీ:30-09-2022** నాటికి బకాయి ఉన్న **రూ.11,60,538.53 (రూపాయలు పదకొండు లక్షల అరవై వేల ఐదు వందల ముప్పై ఎనిమిది మరియు యాభై మూడు పైసలు మాత్రమే)** మొత్తాన్ని భవిష్య వడ్డీ మరియు కాస్ట్‌లో కలుపుకొని 01-10-2022 నుంచి లెక్కించి చెల్లించాల్సి ఉంటుంది. డిమాండ్ నోటీసు పంపించిన తర్వాత ఇప్పటికే కొంత మొత్తాన్ని చెల్లించడం జరిగింది.

స్థిరాస్తికి సంబంధించిన వివరాలు :

ఆస్తికి సంబంధించి ప్లాట్ నెం.32లోని ఖాళీ నివాసం, దీని యొక్క విస్తీర్ణం 266.66చ.గ. సర్వే నెం.249 మరియు 250, బి.మాధారం రెవెన్యూ గ్రామం, వార్డు నెం.1, బ్లాక్ నెం.2, సూర్యాపేట మున్సిపాలిటీ లిమిట్స్, సూర్యాపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సదరు ఆస్తి శ్రీమతి చింతలపాటి శ్రావణి మరియు దీని యొక్క హద్దులు: ఉత్తరం: 25"-00 వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.33, తూర్పు: ప్లాట్ నెం.31, పడమర: 25"-00 వెడల్పు రోడ్డు.

తేది:08-02-2023
ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్ (ఇఓబిసి), హైదరాబాద్.

TRIMURTHI LIMITED

CIN: L67120TG1994PLC018956
Regd Off: 5-8-354/1106, Office No. 1106, Ratna Block, Raghav Ratna Towers, Chirag Ali Lane, Hyderabad, Telangana - 500001; Ph: 040-24757370;
E: info@trimurthidrugs.com; W: www.trimurthidrugs.com

30 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం & కాలవ్యవధికి ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలు సారాంశం

(ఇపిఎస్ మినహా రూ.లక్షల్లో)

క్ర. స	వివరాలు	ముగిసిన త్రైమాసికం 13.12.2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన కాలవ్యవధి 31.12.2012 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 13.12.2021 (ఆడిట్‌చేయనివి)
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం (నికర)	60.91	82.20	15.93
2.	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటంకు ముందు)	6.54	(7.25)	(8.06)
3.	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	6.54	(7.25)	(8.06)
4.	పన్ను తరువాత కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటం తరువాత)	6.09	(7.36)	(1.28)
5.	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (కాలవ్యవధి కొరకు కంప్రైజింగ్ లాభం/(నష్టం) (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)	6.09	(7.36)	(1.28)
6.	ఈక్విటీ వాటా మూలధనం	81.00	81.00	81.00
7.	రిజర్వులు (గత సంవత్సరం యొక్క ఆడిట్‌చేసిన బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా (రివాల్యూవేషన్ రిజర్వులు మినహాయించి)	(85.69)	(85.69)	70.34
8.	వాటా ఒక్కింటికి రాబడి (రూ. 10/-ల చొప్పున) (కొనసాగుతున్న ఆపరేషన్ల కొరకు)			
	1. బేసిక్:	0.08	(0.09)	(0.02)
	2. డైల్యూటెడ్:	0.08	(0.09)	(0.02)

గమనిక: సెబీ (లిస్టింగ్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద బిఎస్ఇతో దాఖలుచేయబడిన 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు కాలవ్యవధి కొరకు వివరణాత్మక ఫార్మాట్‌కు పై పేర్కొన్నవి సారాంశం. 31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు కాలవ్యవధి ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి వివరణాత్మక నివేదిక స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ www.bseindia.com పై మరియు కంపెనీ వెబ్‌సైట్: www.trimurthidrugs.com పై అందుబాటులో ఉంటాయి.

For Trimurthi Limited
సం/-
(అరుణ్‌కుమార్ భంగాడియా)
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ (DIN: 00021024)

తేది: 09.02.2023
ప్రదేశం: హైదరాబాద్

Canara Bank (केनरा बैंक) — Syndicate

రికవరీ సెక్షన్ రీజినల్ ఆఫీస్-1, హైదరాబాద్. మొబైల్: 9440905223
ల్యాండ్ లైన్ నెంబర్:040- 23311943
E-mail- rohyd1rec@canarabank.com

విక్రయ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) ప్రకారం ఇ-వేలం ద్వారా స్థిరాస్తుల అమ్మకం యొక్క విక్రయ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారుడు/లకు తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న స్థిరాస్తిని సెక్యూర్డ్ క్రెడిటార్ వద్ద తనఖాపెట్టబడింది/ఛార్జ్ చేయబడింది. సదరు ఆస్తిని కెనరా బ్యాంక్, జహనుమా బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి వారు నిర్మాణాత్మకంగా/భౌతికంగా తమ స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది. సదరు ఆస్తిని "ఎక్కడైతే ఉన్నదో అలాగే" "ఏదైతే ఉన్నదో అదే" మరియు "ఎలాగైతే ఉన్నదో అలాగే" అనే ప్రాతిపదికన బకాయి ఉన్న రూ.12,11,581.47/- (తేది:31-01-2023 నాటికి ఒప్పంద బకాయిలు) రాబట్టేందుకు 13-03-2023 తేదీన ఇ-వేలం నిర్వహించి విక్రయించనున్నారు. కెనరా బ్యాంక్, జహనుమా బ్రాంచ్ వారికి శ్రీ సయ్యద్ అమీనుద్దీన్ గారు పైన పేర్కొన్న బకాయి చెల్లించాల్సి ఉన్నారు.

రిజర్వ్ ధర రూ.26,43,000/- (రూపాయలు ఇరవై ఆరు లక్షల నలభై మూడు వేలు మాత్రమే) మరియు ధరావత్తు (ఇఎండి) రూ.2,64,300/- (రూపాయలు రెండు లక్షల అరవై నాలుగు వేల మూడు వందలు మాత్రమే) ధరావత్తు (ఇఎండి) మొత్తాన్ని 10-03-2023 తేదీన సాయంత్రం గం.5-00లోపు చెల్లించాలి.

స్థిరాస్తి యొక్క పూర్తి వివరాలు: ఆస్తికి సంబంధించి ఇంటి నెం.20-7-399/బి, విస్తీర్ణం 93చ.గ. లేదా 77.84చ.మీ. మొహమ్మద్ షేకూర్ కమాన్ లోపల, ఫతేహ్ దర్వాజ, షా అలి బండ, హైదరాబాద్ మరియు దీని యొక్క హద్దులు: ఉత్తరం: పొరుగువారి యొక్క నివాసం, దక్షిణం: విడుదల చేస్తున్నవారి యొక్క నివాసం, తూర్పు: పొరుగువారి నివాసం, పడమర: డెడ్ లైన్ (ఆస్తి యజమాని: శ్రీ సయ్యద్ అమీనుద్దీన్, తండ్రి:సయ్యద్ హమీద్) (డీడ్ నెం.879/1992, తేది:28-07-1992, ఎస్ఆర్ఓ. దూద్‌బౌలి సెర్వాయి ఐడి: 400054124559)

- బ్యాంకుకు ఉన్న పరిజ్ఞానం మేరకు సదరు ఆస్తిపై ఎలాంటి తాకట్టులు లేవు.
- బ్యాంక్ వారు సదరు ఆస్తిని లాంఛనప్రాయంగా తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయానికి సంబంధించిన షరతులు మరియు నిబంధనల కోసం దయచేసి కెనరా బ్యాంక్ యొక్క వెబ్‌సైట్ www.canarabank.comలో పొందుపర్చిన "ఇ-వేలం" లింక్‌ను సంద్శించాలి లేదా శ్రీ వి.శ్రీధర్, బ్రాంచ్ హెడ్, జహనుమా బ్రాంచ్, హైదరాబాద్, కెనరా బ్యాంక్ వారిని ఫోన్ నెం.9491578548, 9440905045 లపై అన్ని పని దినాల్లో కార్యాలయం వేళల్లో సంప్రదించవచ్చును.

గమనిక: ఎ) రిజర్వ్ ధర నుండి 10శాతం ఇఎండిని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, జహనుమా బ్రాంచ్ వద్ద డిపాజిట్ చేయాలి లేదా ఆర్‌టిజిఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, జహనుమా బ్రాంచ్‌లో జమ చేయాలి. అకౌంట్ నెం.209272434, ఐఎఫ్ఎస్‌సి కోడ్: సిఎన్ఆర్‌బి0013058 వద్ద జమ చేయాలి. బి) అధీకృత అధికారి నుండి ముందస్తుగా అనుమతి పొంది ఆస్తిని 09-03-2023 తేదీన ఉదయం గం.11-00 నుంచి మధ్యాహ్నం గం.3-00లోపు తనిఖీ చేసుకోవచ్చును. సి) రిజర్వ్ ధర వద్ద పైన సూచించిన విధంగా వేలం ప్రారంభించబడును. వేలందారులు వారి యొక్క బిడ్‌ను రూ.50,000/- యొక్క గుణిజాల్లో పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. వేలందారుల్లో ఎవరైతే గరిష్ట మొత్తంలో బిడ్‌ను సమర్పిస్తారో వారిని (రిజర్వ్ ధర కంటే అధికంగా) "ఆన్‌లైన్" ముగింపు తర్వాత సఫలీకృతులైన వేలందారుల పేరు ప్రకటించబడును. సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క నిర్ణయాధికారం మేరకు సఫలీకృతులైన బిడ్డర్ పేరిట విక్రయం నిర్వహించి సఫలీకృతులైన బిడ్డర్ పేరు ప్రకటించబడును. ఇ) వేలం నిర్వహణ ప్రదేశం: ఆన్‌లైన్ ద్వారా

తేది:08-02-2023, ప్రదేశం: హైదరాబాద్
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

TATA

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డు చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సులా బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబయి-400013. బ్రాంచ్ చిరునామా: టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.54-15-45/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ భవనం, విజయవాడ- 520 008

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

(ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 9(1) క్రింద)

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(1) యొక్క నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి దిగువ రుణగ్రహీత/సహ-రుణగ్రహీత, లేదా వారి చట్టబద్ధ వారసులు/ ప్రతినిధులు (రుణగ్రహీత)లకు ప్రకటన ఇవ్వడమేమనగా, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (TCHFL)కు తాకట్టుపెట్టబడిన దిగువ వివరించిన స్థిరాస్తిని టిసిహెచ్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడినది, అవి దిగువ పేర్కొనబడిన రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతల నుండి బాకీపడిన బకాయిల రికవరీ కొరకు **"ఎక్కడ ఉన్నది & అది అక్కడ అలాగే" మరియు"ఉన్నది ఉన్నట్లుగా" 27-02-2023**న విక్రయించ బడుతుంది. రిజర్వు ధర మరియు ధరావత్తు దిగువ పేర్కొనబడినవి. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, అమ్మకంలో ఏవేని వాయిదాలు/ నిలిపివేయుటలో ఏవేని గైర్హాజరులో, సదరుసెక్యూర్డ్ అసెట్/ఆస్తిని ఇ-వేలం ద్వారా సదరు **27-02-2023**న **మ.2.00గం.ల**కు విక్రయించబడుతుంది. బ్రాంచ్ చిరునామా:**టాటాక్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**, డోర్ నెం.54- 15/45/1, 5వ అంతస్తు, ఆర్‌కె గల్లేరియా, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, సర్వీస్ రోడ్, స్వీట్ మ్యాజిక్ దగ్గర, ఎస్‌బిఐ బిల్డింగ్, విజయవాడ-520008 వద్ద ఇ-వేలంలో పాల్గొనుట కొరకు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ కలిగియున్న సీల్డు ఎన్వలప్‌ను **25-02-2023**న **సా.5.00గం.ల** వరకు లేదా ముందుగా టిసిహెచ్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారికి దాఖలు చేయబడాలి.

సెక్యూర్డ్ అసెట్/స్థిరాస్తి అమ్మకం అనునది "ఎక్కువ ఉన్నది అది అక్కడ వరకుపై" జరుపబడుతుంది, సంక్షిప్త వివరాలు దిగువ పేర్కొనబడినవి.

క్ర. సం.	రుణ ఖాతా నెం	రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధి/ హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వు ధర	ధరావత్తు	స్వాధీనతా రకం
9	9581676	శ్రీమతి ఆర్.మీనాక్షి, శ్రీ.ప్రేమ్‌కుమార్ చెవిటి	రూ.6,71,748/- (రూపాయలు లక్షల డెబ్బై.కటి వేల ఏడువందల నలభై ఎనిమిది మాత్రమే)& 11-05-2022	రూ.12,90,000/- (రూపాయలు పన్నెండు లక్షల తొంభైవేలు మాత్రమే)	రూ. 1,29,000/- (రూపాయలు ఒక లక్ష ఇరవై తొమ్మిది వేలు మాత్రమే)	భౌతికంగా

స్థిరాస్తి యొక్క వివరణ: డ్రీమ్ వ్యాలీ, జహీరాబాద్ టౌన్ మరియు తహశీల్ మెదక్ జిల్లా, తెలంగాణ, రిజిస్ట్రేషన్ జిల్లా మెదక్ సంగారెడ్డి వద్ద సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా జహీరాబాద్ వద్దగల 200చ.గ.ల ఏరియాకు సమానమైన విస్తీర్ణంతో సర్వేనెం.ల 264/E, 265/E, 266/E, 267/E, 264/A, 265/A, 266/A, 267/A, 264/RU2, 265/RU2, 266/RU2, 267/RU2, 264/AA, 265/AA, 266/AA, 267/AA, 264/UU, 265/UU, 266/UU, 267/UU, 264/EE, 265/EE, 266/EE, 267/EE, 264/RU and 265/RUలోని నివాసిత ఓపెన్ ప్లాట్‌నెం.228 యొక్క మొత్తంభాగం మరియు **సరిహద్దులు: తూర్పు**: 40'అ.రోడ్డు, **పడమర**: ప్లాట్ నెం.290/1, **ఉత్తరం**: ప్లాట్‌నెం.289, **ఉత్తరం**: ప్లాట్ నెం.289.

గమనిక: థర్డ్ పార్టీ వారిపేరున రుణగ్రహీతచే నిర్వహించిన రిజిస్టర్డు సేల్ డీడ్ నెం.3673/2021 (ఎస్ఆర్ఓ. జహీరాబాద్) వారిఎంట్రీలో ఆస్తి రికార్డుప్రతిబింబిస్తుంది. సదరు సేల్ డీడ్ టిసిహెచ్ఎఫ్ఎల్ అనుమతి లేకుండా రిజిస్టర్డు చేయబడినది & నిర్వహించబడినది. ఆస్తిపై ఎక్స్‌క్లూసివ్ ఛార్జ్‌ను TCHFL కలిగియుంది.

క్ర. సం.	రుణ ఖాతా నెం	రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు)/ చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధి/ హామీదారుల పేరు	డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం	రిజర్వు ధర	ధరావత్తు	స్వాధీనతా రకం
2.	10390190	శ్రీ. బోజెపూడి నగేష్ (రుణగ్రహీత) శ్రీమతి బోజెపూడి భారతి (సహ-రుణగ్రహీత)	Rs.22,30,210/- & 19.03.2020	రూ.9,90,000/- (రూ.తొమ్మిది లక్షల తొంభై వేలు మాత్రమే)	రూ.99,000/- (రూ.తొంభై తొమ్మిది వేలు మాత్రమే)	భౌతికంగా

స్థిరాస్తి యొక్క వివరణ: గుంటూరు జిల్లా, నర్సరావుపేట రెవెన్యూ జిల్లా, అమరావతి ఎస్ఆర్ఓ, దిదుగు గ్రామం వద్దగల హరిత ఇన్‌ఫ్రా మరియు డెవలపర్స్ ఫేజ్-1లోని హౌసింగ్ ప్లాట్లలోకి విభజించిన పూర్తి ఎకరాల 2-40 గుంటల భూమిలోని ఎకర0-57 గుంటల విస్తీర్ణపు డోర్ నెం.116-1 మరియు ఎక 1-83 సెంట్ల విస్తీర్ణపు డోర్ నెం.116-3 వద్దకలవి, అటి345చ.గ.ల విస్తీర్ణపు అందులోఒకటైన ప్లాట్‌నెం.4 అనునది ఎల్.పి.నెం.20/2018/జిఎస్‌బి ఆధారంగా APCRDA ద్వారా ప్లాన్ లేఅవుట్ ఆమోదం పొందినది. **సరిహద్దులు: తూర్పు**: లేఅవుట్ ప్లాన్ ఖాళీ సైట్ 46-0" వెడల్పు, **దక్షిణం**: గంగిరెడ్డి రామిరెడ్డి 62-2" అడుగుల ఆస్తి, పడమర: 60-0 అడుగుల వెడల్పు సర్వారు దొంక 47-3" అడుగులు, **ఉత్తరం**: లేఅవుట్ ప్లాన్ ప్లాట్ నెం.03, 72-10" అడుగులు. ఈ నాలుగు సరిహద్దులలోపు 345చ.గ.ల లేదా 288.42చ.మీ.ల సైటు విస్తీర్ణం ప్లాట్ నెం.4 ఉంది.

వేలం వద్ద, సర్వజనులను వ్యక్తిగతంగా వారి బిడ్(లు) దాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నవి. రుణగ్రహీతలు/ సహ-రుణగ్రహీతలకు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 15 రోజుల్లోపు తదుపరి వడ్డీతో పూర్తి బకాయిలను చెల్లించుటకు చివరి అవకాశం ఇవ్వబడుతున్నది, విఫలం చెందితే షెడ్యూలు ప్రకారం స్థిరాస్తి విక్రయించబడును. అధీకృత అధికారికి వడ్డీ& ఖర్చులు (అమ్మకం ఖర్చులతోసహా), పై పేర్కొన్న బకాయి మొత్తాలను చెల్లించినట్లైతే లేదా వేలం తేదికి ముందు అట్టి సెక్యూర్డ్ డెట్ మొత్తాలను వడ్డీ మరియు ఖర్చులను చెల్లించినట్లు అతని సంతృప్తి మేరకు రుజువును ఇచ్చినట్లైతే ఇ-వేలం నిలిపి వేయబడుతుంది. ఈ అమ్మకంతో సంబంధించి విధులను నిర్వహించుటకు వేరే ఏ అధికారి లేదా ఇతర వ్యక్తి లేరు, అయితే, నేరుగా లేదా నేరుగా కాకుండా స్థిరాస్తి అమ్మకంలో ఏవేని ఆసక్తి ఉన్న హాజరవచ్చును.

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో నిర్దేశించిన నియమాలు మరియు దిగువ తదుపరి షరతుల ప్రాతిపదికన అమ్మకం ఉంటుంది:
గమనిక: ఇ-వేలం అనునది **27.02.2023**న **మ.2.00గం.ల** నుండి **మ.3.00గం.ల** మధ్య ప్రతి **10** నిమిషాల పరిమిత పొడిగింపుతో పోర్టల్: https://www.bankeauctions.com ద్వారా చేపట్టబడును.

నియమ & నిబంధనలు: 1) ఇందు దిగువ షెడ్యూలులో ప్రత్యేకించి సూచించినవి క్రింది సంతకందారు యొక్క సమాచారం మేరకు ఉంది, కాని ఈ ప్రకటనలో ఏవేని లోపాలు, తప్పులకు క్రింది సంతకందారు బాధ్యులు కారు. బిడ్ మొత్తంలో ఏవేని వివాదం ఏర్పడిన సందర్భంలో లేదా బిడ్డరుదారుగా, సెక్యూర్డ్ క్రెడిటర్ నిర్ణయం ప్రాతిపదికన మరొకసారి స్థిరాస్తి వేలం పెట్టబడుతుంది.
2) స్థిరాస్తిని రిజర్వు ధరకు తక్కువకు విక్రయించబడదు.
3) బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- (పది వేలు మాత్రమే).
4) ఆస్తి కొనుగోలు కొరకు దాఖలుచేయబడిన బిడ్సన్నీ **"టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్"** పేరున బ్రాంచ్ చిరునామా వద్ద చెల్లుబడు నట్లుగా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో పై పేర్కొన్నట్లుగా ధరావత్తు కలిగియుండవలెను. వేలం తరువాత గెలుపొందని బిడ్డరుదారులకు డిమాండ్ డ్రాఫ్టులు తిరిగి ఇచ్చి వేయబడుతాయి.
5) సఫలీకృత బిడ్డరుదారును గెలుపొందిన బిడ్డరుదారుగా ప్రకటించబడును మరియు బిడ్‌కు చట్టబద్ధంగా అర్హుడైనాడని అతన్ని/ఆమెకు సమకూర్చబడుతుంది మరియు బిడ్ మొత్తం రిజర్వు ధరకు తక్కువగా లేదని సమకూర్చబడుతుంది. ఇది అధీకృత అధికారి నిర్ణయం మేరకు ఆఫర్ దర స్పష్టతలేనట్లు భావించబడి రద్దు చేయబడుతుంది.
6) కారణాలకు రికార్డు చేయబడిన, అధీకృత అధికారి నిర్ణయం మేరకు అమ్మకం నిలిపి వేయబడుతుంది/ వాయిదా వేయబడుతుంది.
7) ముందస్తు అనుమతితో స్థిరాస్తి పరిశీలించుట **20.02.2023**న ఉ.11.00గం.ల నుండి సా.5.00గం.ల మధ్య చేయవచ్చును.
8) గెలుపొందిన బిడ్డరుగా ప్రకటించబడిన వ్యక్తి, ప్రకటించబడిన తరువాత వెంటనే 24 గంటల్లోగా అధీకృత అధికారికి కొనుగోలుచేసిన సొమ్ము/ బిడ్ మొత్తానికి ఇరువై-ఐదు శాతం డిపాజిట్ చేయవలసి ఉంటుంది మరియు అట్టి డిపాజిట్ చేయుటలో విఫలం చెందినట్లైతే, తాజా వేలం/ ప్రైవేట్ ట్రీటీ ద్వారా అమ్మకం పెట్టుటకు ఆస్తి జప్తుచేయబడుతుంది.
9) పై విధంగా ప్రారంభ డిపాజిట్ చేసిన, కొనుగోలు చేసిన మొత్తాల యొక్క మిగతా మొత్తాలను ఆస్తి అమ్మకం ఆమోదించబడిన తేదికి ముందు 15వ రోజున లేదా ముందుగా అధీకృత అధికారికి కొనుగోలుదారుచే చెల్లించవలసి ఉంటుంది లేదా 15వ రోజున ఆదివారం లేదా ఇతర సెలవుదినమైనచో, 15వ రోజున తరువాత మొదటి ఆఫీసు దినమున చెల్లించవలసి ఉంటుంది.
10) పైన పేర్కొన్న కాలవ్యవధిలోగా ఏవేని చెల్లింపులు చేయుటలో డిఫాల్టుచెందిన సందర్భంలో, ఆస్తిని తాజా వేలం/ప్రైవేట్ ట్రీటీ అమ్మకంకు పెట్టబడును. ధరావత్తుతోపాటు డిపాజిట్‌చేసిన మొత్తాలను **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**‌చే జప్తు చేయబడుతుంది మరియు డిఫాల్ట్ చెందిన కొనుగోలుదారు ఆస్తికి అన్ని క్లెయింలు పోగొట్టుకుందురు.
11) ఆస్తికి సంబంధించి **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**‌కు తెలిసిన ఏవేని రుణభారాల వివరాలు: నిల్. ఆస్తికి పంపబడిన ఏవేని క్లెయింలను మరియు దీని స్వభావం పైఏవేని ఇతర తెలిసిన వివరాలు & విలువ: నిల్. ఆస్తిపన్ను, ఎలక్ట్రిసిటీ బకాయిలు చట్టబద్ధమైన బాకీలతోసహా ఆస్తిపైగల రుణభారాల గురించి ఆసక్తిగల బిడ్డరుదారు స్వంతంగా స్వతంత్రంగా విచారణ చేసుకోవాలి.
12) ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణకు విధానం కొరకు లేదా ఏవేని ఇతర వివరాలకు సర్వీస్ బిడ్డరుదారులు వీరిని సంప్రదించవచ్చు: సర్వీస్ ప్రొవైడర్, సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, చిరునామా: సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 3వ అంతస్తు, ప్లాట్ నెం.68, సెక్టార్-44, గుర్గామ్, హర్యానా-122003, మొబైల్: 8866682937 & ఫోన్: 7291981124/ 1125/1126, ఇ-మెయిల్ ఐడి: gujarat@c1india.com/ support@bankeauctions.com లేదా మనీష్‌బన్సాల్, ఇమెయిల్ ఐడి:Manish.Bansal@tatacapital.com, అధీకృత అధికారి, మొబైల్ నెం: 8588983696, వాట్సాప్ నెంబరు-9999078669 పై దయచేసి మీ ప్రశ్నను పంపండి.
13) అత్యధిక ప్రకటించిన బిడ్ మొత్తంలో అత్యధిక బిడ్డరుదారుచే 1% టిడిఎస్ చెల్లించాలి. అవసరమైన చెల్లింపును యజమాని/ రుణగ్రహీతల పాన్‌లో అత్యధిక బిడ్డరుచే డిపాజిట్‌చేయాలి మరియు చలాన్ కాపీని మా కంపెనీకి సమర్పించాలి.
14) పై పేర్కొన్న వివరాలకు దయచేసి సెక్యూర్డ్ క్రెడిటర్ వెబ్‌సైట్: https://bit.ly/3JN5Ilu లో ఇవ్వబడిన దిగువ లింకును పరిశీలించవచ్చును.
15) దయచేసి లింక్: https://www.tatacapital.com/property-disposal.html ను కూడా దర్శించండి.
దయచేసి గమనించండి: ఈ ఆస్తి అమ్మకం/ వేలం కొరకు పేర్కొన్న వేలం పార్ట్‌నర్ కాకుండా ఎవరైనా బ్రోకర్/ ఏజెంట్‌ను టిసిహెచ్ఎఫ్ఎల్ నియమించలేదు. ఈ విషయంలో అన్ని ప్రశ్నలు& విచారణకు క్రింది సంతకందారు లేదా అధీకృత అధికారిని మాత్రమే ఆసక్తిగల పార్టీలు సంప్రదించాలి.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 10-02-2023
సం/- అధీకృత అధికారి,
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

ICICI Bank — బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్స్, బొమ్మనహల్లి హొసూర్, మెయిన్ రోడ్, బెంగళూరు-560068.

దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు వారు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్ట్ చెందినందున మరియు రుణాలు నాన్- పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసును వారి గతంలో తెలిసిన చిరునామాలు కలిగిన వారికి నోటీసు జారీచేయబడినది, అయితే, అది వారికి చేరకుండానే వెనుదిరిగింది కావున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేస్తున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నెంబరు) & చిరునామా	సెక్యూర్డ్ అసెట్/ స్వాధీనం చేసుకొను ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేది/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1.	బరెడ్డి కుమార్/ బరెడ్డి వెంకట లక్ష్మి గౌతమి/ ప్లాట్ నెం.549, నిర్మించిన ఇల్లు, బడంగ్‌పేట్ గ్రామం, బాలాపూర్ మండలం, సర్వే నెం.76 నుండి 80, హైదరాబాద్/500058/ LBHYD00004985378	బడంగ్‌పేట్ గ్రామం, బాలాపూర్ మండలం, గతంలో సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట్ నగర పంచాయతీ పరిధిలోని సర్వే నెం.76 నుండి 80లోని ఆర్‌సిసి రూఫ్‌తో 1295చ.అ.ల ప్లింత్ ఏరియా కలిగియున్న 300చ.గ.లు లేదా 250.8చ.మీ.లకు సమానమైన ప్లాట్ నెం.549పై ఇంటి నెం.45-549 యొక్క అవరణ మొత్తం భాగం మరియు పరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.550, దక్షిణం: ప్లాట్ నెం.548, తూర్పు: ప్లాట్ నెం.530, పడమర: రోడ్డు.	15.11.2022 Rs. 54,34,595.00/-	06.05. 2022

నోటీసు సరిగా బట్వాడాఅగుట కొరకు తగిన చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/ మరియు/లేదా వారి హామీదారులు (వర్తించినట్లుగా) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవటంతో పాటు ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులు కాలవ్యవధిలోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: ఫిబ్రవరి 10, 2023
ప్రదేశం: హైదరాబాద్
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

ICICI Bank — బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహల్లి హొసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూర్-560068.

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత/లు బ్యాంక్ నుంచి పొందిన రుణాలకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో విఫలమైన కారణంగా వారి యొక్క రుణాలను నాన్ పెర్ఫామింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించడం జరిగింది. సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం వారి యొక్క చివరిగా తెలిసిన చిరునామాలకు నోటీసులు పంపడం జరిగింది. అయితే, అవి బట్వాడా కాకుండా తిరుగు రశీదు లేకుండా వచ్చిన కారణంగా బహిరంగ ప్రకటన ద్వారా ఇందుమూలంగా తెలియజేయనైనది.

క్ర. సం.	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారుడు పేరు/ (లోన్ అకౌంట్ నెంబర్) & చిరునామా	సెక్యూర్డ్ అస్సెట్ యొక్క ఆస్తి చిరునామా/ ఎన్‌ఫోర్స్ చేయాల్సిన ఆస్తి	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేదీ నాటికి బకాయి ఉన్న మొత్తం	ఎన్‌పిఏ తేది
1.	నవీన్ సాంఘి/ విపిన్ అనిల్ సాంఘి/ రాజ్‌కుమార్ అగర్వాల్/ సాంఘి ఆటోమోటివ్ ప్రయివేట్ లిమిటెడ్/ దీప సాంఘి/32బి బ్లాక్, రాఘవేంద్ర నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, 50 4 50 5 50 6 బుద్వేల్‌ల్లోఖ్డా గ్రామం, హైదరాబాద్-500 053/ఎల్‌బిహెచ్‌వైడి 00001120962	షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ప్లాట్ నెం.32, బి బ్లాక్, సర్వే నెంబర్లు 50/4, 50/5& 50/6, విస్తీర్ణం 622.00చ.గ. లేదా 519.9 చ.మీ. రాఘవేంద్ర నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్, బుద్వేల్‌ల్లోఖ్డా గ్రామం, జిహెచ్ఎంసి పరిధి, రాజేంద్రనగర్ సర్కిల్, ఏపి మరియు దీని యొక్క హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.19-బి, దక్షిణం: 45'వెడల్పు రోడ్డు, తూర్పు: 45' వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.33-బి	22.11.2022 Rs. 1,99,54,809/-	16/05/ 2022

సబ్‌స్టిట్యూటెడ్ విధానాల ద్వారా నోటీసులు పంపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. పైన పేర్కొన్న రుణగ్రహీత/లు/ మరియు/లేదా వారి యొక్క హామీదారులకు (వర్తింపదగినట్లయితే) ఇందుమూలంగా కోరడమేమనగా నోటీసు ప్రకటన తేదీ నుంచి బకాయి ఉన్న మొత్తాన్ని 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలి, ఒకవేళ నిర్దిష్ట గడువులోపు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనట్లయితే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేయనైనది.

తేది: 10 ఫిబ్రవరి, 2023
ప్రదేశం:హైదరాబాద్ & రంగారెడ్డి
అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

JAYPEE GROUP

ANDHRA CEMENTS LIMITED

Regd. Office : Sri Durga Cement Works, Sri Durgapuram - 522 414, Guntur Dist., (A.P.)
Website: andhracements.com, E-mail Id: investorcell@andhracements.com,
CIN No. L26942AP1936PLC002379

STATEMENT OF UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED DECEMBER 31, 2022

(Rs. In Lakhs except EPS)

Sr No	Particulars	Quarter ended 31.12.2022 (Unaudited)	Nine Months Ended 31.12.2022 (Unaudited)	Quarter ended 31.12.2021 (Unaudited)	Year ended 31.03.2022 (Audited)
1	Total Income	(5)	37	14	61
2	Net Profit/(Loss) for the period before Tax and Exceptional items	(5,743)	(17,239)	(5,452)	(23,496)
3	Net Profit/(Loss) for the period before Tax but after Exceptional items	(5,743)	(17,239)	(5,452)	(23,630)
4	Net Profit/(Loss) for the period after Tax and Exceptional items	(5,743)	(17,239)	(5,452)	(23,630)
5	Total Comprehensive Income for the period [Comprising Profit/(Loss) for the period (after tax) and Other Comprehensive income (after tax)]	(5,743)	(17,239)	(5,452)	(23,630)
6	Paid-up Equity Share Capital (Face value Rs.10/- per share)	29,352	29,352	29,352	29,352
7	Reserve (excluding Revaluation Reserves as shown in the Audited Balance Sheet of previous year)	(121,013) (As on 31.03.2022)	(121,013) (As on 31.03.2022)	(97,383) (As on 31.03.2021)	(121,013) (As on 31.03.2022)
8	Earning Per Share (of Rs. 10/- each) (for continuing and discontinued operations)				
	a) Basic	(1.96)	(5.87)	(1.86)	(8.05)
	b) Diluted	(1.96)	(5.87)	(1.86)	(8.05)
		Not Annualised	Not Annualised	Not Annualised	Annualised

Note :
1. The above results were reviewed and recommended by the Audit Committee and approved subsequently by the Board of Directors at their respective meetings held on February 9, 2023. The Statutory Auditors have conducted limited review of these results in terms of regulation 33 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015 (SEBI-LODR).
2. The above is an extract of the detailed format of Quarterly and Yearly Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the SEBI (Listing Obligation and Disclosure Requirements) Regulation, 2015. The full format of the Quarterly and Yearly Financial Results are available on Websites of NSE (www.nseindia.com) and BSE (www.bseindia.com) and the Company's web site(www.andhracements.com).

For Andhra Cements Limited
Naveen Kumar Singh, Director and CEO
Nirav Kirit Pujara, Resolution Professional

Mumbai
February 9, 2023

BAMBINO AGRO INDUSTRIES LIMITED

CIN NO.L15440TG1983PLC004363
No.4E, Surya Towers, S.P. Road, Secunderabad-500 003, Telephone No. 040-44363332,
Email id cs@bambinoagro.com; Website: www.bambinoagro.com

EXTRACT OF STATEMENT OF STANDALONE UN -AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31st DECEMBER 2022 Rs.in lakhs

Sl. No	Particulars	Quarter Ended 31-12-2022 Un Audited	Quarter Ended 31-12-2021 Un Audited	Year Ended 31-03-2022 Audited
1	Income from Operations	7403.66	6041.41	25764.15
2	Net Profit / (Loss) for the period (before Tax Exceptional and /or Extraordinary items)	227.48	282.16	1302.85
3	Net Profit / (Loss) for the period before tax (after Exceptional and /or Extraordinary items)	227.48	282.16	1302.85
4	Net Profit/(Loss) for the period after tax (after Exceptional and /or Extraordinary items)	**176.94**	**163.61**	**885.23**
5	Total Comprehensive Income for the period (Comprising Profit/Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)	176.94	163.61	885.23
6	Equity Share Capital	800.88	800.88	800.88
7	Earnings Per Share (of Rs.10/- each) (not annualised): 1. Basic 2. Diluted	2.21 2.21	2.04 2.04	11.05 11.05

Notes:
1.The above is an extract of the detailed format of Un Audited Financial Results filed with the Stock Exchanges under Regulation 33 of the Securities and Exchange Board of India(Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015.
2. The full format of the Un Audited financial Results is available on the websites i.e. www.bseindia.com & www.bambinoagro.com

For and on behalf of the Board of Directors of
BAMBINO AGRO INDUSTRIES LIMITED
Sd/-
SHIRISHA MYADAM
CHAIRMAN AND MANAGING DIRECTOR
DIN No.07906214

Place : Secunderabad
Date : 09-02-2023

NATCO Pharma Limited

Regd. Office: NATCO HOUSE, Road No.2, Banjara Hills, Hyderabad-500 034, Phone: 040-23547532,
Email: investors@natcopharma.co.in, CIN: L24230TG1981PLC003201, www.natcopharma.co.in

31 డిసెంబర్, 2022తో ముగిసిన త్రైమాసికం & తొమ్మిది నెలలకు ఆడిట్‌చేయని కన్సాలిడేటెడ్ ఆర్థిక ఫలితాల సారాంశం

పూర్తి మొత్తం భారతీయ రూ.మిలియన్లలో

క్ర. సం	వివరాలు	కన్సాలిడేటెడ్: ముగిసిన త్రైమాసికం 31-12-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 30-09-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31-12-2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31-12-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31-12-2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరం 31-03-2022 (ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి రెవెన్యూ	4,925	4,321	5,605	18,092	13,480	19,448
2	కాలవ్యవధి కొరకు నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంకు ముందు)	814	703	910	5,375	2,518	2,022
3	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత)	814	703	910	5,375	2,518	2,022
4	పన్ను తరువాత కాలవ్యవధిలోని నికర లాభం (మినహాయింపుగల మరియు/ లేదా అసాధారణ ఐటంల తరువాత) మరియు పేరెంట్ యొక్క ఓనర్లకు అట్రిబ్యూటబుల్	623	568	804	4,395	2,205	1,700
5	కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం పేరెంట్ యొక్క ఓనర్లకు అట్రిబ్యూటబుల్	707	533	1,082	4,424	2,483	2,197
6	చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం రూ.2/- చొప్పున	365	365	365	365	365	365
7	ఇతర ఈక్విటీ (రివ్యాల్యూవేషన్ రిజర్వు రూ.నిల్)						42,271
8	వాటా ఒక్కింటికి రాబడి (రూ.లలో) వాటాకు రూ.2/- చొప్పున (వార్షికం కానిది)						
	1. బేసిక్	3.41	3.11	4.41	24.08	12.09	9.32
	2. డైల్యూటెడ్	3.41	3.11	4.40	24.08	12.08	9.32

గమనికలు:

1. కంపెనీ యొక్క సమ్మరైజ్డ్ ఆడిట్‌చేయని స్టాండ్‌అలోన్ ఆర్థిక ఫలితాలు దిగువ విధంగా ఉన్నది.

పూర్తి మొత్తం భారతీయ రూ.మిలియన్లలో

క్ర. సం	వివరాలు	స్టాండ్‌అలోన్: ముగిసిన త్రైమాసికం 31-12-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 30-09-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన త్రైమాసికం 31-12-2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31-12-2022 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన 9 నెలలకు 31-12-2021 (ఆడిట్‌చేయనివి)	ముగిసిన సంవత్సరం 31-03-2022 (ఆడిట్‌చేసినవి)
1	ఆపరేషన్ల నుండి రెవెన్యూ	4,130	3,511	5,295	15,698	12,537	17,678
2	పన్నుకు ముందు లాభం	450	463	797	4,643	2,230	1,559
3	కాలవ్యవధి/ సంవత్సరం కొరకు నికర లాభం	373	377	716	3,830	2,004	1,391
4	పూర్తి సమగ్ర ఆదాయం	337	373	1,020	3,683	2,372	1,795

2. సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ అదర్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్స్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజిలతో దాఖలు చేయబడిన 31.12.2022తో త్రైమాసిక & తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాలకు పై పేర్కొన్నవి సారాంశం. 31.12.2022తో త్రైమాసిక & తొమ్మిది నెలల కాలానికి ఆర్థిక ఫలితాల పూర్తి వివరాలు స్టాక్ ఎక్స్ఛేంజ్ యొక్క వెబ్‌సైట్స్: www.nseindia.com & www.bseindia.com మరియు కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.natcopharma.co.in పై కూడా అందుబాటులో ఉంటాయి.
3. పై ఆర్థిక ఫలితాలు బోర్డు యొక్క ఆడిట్ కమిటీచే సమీక్షించబడినవి మరియు 09 ఫిబ్రవరి, 2023న నిర్వహించబడిన వారి సంబంధిత సమావేశంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లచే ఆమోదించబడినవి.
4. 09 ఫిబ్రవరి, 2023న నిర్వహించబడిన వారి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో రూ.2 చొప్పున ఈక్విటీ వాటాకు రూ.1.25 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు.

for NATCO PHARMA LIMITED
సం/- వి.సి.నన్నపనేని
మేనేజింగ్ డైరెక్టర్

ప్రదేశం: హైదరాబాద్
తేది: 09-02-2023

సంపాదకీయం

మాంద్యం మేఘాలు

'పెట్టుబడి'కి పుట్టినిల్లు అయిన ఇంగ్లండ్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలతో పాటు ప్రపంచమంతటా మాంద్యం మేఘాలు ఆవరించాయి. సంపద కేంద్రీకరణ వినాశకర విధానాల వల్ల ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న దశలో కోవిడ్ మహమ్మారి ముంచెత్తడం, లాక్‌డౌన్లు తదితర పరిణామాలతో మళ్లీ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే

> ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి దారీ దేశాలను కుదిపేస్తున్న ప్రజాందోళనలకు కారణం ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలే. సంక్షోభం అనేది 'పెట్టుబడి' విత్తులోనే దాగుందన్నది మార్క్సిజం ఏనాడో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సంక్షేమ రాజ్య విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలు.. ఆ తర్వాత థాచర్-రీగన్ సూత్రీకరణలతో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మార్కెట్‌కు దోచిపెట్టడమే ప్రధాన బాధ్యతగా నయా ఉదారవాద దోపిడీ మంత్రాంగాన్ని జపిస్తూవచ్చాయి.

ఎత్తుగడలనే పాలకులు అవలంబించడంతో ఎక్కడికక్కడ ఆర్థిక అసమానతలు పెరిగి సంక్షోభం మరింతగా ముదిరింది. బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం కారణంగా, రైల్వే సిబ్బంది, వైద్యులు, ఉపాధ్యాయులు, ఇతర రంగాల ఉద్యోగులు సమ్మెలతో హోరెత్తిస్తున్నారు. లక్షలాది మంది ప్రజానీకం వీధుల్లోకి వచ్చి సంఘీభావం తెలియజేస్తూ ప్రజా ఐక్యత చాటుతుండటం హర్షణీయం. ఫ్రాన్స్‌లో పెన్షన్ వయస్సును 64ఏండ్లకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 11లక్షల మందికి పైగా కార్మికులు రెండు వారాల్లో రెండోసారి నిరసన చేపట్టారంటే ఆర్థిక సంక్షోభ ప్రభావాలు వారిపై ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఆస్ట్రేలియాలో రవాణా కార్మికుల సమ్మె సైతం పెట్టుబడిదారీ దోపిడీపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహంలో నుంచి పుట్టుకొచ్చిందే. శ్రీలంక, ఆ తరువాత పాకిస్థాన్ ఇలా ఒక్కొక్కటిగా ఆసియా దేశాలు కూడా సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలతో భారత్ కూడా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతోంది. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిందే దరిమిలా మౌలిక, సేవా, ఆహార రంగాలన్నింటిని అంబానీ, అదానీలకే దోచిపెడుతున్న వైనాన్ని చూస్తున్నాం. ఇప్పుడు ప్రకంపనలు సృష్టిస్తున్న అదానీ కుంభకోణం... దానికి బ్యాంకులు, ఎల్ఐసీ వంటి విత్త సంస్థలు రూ.వేలాది కోట్లు రుణాలు కుమ్మరించినందున దేశ ఆర్థిక



వ్యవస్థపై ఇంకెంతటి ప్రభావం చూపనుందో!

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి దారీ దేశాలను కుదిపేస్తున్న ప్రజాందోళనలకు కారణం ఆయా దేశాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలే. సంక్షోభం అనేది 'పెట్టుబడి' విత్తులోనే దాగుందన్నది మార్క్సిజం ఏనాడో చెప్పింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సంక్షేమ రాజ్య విధానాలు అనుసరించిన పెట్టుబడిదారీ దేశాలు.. ఆ తర్వాత థాచర్-రీగన్ సూత్రీకరణలతో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మార్కెట్‌కు దోచిపెట్టడమే ప్రధాన బాధ్యతగా నయా ఉదారవాద దోపిడీ మంత్రాంగాన్ని జపిస్తూవచ్చాయి. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థల మాటున రుణాలు ఎరగా వేసి పేద, వర్ధమాన దేశాలను పెట్టుబడిదారీ దేశాలు నడ్డివిరుస్తూ వస్తున్నాయి. విత్త సంస్థల షరతులతో పాలకులు మోకరిల్లడంతో శ్రామికులు, రైతులు, సాధారణ ప్రజానీకం బతుకులు అగమ్యగోచరంగా మారిన సంగతి విదితమే. స్వేచ్ఛా వాణిజ్యం మాటున పెట్టుబడిదారీ గుత్తాధిపత్యానికి అన్ని రంగాలలో స్వేచ్ఛను అనుమతించడంతో ప్రపంచంలో అసమానతలను ఆకాశమంత పెరిగిపోయాయి.

ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలతో సహా ప్రస్తుత ఆర్థిక మాంద్యం మేఘాలు ఆవరించడానికి కోవిడ్‌ను, రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని పెట్టుబడిదారీ దేశాలు సాకుగా చెబుతున్నాయి. వాస్తవానికి 2008లో అమెరికాలో మొదలైన ప్రపంచ సంక్షోభానికి ఇది కొనసాగింపే తప్ప కొత్తగా పురుడుపోసుకున్నది కాదు. గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి పెద్ద టెక్ కంపెనీలన్నీ ఉద్యోగుల తొలగింపును ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. గత ఏడాది టెక్ కంపెనీలు లక్షన్నర మందికి పైగా ఉద్యోగులను ఇళ్లకు పంపినట్లు అంచనా. రోబోల కంటే హీనంగా వేతనజీవులను అమెజాన్ రాచిరంపాన పెడుతోందంటూ గతవారం బ్రిటన్‌లోని అమెజాన్ కార్మికులు సెంట్రల్ ఇంగ్లండ్‌లోని కంపెనీ గిడ్డంగి వద్ద సమ్మె చేపట్టారు. ఒక్క అమెజానే కాదు... కార్పొరేట్ కంపెనీలన్నీ ఇదే తీరుతో శ్రమదోపిడీకి పాల్పడుతున్నా..పాలకులు నోరు మెదపడం లేదు. సులభ వ్యాపార ర్యాంకింగ్‌లో పోటాపోటీగా కార్పొరేట్ సేవలో పునీతమవుతున్నారే మినహా కష్టజీవుల గోడుపట్టడం లేదు. భారత్‌లో ఆర్థిక సంక్షోభాన్ని కప్పిపుచ్చేందుకు జాతియత, మెజారిటీ మతోన్మాద ఆగడాల కత్తి దూస్తోంది. ఈ దరిమిలా విశాల ఐక్య వేదికలు నిర్మించి అటు కార్పొరేట్ దోపిడీనీ, ఇటు మతోన్మాద దాడులను తిప్పికొడితేనే ప్రజానీకానికి మనుగడ.

కుల రక్కసి కరాళ నృత్యం అంతం చేద్దాం!

> నేను విప్లవ కారుణ్ణి. అన్ని దేశాలూ నావే. నిజమైన విప్లవ కారుడు ఓ అద్భుతమైన ప్రేమికుడై ఉంటాడని నేను చెప్తే మీకు కాస్త ఆశ్చర్యంగానే ఉండొచ్చు. కానీ, ప్రేమించే గుణాన్ని కోల్పోయిన వాడు ఎన్నటికీ గొప్ప విప్లవకారుడు కాలేడు. ప్రపంచంలో ఎక్కడ ఎవరికీ అన్యాయం జరిగినా మనం గాఢంగా ప్రతి స్పందించడం చాలా అవసరం. ప్రతి వారికీ ఉండి తీరాల్సిన అద్భుతమైన లక్షణం అదే!
> - చే గువేరా



డాక్టర్ దేవరాజు మహారాజు

కర్నూలు జిల్లాలో కులరక్కసి కరాళ నృత్యం చేస్తోంది. కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన సర్వేలో వళ్ళు గగుర్పొడిచే నిజాలు బయటపడ్డాయి. సుమారు ఎనభైతొమ్మిది గ్రామాల్లో పదిహేను రకాల కులవివక్షలు కనిపించాయి. అరవైనాలుగు గ్రామాల్లో దళితులకు దేవాలయ ప్రవేశంలేదు. ముప్పయి గ్రామాల్లో దళితులు రచ్చబండపై కూర్చోవడానికి వీల్లేదు. ఇప్పటికీ అక్కడ ఏడు గ్రామాల్లో టీ కొట్లలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతూ ఉంది. ఆరు గ్రామాల్లో దళితుల్ని హోటళ్ళలోకి అసలే అనుమతించరు. ఇరవైఏడు గ్రామాల్లో చాకలివారు దళితుల బట్టలు ఉతకరు. తొమ్మిది గ్రామాల్లో క్షురకులు దళితులకు క్షవరం చేయరు. ఈ పనుల కోసం వారు సమీపంలోని పట్టణాలకు వెళుతున్నారు.

"జుట్టు కత్తిరించడం మంగలి యొక్క పవిత్రమైన ధర్మం కాదు. ఇది ఒక వ్యాపారం. చెప్పులు కుట్టడం మాదిగవాడి పవిత్ర ధర్మం కాదు. అది కూడా వ్యాపారమే! ప్రదర్శించే పూజలు, హోమాలు, ఉత్సవాలలో కూడా అది జరుగుతోంది. ఇది బ్రాహ్మణుడి పవిత్రమైన ధర్మమేమీ కాదు. అలా అనుకోవడం మన అజ్ఞానం. మన అజ్ఞానం మీదే బ్రాహ్మణుడికి తిని కూర్చునే పెద్ద వ్యాపారం జరుగుతూ ఉంది!" అని అన్నారు మహాత్మా జ్యోతిరావు పూలే. ఆధునికులుగా మనకు తోచకపోతే పోయింది. కనీసం కొందరు మహానుభావులు చెప్పిన దాంట్లోంచి సారాంశమైన గ్రహించాలి కదా? ఇదే విషయం మీద డాక్టర్ రామ్ మనోహర్‌లోహియా ఏం చెప్పారో గమనించండి... "బ్రాహ్మణులు, కోమట్లు, షేక్‌లు, సయ్యద్‌లు పెద్ద కులాలకు చెందినవారు. కమ్మరి, కుమ్మరి, మంగలి, చాకలి, సాలె, మాల, మాదిగలు చిన్న కులాల వారు. వీరి సంఖ్య 90శాతం దాకా ఉంది. కుల భేదాల వల్ల వీరి మేధస్సు బందీ అయిపోయింది. వీరిని పైకి తెస్తే తప్ప, దేశ పునర్నిర్మాణం జరగదు. కాళ్ళూ, చేతులూ కదిలించకపోతే శరీరానికి పక్షవాతం వచ్చినట్లు... దేశానికీ పక్షవాతం వచ్చింది. దేశంలోని ఈ 90శాతం ప్రజలకు రెండువేల సంవత్సరాలుగా పక్షవాతం వచ్చింది. సమాజంలో వీరిని ఎక్కడికక్కడ పాతరేసి స్థిరపరిచారు. కదలిక లేకుండా చేశారు. బానిసత్వానికి మూల కారణం ఇదే. ఇప్పటికైనా మారకపోతే మరోసారి బానిసలమయ్యే ప్రమాదముంది." ఇలాంటి హెచ్చరికల్ని మనం ఇప్పటికైనా పట్టించుకోవాలా? వద్దా? ఇరవై ఒకటవ శతాబ్దపు అత్యాధునికులమని గొప్పలు పోవడం కాదు, అందుకు తగిన విధంగా ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంది.

మంత్రాలయ మఠంలో- చదువుకున్న దళితులైనా సరే, కేవలం ఉడ్చడానికే అర్హులు! ఆ పని తప్ప మరో పని చేయనివ్వరు. బిల్లులు రాయడానికి గానీ, రిసెప్షనిస్టులుగా పని చేయడానికి గానీ వారికి అవకాశమివ్వరు. అక్కడవారు చదువుకున్న చదువు వృథా కావల్సిందే! కొన్ని ఊళ్ళలో దళితులు మోటారు వాహనాలపై తిరగకూడదు. పెళ్ళి ఊరేగింపులు సైతం వాహనాలపై చేసుకోగూడదు. కాలి నడకన వెళ్ళాల్సిందే. మంచి నీటి బావుల్లోకి సైతం దిగనివ్వరు. బావిలోంచి నీరే తోడుకోనివ్వనప్పుడు, ఇక నీళ్ళలోకి దిగి పనులు చేయనిస్తారా? దళితులతో కలిసి సహపంక్తి భోజనం చేయడమన్నది ఊహకు అందని విషయం. మంత్రాలయ మండలంలోని బసాపురంలో పెత్తందార్ల కార్లు వెళుతూ ఉంటే ఎంతటి విద్యావంతులైన, దళితులయినా సరే... టక్కున లేచి నిలబడి వంగి నమస్కారం పెట్టాల్సిందే. కర్నూలు మండలం దేవమడ గ్రామంలోనూ ఇంకా కొన్ని చుట్టుపక్కల గ్రామాల్లోనూ గ్రామ వాలెంటీర్‌లు దళితుల ఇండ్లకు వెళ్ళరు. వాళ్ళనే తమ ఇళ్ళకు పిలిపించుకుంటారు. ఊళ్ళోని ప్రతి ఇల్లూ తిరగడమన్నది గ్రామ వాలంటీర్ల ఉద్యోగ ధర్మం. దాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం ఎంత తప్పూ? అయితే వారిని అడిగేవారు లేరు. మన తెలుగు రాష్ట్రాల్లోనే ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇంతటి వివక్ష కొనసాగుతూ ఉందంటే... మనుషులుగా మనమంతా తలవంచుకోవాలి. అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వోద్యోగులు, పరిపాలకులు సిగ్గుపడాలి!

కర్నాటకలో కొప్పల్ జిల్లా మయాపూర్ గ్రామంలో అగ్రవర్ణం వారు దళిత కుటుంబానికి ఇరవై అయిదు వేల రూపాయల జరిమాన విధించారు. ఎందుకంటే ఒక దళితుడు గుడి బయట నిలబడి, కళ్ళు మూసుకుని దేవుడికి దండం పెట్టుకుంటున్నాడు. ఆ సమయంలో వెంట ఉన్న అతని రెండేండ్ల కొడుకు గబుక్కున గుళ్ళోకి వెళ్ళిపోయాడు. తను దళితుడినని, తను గుళ్ళోకి వెళ్ళకూడదని ఆ పసివాడికి తెలియదు. ఆ రోజు ఆ పసివాడి పుట్టిన రోజు. అందుకే వాణ్ణి తీసుకుని తండ్రి గుడికి వెళ్ళాడు. వాణ్ణి చల్లగా చూడమని కోరుకుంటూ ఆ దళితుడు దండం పెట్టుకుంటూ ఉండగా... ఆ "ఘోర ప్రమాదం" జరిగిపోయింది. ఒక దళితుడు గుళ్ళోకి జొరబడ్డాడని, గుడి మైల పడిందనీ, దాన్ని ప్రక్షాళన చేయాలని... అందుకు 25వేలు ఖర్చు అవుతుందనీ పూజారులు బెదిరించారు. తనకు అంతశక్తి లేదని, తను ఒక నిరుపేదనని దళితుడు ఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. అగ్రవర్ణ అహంకారం తగ్గలేదు. పెద్ద గలాటా జరిగింది. ప్రభుత్వాధికారుల చొరవతో విషయం సద్దుమణిగింది. ఇంగిత జ్ఞానం లేక, మానవత్వం లేక మనుషులు ప్రవర్తిస్తున్నప్పుడు - గోరుతో పోయేది గొడ్డళ్ళదాకా వస్తుంది. ఇది 2021 సెప్టెంబర్ సంఘటన. ఇలాంటి సంఘటనే తమిళనాడులో జరిగింది. ఒక గుళ్ళోకి దళిత మహిళను రానియ్యలేదు. ఆ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలిసింది. వెంటనే ఆ గుడికి సంబంధించిన ఇరవైమంది పూజారుల మీద ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు పెట్టించి వారిని జైలుకు పంపాడు. ఇతర రాష్ట్రాలలో కూడా అలా చేయగలిగే అవకాశం ఆయా మంత్రులకు, ముఖ్యమంత్రులకు ఉంటుంది. రాజ్యాంగం



గురించి అందరూ గొప్పగా మాట్లాడుతారు కానీ, ఎవరైనా ఏలా చేస్తున్నారా?

మహిళల అభ్యున్నతికై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ స్త్రీలకు బస్సు ప్రయాణం ఉచితం చేశారు. ఒకరోజు కన్యాకుమారి జిల్లా వాణియం కుడి గ్రామానికి చెందిన సెల్వం అనే ఏబ్బయేండ్ల మహిళ తన చేపల బుట్టతో బస్సు ఎక్కింది. చేపల వాసన వస్తున్నాయంటూ కండక్టర్ బలవంతంగా బస్సు నుండి దింపేశాడు. అవి నిలువ చేపలు కావని, ఆ రోజు పట్టినవేనని, చేపలన్నాక కొంచెం వాసనొస్తాయనీ, అయినా తను ఎక్కువ దూరమేమీ రావడం లేదని ఆ వృద్ధురాలు ఎంత మొత్తుకున్నా కండక్టర్ వినలేదు. "పాపం పోనీయండి" - అని తోటి ప్రయాణీకులు చెప్పినా, అతను వినిపించుకోలేదు. బలవంతంగా దింపేశాడు. ఆమె కుళచ్చల్ బస్టాండ్‌లో అందరికీ తనకు జరిగిన అన్యాయం చెప్పుకుంది. ఆనోటా ఆనోటా అది సోషల్ మీడియాకెక్కింది. రవాణాశాఖ అధికారులకు, తర్వాత ముఖ్యమంత్రికీ తెలిసింది. ఆ వృద్ధురాలి హక్కును కాదన్నందుకు ఆ బస్సు కండక్టర్, డ్రైవర్‌లను సస్పెండ్ చేశాడు స్టాలిన్. అణగారిన వర్గాలకు ఎక్కడికక్కడ న్యాయం జరగాలంటే

> మనుస్మృతి ప్రకారం మహిళలందరూ శూద్రులే. మహిళలకు పుట్టిన వారంతా శూద్రులే అవుతారు కానీ, మళ్ళీ అందులో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఎలా పుట్టగలరూ? పుట్టిన వాళ్ళందరూ శూద్రులే అయినప్పుడు అగ్ర-నిమ్న వర్ణాలెందుకూ? ఇదంతా బుద్ధి తక్కువ వ్యవహారంగా అనిపించడం లేదూ? అది అలా ఉండనిచ్చి మరొక విషయం చూద్దాం. హిందూ దేవుళ్ళలో బ్రాహ్మణులు లేరు. అధిక భాగం క్షత్రియులే. అలా అయినప్పుడు బ్రాహ్మణ వర్ణానికి మొదటి స్థానం ఎవడిచ్చాడు? ఇదంతా కాదు. మహిళలు శూద్రులయినప్పుడు, ఉన్న జనాభా అంతా శూద్రులే - అందరూ సమానులే. విజ్ఞాన శాస్త్రం అదే చెప్పింది - మానవజాతి అంతా ఒక్కటే కాబట్టి, అందరూ సమానులే - అని అంది. మనుధర్మ శాస్త్ర ప్రకారం కూడా మనుషులంతా సమానులే- అని మనం అర్థం చేసుకోవాలి.

చిత్తశుద్ధి ఉన్న నాయకులు కావాలి. ఉట్టి 'భాషణ్'లిచ్చే నాయకులు వృథా కదా మిత్రోం?

మనుస్మృతి ప్రకారం మహిళలందరూ శూద్రులే. మహిళలకు పుట్టిన వారంతా శూద్రులే అవుతారు కానీ, మళ్ళీ అందులో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఎలా పుట్టగలరూ? పుట్టిన వాళ్ళందరూ శూద్రులే అయినప్పుడు అగ్ర-నిమ్న వర్ణాలెందుకూ? ఇదంతా బుద్ధి తక్కువ వ్యవహారంగా అనిపించడం లేదూ? అది అలా ఉండనిచ్చి మరొక విషయం చూద్దాం. హిందూ దేవుళ్ళలో బ్రాహ్మణులు లేరు. అధిక భాగం క్షత్రియులే. అలా అయినప్పుడు బ్రాహ్మణ వర్ణానికి మొదటి స్థానం ఎవడిచ్చాడు? ఇదంతా కాదు. మహిళలు శూద్రులయినప్పుడు, ఉన్న జనాభా అంతా శూద్రులే - అందరూ సమానులే. విజ్ఞాన శాస్త్రం అదే చెప్పింది - మానవజాతి అంతా ఒక్కటే కాబట్టి, అందరూ సమానులే - అని అంది. మనుధర్మ శాస్త్ర ప్రకారం కూడా మనుషులంతా సమానులే- అని మనం అర్థం చేసుకోవాలి. మనమంతా బాల్యంలో బాలకులం. యవ్వనంలో యువకులం. వృద్ధాప్యంలో పండుటాకులం... అంతే! మనువును తిరస్కరిస్తేనే ఎవరికైనా కాస్త బుద్ధిజ్ఞానం పెరుగుతుంది. రైల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఒక పెద్దాయన పక్కనున్న యువకుణ్ణి ఊహించని ప్రశ్న అడిగాడు. మీ కేస్ట్ ఏమిటీ అని! యువకుడు అందగాడే కాదు తెలివైనవాడు కూడా. విషయం గ్రహించి వెంటనే 'సాఫ్ట్‌వేర్' అండీ అన్నాడు.

"భలే జోకులేస్తావు బాబూ నేను అడిగింది వేరు. నువ్వు చెప్పేది వేరు. పోనీ, మీ నాన్నగారి కులమేమిటీ" అని మళ్ళీ అడిగాడు పెద్దాయన.

"ఆయనా? ఆయన ఎలక్ట్రికల్ అండీ" అన్నాడు యువకుడు.

'పోనీలే - నీకు చెప్పాలని లేనట్లుంది! ఈ మధ్య ఏమిటో కుర్రవాళ్ళు చిత్రమైన జవాబులు చెపుతున్నారు. కులం చెప్పుకుంటే నామోషీయేమో" - అని ముఖం మాడ్చుకుని, ముఖం కూడా తిప్పుకున్నాడు.

"మీరు పెద్దవారు. మీకు తిక్కతిక్కగా సమాధానాలు చెప్పాలని నాకు లేదు. విషయేమిటంటేనండీ... భగవద్గీతలోని నాలుగో అధ్యాయంలో పదమూడవ శ్లోకం ఒకసారి నెమరు వేసుకోండి. మీకే అర్థమవుతుంది!" అన్నాడు.

"అవునూ ఏముందు అందులో?" ఈ కుర్రాడికి గీతలోని విషయాలు కూడా తెలుసా? అని ఆశ్చర్యపోతూ అడిగాడు.

"గుర్తులేకపోతే ఫరవాలేదు. ఇంటికెళ్ళాక చూసుకోండి!" నవ్వుతూ బదులిచ్చాడు యువకుడు.

"సరే బాబూ చెబుదూ అందులో ఏముందో" అన్నాడు పెద్దాయన.

"ఏముందంటే... కులమనేది పుట్టుకతో కాదు, చేసే వృత్తితో వస్తుంది- అని ఉంది. దాని ప్రకారమే చెప్పానండీ అంతే - మిమ్మల్ని ఆటపట్టించాలని కాదు - మీకేమో కోపం వచ్చేసింది" అని నవ్వుకొనసాగించాడు. పెద్దాయనకు ఎక్కడో కలుక్కుమంది. 'జ్ఞానం' వయసు పెరిగితే రాదు - బుద్ధి పెరిగితేనే వస్తుందని అప్పుడే తెలుసుకున్నాడు. పాత తరహాలో ఇక మాట్లాడగూడదని కూడా అనుకున్నాడు.

మనుస్మృతి ప్రకారం- (త్రిన్ష:9/93) పురుషులు 24-30ఏళ్ళ వయసులో 8-12ఏళ్ళ వయసులో ఉన్న బాలికల్ని పెండ్లి చేసుకోవాలి. ఇదే కాదు 3-4 ఏళ్ళ బాలికలకు 7-8ఏళ్ళ బాలురకు కూడా పెళ్ళిళ్ళు చేసిన ఆచారం ఈ దేశంలో కొనసాగింది. మరి సమకాలీనంలో దాన్ని కొనసాగించడం లేదు కదా? అందుకే సంప్రదాయం ముసుగులో పనికిరాని ఆచారాల్ని వదిలేయాలి. అన్నీ ఆలోచించే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనుస్మృతిని దహనం చేశాడన్న విషయం గుర్తుంచుకోవాలి!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



ధనిక రాష్ట్రంలో వేతన కష్టాలు

తెలంగాణ ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.90 లక్షల కోట్లతో బాహుబలి బడ్జెట్‌ను శాసనసభలో ఈనెల 6న ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం గురించి ఆర్థికశాఖ మంత్రి కితాబునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగులు కీలక భాగస్వామ్యం వహిస్తున్నారని, వారి సంక్షేమమే పరమావధి అని చెప్పారు. దేశంలో ఎక్కడలేని విధంగా అత్యధిక వేతనాలు ఇస్తున్నామని, వారి ప్రయోజనాల విషయంలో ఏనాడు తక్కువ చేయలేదంటూ పేర్కొ న్నారు. ఎక్కువ జీతాలేమోగానీ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతినెల జీతంకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత రెండేండ్లుగా వేతనాల చెల్లింపు విషయంలో జాప్యం జరుగుతున్నది. మరోపక్క ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బిల్లులన్నీ నిలిచిపోయాయి. రుణాలు, అడ్వాన్సులు, రీయంబర్స్‌మెంట్ బిల్లులకు గత కొన్ని నెలలుగా మోక్షం లభించడం లేదు. ఖజానా కార్యాలయం నుంచి టోకెన్లు జనరేట్ అవుతున్నాయే తప్ప 'ఈ-కుబేర్' నుంచి డబ్బులు మాత్రం ఉద్యోగుల ఖాతాల్లో జమ కావడం లేదు.

ఒకప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు వచ్చేవి. సాధారణ పరిపాలన శాఖ ఏప్రిల్ 1990లో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు నెం.223 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించాలి. కానీ గత రెండేండ్లుగా ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో సచివాలయం ఉద్యోగులకు ఒకటో తేదీన జీతంవస్తే ఆయా శాఖాధిపతి కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు 2వ తేదీ నుండి 5వ తేదీ లోపు జీతాలు అందుతాయి. కానీ మిగతా జిల్లాల్లో ఏ తేదీన జీతాలు జమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి నెలా పలాన తేదీన జీతం వస్తుందని నమ్మకాన్ని ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించడం లేదు. వివిధ మార్గాల ద్వారా వస్తున్న రాబడులు సంక్షేమ పథకాల సబ్సిడీలు, వడ్డీల చెల్లింపులకే సరిపోతుండడంతో ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు చెల్లించడం కష్టమవుతున్నది. సరైన సమయానికి జీతాలురాక ఇంటి అద్దెలు, నిత్యావసర వస్తువుల కొనుగోళ్లు, ఈఎంఐల చెల్లింపులకు ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి దాపురించింది.

ఉద్యోగుల బిల్లులన్నీ పెండింగ్...

ఉద్యోగుల సరెండర్ లీవ్, మెడికల్ రీయంబర్స్‌మెంట్, టీఎస్ జీఎల్ఐ క్లైములు, జీపీఎఫ్, పీఆర్సీ బకాయిలు మొదలైన బిల్లులన్నీ ట్రెజరీశాఖలో గత కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) కింద ప్రతి ఉద్యోగ మూలవేతనం నుంచి ప్రభుత్వం 6శాతం మినహాయింపులు చేస్తుంది. దీని సొమ్ము రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీశాఖలో జమవుతుంది. 20ఏండ్ల సర్వీస్ పూర్తయిన ఉద్యోగ ఉపాధ్యాయులు జీపీఎఫ్ ఖాతాల నుండి పాక్షిక ఉపసంహారణ కింద సొమ్ము తీసుకుంటారు. ఈ విధంగా తీసుకుంటున్న జీపీఎఫ్ బిల్లులు గత కొన్ని నెలలుగా అనేక జిల్లాల్లో నిలిచిపోయాయి. ఫలితంగా గృహ నిర్మాణం, ఆరోగ్య సంబంధ విషయాలు, వివాహ శుభకార్యాలు, పిల్లల చదువులు మొదలైన వాటికి ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు జమ చేసుకున్న సొమ్ము ప్రభుత్వం తమ అవసరాలకు వాడుకోవడం వల్ల అవసరాల నిధి అక్కరకు రాకుండాపోయింది. అలాగే పీఆర్సీ ఏరియర్స్ బిల్లులు, సిపిఎస్ ఉద్యోగుల డి.ఏ బకాయిలు చాలా నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. సమయం ముగిసిన లైఫ్ ఇన్సూరెన్స్ బాండ్ల క్లైముల యొక్క బిల్లులు అందక రిటైరైన ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉద్యోగుల వైద్యానికి సంబంధించిన రూ.2లక్షల లోపు అత్యవసర మెడికల్ బిల్లులు కూడా మంజూరు కావడం లేదు.

నూతన పద్ధతిలో నేరుగా ఖాతాలోనికే...


తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల కోసం ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) రూపొందించింది. దీని ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులను డిడిఓలు తయారుచేసి ఎస్‌టిఓ కార్యాలయాలకు పంపిస్తారు. ఆ వెంటనే టోకెన్ నెంబర్ జనరేట్ అవుతుంది. దాని ఆధారంగా సొమ్ము మంజూరు కావాలి. ఇంతకు ముందు టోకెన్ జనరేట్ అయినా కొన్ని రోజులకే ఉద్యోగుల ఖాతాల్లో బిల్లుల సొమ్ము జమయ్యేది. కానీ ప్రస్తుతం బిల్లు క్లియర్ కావాలంటే ఆర్థికశాఖ అనుమతి ఉండాల్సిందే. ట్రెజరీశాఖకు చెందిన ఆడిట్ అధికారులు ఆడిట్ చేసిన అనంతరం బిల్లులు ఈ-కుబేర్ పోర్టల్‌లో అప్ లోడ్ చేస్తారు. ఖజానా శాఖకు వస్తున్న రాబడుల ఆధారంగా బిల్లులను మంజూరు చేస్తారు. ఓ నెలలో రైతుబంధు... ఇంకో నెలలో ఇంకో పథకం... ఇలా ప్రతి నెలలో సంక్షేమ పథకాలకే వచ్చిన నిధులన్నీ ఖర్చవుతున్నాయి. జీతాల కోసం నిధులు సమకూర్చుకోవడంలో ఆలస్యం జరగడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమయానికి వేతనాలు రావడం లేదు. ప్రయివేట్ సెక్టార్‌లో పనిచేసే ఉద్యోగులకు ఆయా సంస్థలు ఒక తేదీని నిర్ణయించి జీతాలు జమ చేస్తాయి. కానీ ప్రభుత్వోద్యోగులకు అలా ఎందుకు ఇవ్వడంలేదనే ప్రశ్నలు వారి నుండి వ్యక్తమవుతున్నాయి. ధనిక రాష్ట్రంలో జీతాల కోసం, బిల్లుల మంజూరు కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి వేతన జీవుల వెతలు తీర్చాల్సిన అవసరమున్నది.



అంకం నరేష్
సెల్: 6301650324

ప్రభుత్వ బీమా రంగంపై ముప్పేట దాడి... ఉద్యోగుల ముందున్న కర్తవ్యం

దేశానికి ఏటా దాదాపు రూ.4లక్షల కోట్ల మేరకు నిధులు అందించే ప్రభుత్వ బీమా పరిశ్రమకు 2023-24 బడ్జెట్ ప్రతిపాదనలు ఏమాత్రం ఉపయోగకరంగా లేవు. ఎల్.ఐ.సి సంస్థకు, పాలసీ దారులకు భారంగా మారిన బీమా ప్రీమియం పైన అన్యాయంగా విధిస్తున్న 18శాతం జీఎస్‌టీ ఏమాత్రం తగ్గించలేదు. పైపెచ్చు ఏప్రిల్, 2023 తరువాత తీసుకునే పాలసీల ఏడాది ప్రీమియమ్ రూ.5 లక్షలు దాటితే, వాటి మెచ్యూరిటీపై పన్ను వేసే విధంగా పద్ధతి ప్రతిపాదించారు. అంటే దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇఇఇ పద్ధతికి స్వస్తి పలికి, ఈఈటి (Exempt, Exempt, Tax) పద్ధతి తీసుకొస్తున్నారు. ఆరోగ్య బీమా చేస్తే ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితులు మరింత పెంచాలన్న విజ్ఞప్తులను పెడచెవిన పెట్టారు. దేశీయ పొదుపు ప్రస్తుతం దేశ జీడీపీలో 28శాతం నుండి 29శాతం మధ్యలో ఉంది. కొన్ని ఏండ్ల క్రితం ఇది 37శాతం ఉండేది. ప్రజల పొదుపు సామర్థ్యం పడిపోవడం, ఉద్యోగాల లేమి, మితిమీరిన ద్రవ్యోల్బణం, గ్యారెంటీలేని ఉద్యోగాల వలన దేశీయ పొదుపు క్రమేపీ క్షీణిస్తూ వస్తోంది. దేశీయ పొదుపు మూడు విధాలుగా ఉంటుంది. 1. కుటుంబ పొదుపు 2. కార్పొరేట్ పొదుపు 3. ప్రభుత్వ రంగ సంస్థల పొదుపు.



పి. సతీష్
9441797900


1. కుటుంబ పొదుపు - ఇది మొత్తం దేశీయ పొదుపులో సుమారు 60శాతం ఉంటుంది. ఇందులో రెండు భాగాలు. ఆర్థిక పొదుపు (అంటే బ్యాంక్, బీమా, పీఎఫ్, పెన్షన్, పోస్ట్ ఆఫీస్‌లలో చేసే పొదుపు). భౌతిక పొదుపు (బంగారం, భూములు, రియల్ ఎస్టేట్ తదితర పొదుపు)

2022-23లో సుమారు రూ.17లక్షల కోట్లు ఆర్థిక పొదుపు రూపేణా సమీకరించబడగా, 2023-24 నాటికి అది రూ.25 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఈ సొమ్మంతా ప్రభుత్వ పెట్టుబడులకు ఉపయోగపడతాయి. కార్పొరేట్ పొదుపు - ఇది మొత్తం దేశీయ పొదుపులో 34శాతం ఉంటుంది. ఇది ఆయా కార్పొరేట్‌ల సొంత ప్రయోజనాల కోసం వినియోగించబడుతుంది. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సమీకరించబడే పొదుపు-ఇది కేవలం 5శాతం మాత్రమే. ప్రజల పొదుపు ప్రభుత్వ నియంత్రణలో ఉంటేనే, ప్రజా సంక్షేమం కోసం దానిని ఉపయోగించు కునే అవకాశం ఉంటుంది. ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ప్రజా పొదుపు, వారికి విపరీతమైన లాభాలు తెచ్చిపెడుతుంది తప్ప, సమాజానికి ఎటువంటి ఉపయోగం లేదు. అందుకే కుటుంబ పొదుపుని ప్రోత్సహించాలి. కానీ, దానికి విరుద్ధంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి.

బీమా రంగానికి ప్రత్యేక ఆదాయపు టాక్స్ స్లాబ్‌ను కల్పించాలన్న బీమా రంగ విజ్ఞప్తులను ఆర్థికమంత్రి ఏమాత్రం పట్టించుకోలేదు. పైపెచ్చు ఆదాయపు పన్ను కట్టేవారిని నూతన టాక్స్ విధానంలోకి తీసుకువచ్చే విధంగా ఈ బడ్జెట్‌లో స్లాబ్స్‌లో మార్పులు ప్రతిపాదించారు. ఈ చర్య ఆదాయపు పన్ను రాయితీ కోసం జీవిత బీమా పాలసీలు తీసుకునే వారిని నిరుత్సాహ పరిచినట్టే అవుతుంది. సార్వత్రిక సామాజిక భద్రత లోపించిన మన దేశంలో, ఇటువంటి చర్యలు ప్రజలు స్వచ్ఛందంగా కల్పించుకునే సామాజిక భద్రతను, పొదుపు అలవాటుని దెబ్బ తీస్తాయి.

ప్రభుత్వ బీమా రంగంపై అలుపెరగని దాడి!!

2021-22 బడ్జెట్‌లోనే రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులను, ఒక ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీని ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయబోతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. జీఐబిఎన్ఎ చట్టం-2021 ద్వారా ప్రభుత్వానికి అపరిమితమైన అధికారాలు లభించాయి. ప్రభుత్వం అనుకుంటే ఏ పీఎస్, జీఐ కంపెనీలోనైనా ప్రభుత్వ ఈక్విటీని 51శాతం కన్నా దిగువకు తగ్గించవచ్చు. అందువల్ల ఈ చట్టం ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీల ప్రయివేటీకరణకు మార్గం సుగమం చేసింది. అయితే, ఏఐఐఐఏ మడమ తిప్పకుండా చేసిన పోరాటాల వల్ల ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీ అమ్మకం తాత్కాలికంగా నిలుపుదల అయ్యింది. అయితే, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలలోని కొన్ని బ్రాంచ్‌లు, డివిజనల్ కార్యాలయాలను మూసివేయడానికి లేదా విలీనం చేయడానికి ఇటీవలి జరుగుతున్న ప్రయత్నాలు ప్రయివేటీకరణ దిశగా అడుగులు మాత్రమే అని గమనించాలి.



స్విస్ రే సిగ్మా అధ్యయనం ప్రకారం... ప్రపంచంలోనే పది అతిపెద్ద బీమారంగ మార్కెట్లలో ఇండియా ఒకటిగా నిలిచింది. భారతదేశంలో బీమా రక్షణ అంతరం (ఇన్సూరెన్స్ ప్రొటెక్షన్ గాప్)16.5 ట్రిలియన్ డాలర్లుగా గుర్తించింది. ఈ బీమా అంతరంలో అత్యధిక వాటాను చేజిక్కించుకోవడానికి మార్కెట్లో తీవ్రమైన పోటీ నడుస్తోంది. 2015లో మొదటిసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని 26 నుంచి 49శాతానికి పెంచారు. 2021లో దానిని 74శాతానికి పెంచారు. విదేశీ యాజమాన్యాన్ని ప్రయివేటు బీమా కంపెనీలపై వారి నియంత్రణను కూడా అనుమతించారు.

మన దేశీయ కంపెనీలపై విదేశీ పెట్టుబడి

నియంత్రణ సాధించడం వల్ల, మన దేశీయ కుటుంబ పొదుపులో అధిక వాటాను పొందాలని, తద్వారా లాభాలు పోగేసుకోవాలని వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బీమారంగ పరిశ్రమలో ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను గమనిస్తే రాబోయే రోజులలో దేశీయ బీమా రంగంలో కంపెనీల మిళితాలు బాగా పెరుగుతాయని తెలుస్తోంది. ఇటీవల హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎక్సైడ్ లైఫ్‌ను రూ.6687 కోట్ల ఒప్పందం మేరకు కొనుగోలు చేసింది. ఐసిఐసిఐ లాంబార్డ్, భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలు చేసింది. అమెరికా ఆధారిత బీమా సంస్థ మెట్ లైఫ్, ఐజిఐ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఎల్రో లో 15.27శాతం వాటాను పొందింది. ప్రయివేటు బీమా కంపెనీల మెర్జర్స్ ప్రభుత్వ రంగ బీమా కంపెనీల మార్కెట్ ఆధిపత్యానికి పెద్ద సవాలుగా పరిణమిస్తోంది.

సాంకేతిక అంశాల్లో నూతన సవాళ్లు!!

సాంకేతిక ఆవిష్కరణ, నవీకరణకు సంబంధించి నూతన సవాళ్లు ఎదురవుతున్నాయి. బీమా రంగం ఎక్కువగా డిజిటలైజేషన్ వైపునకు పయనిస్తోంది. భారతదేశంలో బీమా వ్యాప్తి సుమారు 4శాతం ఉండగా, ఇంటర్నెట్ యొక్క వ్యాప్తి 45శాతంగా ఉంది. భారతదేశంలో 139కోట్ల మందిలో సగం మంది ఇంటర్నెట్‌ను కలిగి ఉన్నారు. క్లిక్, కొనుగోలు' సౌలభ్యం ఆన్‌లైన్ కొనుగోలుకు గణనీయమైన ఊపు వస్తోంది. భారతదేశంలో ఆన్‌లైన్ బీమా మార్కెట్ 2024 నాటికి రూ.22,000 కోట్లకు పెరగగలదని అంచనా. బీమా ఉత్పత్తుల విక్రయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగం అనేది నేడు అనివార్యమైంది. స్టాండర్డ్ అండ్ పూర్ తాజా నివేదిక ప్రకారం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో భారతదేశం రెండవ అతిపెద్ద బీమా సాంకేతిక మార్కెట్‌గా నిలిచింది. బీమా కంపెనీలు కస్టమర్లను తమ సాంకేతిక పరిజ్ఞానంతో ఆకట్టుకునే ప్రయత్నం

> బీమారంగ పరిశ్రమలో ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను గమనిస్తే రాబోయే రోజులలో దేశీయ బీమా రంగంలో కంపెనీల మిళితాలు బాగా పెరుగుతాయని తెలుస్తోంది. ఇటీవల హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, ఎక్సైడ్ లైఫ్‌ను రూ.6687 కోట్ల ఒప్పందం మేరకు కొనుగోలు చేసింది. ఐసిఐసిఐ లాంబార్డ్, భారతి ఆక్సా జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని కొనుగోలు చేసింది. అమెరికా ఆధారిత బీమా సంస్థ మెట్ లైఫ్, ఐజిఐ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఎల్రో లో 15.27శాతం వాటాను పొందింది. ప్రయివేటు బీమా కంపెనీల మెర్జర్స్ ప్రభుత్వ రంగ బీమా కంపెనీల మార్కెట్ ఆధిపత్యానికి పెద్ద సవాలుగా పరిణమిస్తోంది.

చేస్తున్నాయి. మెరుగైన డేటా విశ్లేషణలు, కృత్రిమ మేధస్సు (ఎఐ)ను ఉపయోగించటం ద్వారా, పాలసీదారుల అవసరాలకు అనుగుణంగా కంపెనీలు ఉత్పత్తు లను అభివృద్ధి చేస్తున్నాయి.

దేశీయ బీమా పరిశ్రమపై మిలీనియనల్స్ లేదా యువ ఉద్యోగులు ప్రభావం గణనీయంగా ఉంది. మొత్తం ఉద్యోగుల్లో వీరు 46శాతం దాకా ఉండడం విశేషం. అందువల్ల బీమా పాలసీలు అమ్మడంలో, పాలసీ సేవలు అందించడంలో కొత్త పద్ధతులు అవసరం. ఎందుకంటే... వారు ముఖాముఖీ సర్వీస్ కన్నా డిజిటల్ సర్వీస్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఫిజిటల్ మార్కెట్ ప్లేస్- భౌతిక శాఖలతో బాటు ఫోన్ ఆధారిత కాంటాక్ట్ సెంటర్లు, చాట్‌బాట్‌లు, వాట్సాప్, మొబైల్ యాప్‌లు, సామాజిక మాధ్యమాలు వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఈరోజు అనివార్యమయ్యాయి.

ఇప్పటికే మన ప్రభుత్వ రంగ బీమా సంస్థలు మరింతగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఇటు ఉద్యోగుల ప్రయోజనాలను, అటు సంస్థ ప్రయోజనాలను అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. ప్రపంచ దేశాలలో పదవి విరమణ చేసిన వారి పొదుపు ఎక్కువగా ఉన్న దేశాలలో మన దేశం ఒకటి. కాబట్టి ప్రభుత్వ బీమా రంగ పరిశ్రమ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ దిశగా బీమా ఉత్పత్తులను అభివృద్ధి చేయాలి.

సెల్:9441797900

జుట్టు రాలుతుందా..?



ప్రస్తుతకాలంలో జుట్టు రాలే సమస్య అందరినీ వేధిస్తుంది. అయితే డెలివరీ అయిన తర్వాత ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రసవం తర్వాత చాలా మంది మహిళలు జుట్టు రాలే సమస్యతో బాధపడుతున్నారు. అప్పటి వరకు ఒత్తుగా, పొడవుగా ఉండే జుట్టు.. డెలివరీ తర్వాత ఊడిపోవటం చూసి కొందరు భయపడి పోతుంటారు. కానీ ఈ సమస్యతో అంతగా భయపడాల్సిన పనిలేదు. ఇది పూర్తిగా సాధారణం. గర్భధారణకు ముందు, డెలివరీ తర్వాత మీ జుట్టు పెరుగుదలకు ఆటంకం కలిగించే హార్మోన్ హెచ్చు తగ్గుల కారణంగా కొందరిలో ఇలా జరుగుతుంటుంది. కానీ ఇది శాశ్వత సమస్య మాత్రం కాదు. ప్రసవం తర్వాత మొదటి కొన్ని నెలల వరకు మాత్రమే ఉంటుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మీ జుట్టు యథాస్థితికి చేరుకుంటుంది.

- గర్భధారణ తర్వాత శరీరాన్ని తిరిగి బలోపేతం చేయడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రసవానంతర విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉన్న పోషకాహారాన్ని తినాలి. జుట్టు రాలడాన్ని ఎదుర్కోవడంలో ఇవి చాలా సహాయపడతాయి.
- అలాగే హైడ్రేటెడ్‌గా ఉండటానికి రోజంతా పుష్కలంగా ద్రవాలను తీసుకోవటం ఉత్తమం. అలాగే వీలైనంత వరకు ఒత్తిడికి దూరంగా ఉండాలి. మెడిటేషన్ చెయ్యడం వలన ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. ఇది హార్మోన్ల అసమతుల్యతను నియంత్రించడంలో సహాయపడుతుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.
- డెలివరీ తర్వాత మీరు ఎక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుంది. అలాగే జుట్టు రాలి పోవడం సమస్య తగ్గిపోతుంది. ఆకు కూరలు, మొరంగడ్డలు, తాజా పండ్లు వంటివి ఎక్కువగా తీసుకోవటం మంచిది. ఆహారంతో పాటుగా హెయిర్ కేర్ ట్రీట్మెంట్ తీసుకోవడం కూడా మంచి పద్దతి. ఎక్కువ రెస్ట్ తీసుకోవడం, మంచి నిద్ర పొందడం కూడా చాలా ముఖ్యం. మంచి నిద్రతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు.

ఇలా సేదతీరండి...



ఇంటా బయటా బాధ్యతలు నెరవేర్చే సమయంలో ఒక్కోసారి ఒత్తిడికి లోనవుతుంటాం. ఆయా పనుల్లో ఆటంకాలు ఎదురైతే.. అనుకున్న రీతిలో చేయలేకపోతే మరేవో సమస్యలెదురైతే.. నిరాశా నిస్పృహలు తప్పవు. మరి ఆ బాధ, భయాల నుంచి బయటపడేదెలా? మనకు మనమే ధైర్యం చెప్పుకొని, ఉపశమనం పొందాలి. సమస్యల్ని అధిగమించాలి. అందుకు నిపుణులు సూచిస్తున్న కొన్ని మార్గాలు చూడండి...

- దుఃఖం కలిగినప్పుడు కాసేపు ఆ విషయాన్ని పక్కనపెట్టి ఒక మంచి పుస్తకం చదవండి, లేదా చక్కని సినిమా చూడండి.

– కొంతసేపు ప్రకృతిని ఆస్వాదించండి. కుదరకపోతే మబ్బుల్ని చూస్తూ కూర్చోండి, ప్రశాంతంగా ఉంటుంది.

- దీర్ఘంగా ఊపిరి పీల్చుకుని కొంతసేపు నిలిపి.. అంతే దీర్ఘంగా శ్వాస వదలాలి. ఇలా అరగంటసేపు శ్వాస మీద ధ్యాస పెట్టారంటే మీలో ఎంత మార్పు వస్తుందో మీకే అర్థమవుతుంది. అరగంటసేపు వ్యాయామం చేయండి.
- వాట్సప్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాలను వదిలేసి ఒకసారి ఆప్తులకు ఫోన్ చేసి మాట్లాడండి.
- బొమ్మలేయడం, పాట పాడటం, నృత్యం, ఎంబ్రాయిడరీ, మిమిక్రీ లాంటివేమైనా సరే.. మీకు ఇష్టమైన కళలో కొంతసేపు సాధన చేస్తే సరి.
- బంధు మిత్రులెవరినైనా ఇంటికి ఆహ్వానించండి. లేదా మీరే వారింటికి వెళ్లండి. కాసేపు ఇష్టమైన వారితో ముచ్చటిస్తే తిరిగి రీఛార్జవుతారు.
- కొంతసేపు పడుకోండి. సేదతీరాక ఆలోచించండి.

లత... కేరాఫ్ సక్సెస్

సక్సెస్... ఇది ఏ ఒక్కరి సొత్తు కాదు. అలా అని అంత సులభంగా ఎవరి వద్దకూ వచ్చి చేరదు. విజయం సాధించడాలంటే కష్టపడాల్సిందే. శ్రమనే నమ్ముకుని అంచలంచలుగా ఎదిగిన మహిళలెందరో మన కండ్ల ముందు ఉన్నారు. వారిలో లత నడుకుడ ఒకరు. ఏడవ తరగతి మాత్రమే చదువుకున్న ఆమె ఇప్పుడు ఏకంగా రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తుంది. నాలుగు గార్మెంట్స్ షోరూమ్స్ నడిపిస్తుందంటే దాని వెనక ఎంతటి శ్రమ దాగివుందో అర్థం చేసుకోవచ్చు. ఈ సక్సెస్ వెనక ఉన్న సీక్రెట్ ఏమిటో, ఎవరెవరు ఉన్నారో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం, యూసఫ్‌నగర్ గ్రామంలో సాదాసీదా కుటుంబంలో పుట్టింది లత. అది చిన్న పల్లెటూరు కావడంతో ఏడవ తరగతి వరకే చదువుకుంది. ఆ తర్వాత చదువుకోవాలంటే చాలా దూరం బస్సులో ప్రయాణం చేయాలి. అందుకే తండ్రి వద్దని చదువు అక్కడితో ఆపేశాడు. ఖాళీగా ఉండటంతో 2001లో టైలరింగ్‌కి వెళ్లడం మొదలుపెట్టింది. రెండేండ్లు కష్టపడి నేర్చుకుంది. టైలరింగ్‌కి ఫీజు కట్టడానికి డబ్బులు లేకపోతే తన దగ్గర ఉన్న అరతులం కమ్మలు వాళ్లకి ఫీజు కింద ఉంచుకోమని చెప్పింది.

కష్టపడితేనే ఫలితం

2003 నుండి ఇంట్లోనే బ్లౌజులు, డ్రెస్సులు కుట్టడం మొదలుపెట్టింది. తాను కుట్టడమే కాకుండా మరికొందరికి టైలరింగ్ నేర్పించి వాళ్ళు ఇచ్చిన ఫీజుతో కమ్మలు విడిపించుకుంది. అలా మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు ఒక్కసారి వెను తిరిగి చూసుకుంటే ఇదంతా సాధించిన తనేనా అన్న ఫీలింగ్ వస్తుందట. ఏది ఏమైనా కష్టపడితేనే ఫలితం అన్నదానికి మన లత ఓ మంచి ఉదాహరణ.

భర్త ఉద్యోగం పోయింది



2005లో లతకి పెండ్లి అయింది. భర్త దేవేందర్‌తో కలిసి నిజామాబాద్‌కి వచ్చేసింది. అక్కడ రెండేండ్లు ఖాళీగా ఉంది. భర్త హోంగార్డుగా పని చేసేవారు. కొన్ని కారణాలవల్ల భర్త ఉద్యోగం పోవడంతో కాస్త దిగులు పడింది. ఎంత ప్రయత్నించినా భర్తకు మరో ఉద్యోగం దొరకలేదు. లత నిరుత్సాహ పడకుండా ధైర్యం తెచ్చుకుంది. కాలానికి ఎదురీది పోరాడింది. భర్త తెచ్చే ఆ మూడువేల రూపాయల జీతం కూడా పోవడంతో ఒక కొత్త ఆలోచన చేసింది.

అప్పు చేసి... కుట్టుమిషన్ కొని

తనకు వచ్చిన విద్య టైలరింగ్ కాబట్టి అదే మళ్ళీ మొదలుపెట్టాలనుకుంది. తన ఆలోచనను భర్తకి చెప్పింది, ఇద్దరు ఆలోచించుకున్నారు. తనకు తెలిసిన ఒక బట్టల షాపు ఓనర్ దగ్గరికి తీసుకువెళ్ళాడు. అతను పని ఇచ్చి ఇంట్లోనే కుట్టమనేవాడు. ఎలాగో అప్పు చేసి కుట్టు మిషన్ కొన్నారు. నెలకు ఏడు వేలు సంపాదించేది. పాప పుట్టింది, ఖర్చులు పెరిగాయి, అవసరాలూ పెరిగాయి. దాంతో దేవేందర్ తనకు తెలిసిన స్కూల్స్‌కి వెళ్లి ఆర్డర్స్ తెచ్చేవాడు. ముందుగా స్కూల్ బెల్టులు, టైలు, ఐడి కార్డులు ఆర్డర్ తెచ్చేవాడు. అలా మొదలైన ఆర్డర్స్ దినదినాభివృద్ధి చెందాయి. రాను రాను టైలరింగ్ బాగా డెవలప్ అయ్యింది. స్కూల్ యూనిఫామ్ ఆర్డర్స్ రావడం మొదలయ్యాయి.

ఉచిత టైలరింగ్ శిక్షణ

లత బిజీ అయిపోయింది. అంతేకాదు పదిమందికి నేర్పించడం, పని ఇచ్చి కుట్టమనడం మొదలుపెట్టింది. ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన పేరిట ఎంతో మందికి టైలరింగ్ ఉచితంగా నేర్పించింది. కుట్టు మిషన్ కొనుక్కోవడానికి కూడా డబ్బు లేని వారికి తానే సాయం చేసి సంపాదన వచ్చిన తర్వాత తన అప్పు తీర్చమని చెప్పేది. లత చేసే ప్రతి పనికీ భర్త దేవేందర్ అండగా ఉండి ఫుల్ సపోర్ట్ చేసేవాడు. చిన్నగా మొదలైన ఆమె ఉచిత ట్రైనింగ్ పథకం రాను రాను అభివృద్ధి చెంది 50 మంది నుండి వంద మంది వరకు కుట్టు పని నేర్చుకున్నారు. భర్త అన్ని స్కూల్స్ తిరుగుతూ ఆర్డర్స్ తెస్తూ ఉంటే లత మాస్టర్స్‌ని పెట్టుకొని టైలరింగ్‌ని అభివృద్ధి చేసింది.



కరోనా మొదలవడంతో...

ఉచితంగా ఆడవారికి శిక్షణ ఇవ్వడం, ఇంటింటికీ ఒక కుట్టు మిషన్ ఇవ్వడంతో వర్కర్స్ పెరిగారు. దాంతో డ్వాక్రా మహిళా గ్రూపులో చేరి లోను తీసుకొని మంగళసూత్రం కూడా తాకట్టు పెట్టి అప్పులు చేసి బిజినెస్ డెవలప్ చేశారు ఆ భార్యాభర్తలు. పగలు రేయి కష్టపడి పనిచేయడం అలవాటు చేసుకున్నారు. ఇంతలో కరోనా మొదలైంది. మాస్కులు అవసరం పడ్డాయి అందరికీ. అనుకోని విధంగా ఆ జిల్లా కలెక్టర్ , మునిసిపాలిటీ కమిషనర్ వల్ల గవర్నమెంట్ ఆర్డర్ లత చేతికి వచ్చింది. 15 రోజులలో లక్ష మాస్కులు కుట్టి ఇవ్వమని ప్రాజెక్టు డైరెక్టర్ జరుపుల రాములు ఆర్డర్ ఇచ్చారు. ఇది లత జీవితంలో అనుకోని మార్పు.

బంగారం మొత్తం తాకట్టు పెట్టి

పెద్ద ఆర్డర్... కాకపోతే పెట్టుబడి 12 లక్షలు పెట్టాలి. దాంతో తన బంగారాన్నీ, అత్తగారి బంగారాన్నీ తల్లి బంగారాన్నీ మొత్తం తెచ్చి పెట్టుబడి పెట్టి మూడు రోజుల్లో ఆ మొత్తాన్ని సంపాదించుకొని ఆ ఆర్డర్‌ని ఎలాగో కష్టపడి దక్కించుకున్నారు. 15 రోజుల్లో లక్ష మాస్కులు పూర్తి చేసి ఇచ్చారు. మూడు లక్షలు లాభం వచ్చింది. అంత మొత్తం కండ్ల చూడడం అదే మొదటిసారి. అందులో ఒక లక్ష మాత్రమే వాళ్ళు ఉంచుకొని మిగతా రెండు లక్షలతో పేద వర్కర్లకు పప్పులు, బియ్యం, నూనె లాంటి రేషన్ ఇచ్చారు. ఆమె సేవాగుణం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం దృష్టిలో ఒక గొప్ప వ్యక్తి అయిపోయింది లత.

WE HUB సహకారంతో

అప్పటి నుండి అన్నీ పెద్ద ఆర్డర్సే వచ్చేవి. 2020లో పీపీ కిట్స్ కుట్టమని ఆర్డర్ ఇచ్చింది గవర్నమెంట్. అదే సమయంలో WE HUB సహకారంతో ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యింది. అకౌంటింగ్, మార్కెటింగ్, టాక్సులు ఇలా మొత్తం వ్యాపారానికి సంబంధించిన కిటుకులు అన్నీ నేర్పించారు అక్కడ. ఇది తన వ్యాపారంలో మరింత అభివృద్ధికి దోహదపడింది. కరోనా సమయంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్న ఆశా వర్కర్స్‌కు బ్లౌజులు కుట్టే ఆర్డర్ మళ్లీ లతకే వచ్చింది. 20వేల బ్లౌజెస్ ఒక నెలలో పూర్తి చేయాలని టార్గెట్ ఇచ్చారు. కొన్ని లత కట్ చేసేది మరికొన్ని వర్కర్స్‌తో చేయించేది. ఆ సమయంలోనే ఓ న్యూస్ ఛానల్ వాళ్ళు లత ఇంటర్వ్యూ తీసుకోవడం, ఓ ఇంగ్లీష్ పత్రికలో లత గురించి ఆర్టికల్ రావడంతో అందరి దృష్టిలో పడింది.

ప్రభుత్వ సహకారంతో...

జిల్లాలో ఉన్న అన్ని గవర్నమెంట్ స్కూల్ యూనిఫామ్ ఆర్డర్లు లతకే ఇవ్వమని గవర్నమెంట్ సహకారం అందించింది. దాంతో మూడు లక్షల యూనిఫామ్స్‌కి ఆర్డర్ వచ్చింది. నాలుగు నెలల ప్రాజెక్టు అది. వెంటనే వర్క్ మొదలు పెట్టింది లత. 2000 మంది వర్కర్స్‌తో నాలుగు బ్రాంచ్‌లు ఓపెన్ చేసింది. 'శ్రీలత లేడీస్ టైలర్ అండ్ గార్మెంట్స్' పేరుతో అంచలంచలుగా ఎదిగిన లత స్ఫూర్తిదాయక జీవితం అందరికీ ఆదర్శం.

ట్రస్టును ప్రారంభించి

లత పట్టుదల చూసిన కేఎంసి అనే సంస్థ పది లక్షల రూపాయల విలువ గల మెటీరియల్ అప్పుగా ఇచ్చారు. ఒకప్పుడు తినడానికి తిండి లేక కష్టపడ్డ లతా, దేవేందర్లు ఇప్పుడు ఎందరికో ఉపాధి కల్పిస్తున్నారు. పేదలకు సహాయం చేయడం ఈ దంపతుల మరో ప్రత్యేకత. మీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటని ప్రశ్నిస్తే 'జ్ఞానోదయం' అనే ట్రస్టును స్థాపించి రోడ్డుపై అడుక్కునే ప్రతి ఒక్కరికి మంచి బట్టలు కుట్టించి ఇవ్వాలని ఒక ఆలోచన, అంతేకాదు ఒక గవర్నమెంట్ స్కూలుని అడాప్ట్ చేసుకొని వారిని చదివించి మంచి ప్రయోజకులను చేయాలని వారి ఆశయం. ఇప్పుడు వారి టౌన్ లెవల్లో ఫెడరేషన్ అధ్యక్షురాలు లత. ఇంతకంటే విజయం ఏముంటుందండి. తాజాగా కంటి వెలుగులో కూడా లత వర్క్ చేస్తుంది. లత జీవితం ఇప్పుడు ఎందరికో స్ఫూర్తిదాయకం. భవిష్యత్‌లో ఆమె మరెన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుందాం.



లత గార్మెంట్స్ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

– ముచ్చర్ల రజనీ శకుంతల,
9246207774

ఆటలు




ఫార్ములా-ఈ రయ్ రయ్

- నేడు ఫార్ములా ఈ ప్రాక్టీస్ రేసు
- సిద్ధమైన హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్

నవతెలంగాణ-హైదరాబాద్

ప్రతిష్టాత్మక ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ రేసుకు రంగం సిద్ధమైంది. సుమారు దశాబ్దకాలం అనంతరం భారత్ ఓ ఎఫ్ఐఏ ఫార్ములా రేసుకు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్‌లో జరుగనున్న తొలి ఫార్ములా-ఈ రేసు కావటంతో మోటార్‌స్పోర్ట్స్ వర్గాల్లో విపరీత ఆసక్తి కనిపిస్తోంది. 11 జట్లు, 22 మంది డ్రైవర్లు నేటి నుంచి హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్‌పై రయ్‌రయ్ అనిపించనున్నారు. ఫార్ములా-ఈ రేసులో భారత్‌కు చెందిన మహీంద్రా జట్టుకు హైదరాబాద్ గ్రాండ్ ప్రీ ఆతిథ్య రేసుగా నిలువనుంది. ఫార్ములా-ఈ రేసుతో మోటార్‌స్పోర్ట్స్‌కు సరికొత్త జోష్‌తో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

నేడు ప్రాక్టీస్ రేసు



ఫార్ములా-ఈ రేసు కోసం 2.835 కిలోమీటర్ల హైదరాబాద్ స్ట్రీట్‌సర్క్యూట్ సిద్ధమైంది. ఇప్పటికే 11 జట్ల జెన్ 3 రేసింగ్ కార్లు గ్యారేజ్‌లకు చేరుకున్నాయి. నేడు సాయంత్రం 4.25-5.15వరకు వరకు తొలి ప్రాక్టీస్ రేసు జరుగనుంది. ప్రధాన రేసులో పాల్గొనే రేసర్లు సహా ప్రతి జట్టులోని యువ రేసర్లు సైతం ప్రాక్టీస్ రేసులోకి దిగే అవకాశం ఉంది. 50 నిమిషాల జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో రెండు గ్రూపులు 25 నిమిషాల చొప్పున ట్రాక్‌పై దూసుకెళ్లనున్నాయి.

ఉచిత ప్రవేశం : ఫార్ములా-ఈ ఈవెంట్‌కు రూ.1000 నుంచి రూ.1,25,000 వరకు టికెట్లను వివిధ విభాగాల్లో అందుబాటులో ఉంచారు. టికెట్లు కొనుగోలు చేయని అభిమానులు ఫార్ములా-ఈ మజా ఆస్వాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ అవకాశం కల్పించింది. నేడు ప్రాక్టీస్ రేసును టికెట్ లేకుండా ఉచితంగా వీక్షించే అవకాశం ఇచ్చింది.

'మల్లయుద్ధ' రెజ్లింగ్ చాంపియన్‌షిప్ ఆరంభం

- ఉత్సాహంగా తొలి రోజు కుస్తీ పోటీలు



హైదరాబాద్ : ముఖేశ్ గౌడ్ మెమోరియల్ 'మల్లయుద్ధ' రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు గురువారం ఎల్బీ స్టేడియంలో ఘనంగా ఆరంభమయ్యాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారులను గుర్తించి, జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధమయ్యేందుకు అవసరమైన ఉపకార వేతనాలు అందించే బహత్తర లక్ష్యంతో శ్రేష్ఠ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కుస్తీ పోటీలను మాజీ మంత్రి, బిజెపీ జాతీయ ఉపాధ్యక్షులు డికె అరుణ ప్రారంభించారు. ' ముఖేశ్ గౌడ్ రెజ్లర్‌గా కెరీర్‌ను మొదలుపెట్టారు. ఆయన స్మారకార్థం రూ.35 లక్షల నగదు బహుమతితో కుస్తీ పోటీలను ఈ స్థాయిలో నిర్వహించటం అభినందనీయం. శ్రేష్ఠ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్ర రెజ్లర్లు ఉన్నత స్థాయికి చేరుకోవాలని' డికె అరుణ ఆకాంక్షించారు. శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విక్రమ్ గౌడ్‌తో కలిసి డికె అరుణ పోటీలను ప్రారంభించారు. తొలి రోజు పురుషుల అండర్-15, అండర్-17 విభాగాల్లో కుస్తీ పోటీలు జరిగాయి. 17 విభాగాల్లో 700 మంది రెజ్లర్లు పోటీపడుతున్న రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఫిబ్రవరి 12న ముగియనున్నాయి.

రవీంద్రజాలం

జామ్తాలో టీమ్ ఇండియా జాతర. బంతితో రవీంద్ర జడేజా (5/47) ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టగా.. బ్యాట్‌తో కెప్టెన్ రోహిత్ శర్మ (56 బ్యాటింగ్) అజేయ అర్థ సెంచరీతో దండెత్తాడు. కీలక టాస్ ఓడినా.. అటు బంతితో, ఇటు బ్యాట్‌తో అదరగొట్టిన టీమ్ ఇండియా నాగ్‌పూర్‌లో తొలి రోజు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 77/1తో కొనసాగుతుంది.


- జడేజా ఐదు వికెట్ల ప్రదర్శన
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 177/10
- రోహిత్ అజేయ అర్థ సెంచరీ
- భారత్ తొలి ఇన్నింగ్స్ 77/1

నవతెలంగాణ-నాగ్‌పూర్

రవీంద్ర జడేజా (5/47) పునరాగమనంలో మాయ చేశాడు. లంచ్ తర్వాత ఆసీస్‌ను ఖతం చేసిన జడేజా..బోర్డర్-గవాస్కర్ తొలి టెస్టులో భారత్‌కు ఆరంభ ఆధిక్యత అందించాడు. జడేజాకు తోడు అశ్విన్ (3/42) మెరవటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలింది. ఓ దశలో 2/2 నుంచి 84/2తో కోలుకున్న ఆస్ట్రేలియా.. చివరి ఐదు వికెట్లను 15 పరుగులకే చేజార్చుకుంది. మార్నస్ లబుషేన్ (49, 123 బంతుల్లో 8 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (37, 107 బంతుల్లో 7 ఫోర్లు), అలెక్స్ కేరీ (36, 33 బంతుల్లో 7 ఫోర్లు), పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (31, 84 బంతుల్లో 4 ఫోర్లు) ఆస్ట్రేలియాకు గౌరవప్రద స్కోరు అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (56 బ్యాటింగ్, 69 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్థ సెంచరీతో కదం తొక్కాడు. కెఎల్ రాహుల్ (20, 71 బంతుల్లో 1 ఫోర్) రోహిత్‌తో కలిసి శుభారంభం అందించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి అశ్విన్ (0 బ్యాటింగ్) జతగా రోహిత్ అజేయంగా నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 100 పరుగుల వెనుకంజలో నిలిచింది.

సెషన్ 1 : షమి, సిరాజ్ దూకుడు

టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి రోజు పిచ్ నుంచి పరుగులు రాబట్టే ఆలోచనలో ఉన్న ఆస్ట్రేలియాకు పేసర్లు షాక్ ఇచ్చారు. మహ్మద్ షమి, మహ్మద్ సిరాజ్ తొలి మూడు ఓవర్లలోనే ఆసీస్‌ను కంగారు పెట్టారు. డెవిడ్ వార్నర్ (1) వికెట్‌ను షమి గాల్లో ఎగరేయగా.. ఖవాజ (1)ను సిరాజ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. 2/2తో ఆస్ట్రేలియా కష్టాల్లో పడింది. మార్నస్ లబుషేన్ (49), స్టీవ్ స్మిత్ (37) ఈ దశలో కంగారూలను నిలబెట్టారు. మూడో వికెట్‌కు 82 పరుగుల విలువైన భాగస్వామ్యం జోడించారు. ఆరంభంలోనే ఓపెనర్లను అవుట్ చేసిన టీమ్ ఇండియా.. ఆ తర్వాత వికెట్ కోసం చెమటోడ్చింది. భారత బౌలర్లను స్మిత్, లబుషేన్ పరీక్షించారు. లంచ్ విరామ సమయానికి ఆస్ట్రేలియా 76/2 వద్ద నిలిచింది.



సెషన్ 2 : స్పిన్ మాయజాలం

ఉదయం సెషన్లో పేసర్ల దెబ్బ నుంచి కోలుకున్న ఆస్ట్రేలియాను.. లంచ్ తర్వాత స్పిన్నర్లు వేటాడారు. వరుస బంతుల్లో మార్నస్ లబుషేన్ (49), మాట్ రెన్షా (0)లను వెనక్కి పంపిన జడేజా.. భారత్‌ను రేసులోకి తీసుకొచ్చాడు. జడేజా మాయజాలంతో ఆసీస్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టీవ్ స్మిత్ (37)ను సైతం తెలివిగా అవుట్ చేసిన జడేజా.. పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (31), టాడ్ మర్ఫీ (0)లను సైతం సాగనంపి పునరాగమనంలో ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అశ్విన్ సైతం వికెట్ల వేటలో జతకలవటంతో ఆస్ట్రేలియా 63.5 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. అలెక్స్ కేరీ (36) వికెట్‌తో టెస్టుల్లో అశ్విన్ 450 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టీ విరామ సమయానికి 174/8తో నిలిచిన ఆస్ట్రేలియా.. మూడో సెషన్ ఆరంభంలోనే చివరి రెండు వికెట్లు చేజార్చుకుంది.

సెషన్ 3 : రోహిత్ శర్మ అర్థ సెంచరీ

ఆస్ట్రేలియా బ్యాటర్లు తంటాలు పడిన పిచ్‌పై భారత కెప్టెన్ రోహిత్ శర్మ (56 నాటౌట్) అజేయ అర్థ సెంచరీ సాధించాడు. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే పాట్ కమిన్స్‌పై మూడు బౌండరీలు బాదిన రోహిత్ శర్మ ధనాధన్ ఆరంభాన్ని అందించాడు. సుమారు ఏడాది తర్వాత టెస్టు మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మ జామ్తా పిచ్‌పై కదం తొక్కాడు. వైస్ కెప్టెన్ కెఎల్ రాహుల్ (20)తో కలిసి తొలి వికెట్‌కు 76 పరుగులు జోడించాడు. తొలి రోజు మరో ఏడు బంతుల్లో ముగియనుండగా కెఎల్ రాహుల్ వికెట్ కోల్పోయాడు. అరంగేట్ర స్పిన్నర్ టాడ్ మర్ఫీ (1/13) ఆసీస్‌కు బ్రేక్ సాధించాడు. నైట్‌వాచ్‌మన్ రవిచంద్రన్ అశ్విన్ (0 నాటౌట్) తోడుగా రోహిత్ శర్మ అజేయంగా నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 77/1 పరుగులతో కొనసాగుతుంది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : డెవిడ్ వార్నర్ (బి) షమి 1, ఉస్మాన్ ఖవాజ (ఎల్బీ) సిరాజ్ 1, మార్నస్ లబుషేన్ (స్టంప్డ్) భరత్ (బి) జడేజా 49, స్టీవ్ స్మిత్ (బి) జడేజా 37, మాట్ రెన్షా (ఎల్బీ) జడేజా 0, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ (ఎల్బీ) జడేజా 31, అలెక్స్ కేరీ (బి) అశ్విన్ 36, పాట్ కమిన్స్ (సి) కోహ్లి (బి) అశ్విన్ 6, టాడ్ మర్ఫీ (ఎల్బీ) జడేజా 0, నాథన్ లయాన్ నాటౌట్ 0, స్కాట్ బొలాండ్ (బి) అశ్విన్ 1, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం :(63.5 ఓవర్లలో ఆలౌట్) 177.**

వికెట్ల పతనం : 1-2, 2-2, 3-84, 4-84, 5-109, 6-162, 7-172, 8-173, 9-176, 10-177.

బౌలింగ్ : మహ్మద్ షమి 9-4-18-1, మహ్మద్ సిరాజ్ 7-3-30-1, రవీంద్ర జడేజా 22-8-47-5, అక్షర్ పటేల్ 10-3-28-0, రవిచంద్రన్ అశ్విన్ 15.5-2-42-3.

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ నాటౌట్ 56, కెఎల్ రాహుల్ (సి,బి) టాడ్ మర్ఫీ 20, రవిచంద్రన్ అశ్విన్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 1, మొత్తం : (24 ఓవర్లలో ఓ వికెట్) 77.

వికెట్ల పతనం : 1-76.

బౌలింగ్ : పాట్ కమిన్స్ 4-1-27-0, స్కాట్ బొలాండ్ 3-1-4-0, నాథన్ లయాన్ 10-3-33-0, టాడ్ మర్ఫీ 7-0-13-1.

భరత్, సూర్యకుమార్ అరంగేట్రం



నాగ్‌పూర్‌లో టెస్టులో ఇద్దరు క్రికెటర్లు అరంగేట్రం చేశారు. తెలుగు తేజం శ్రీకర్ భరత్, సూర్యకుమార్ యాదవ్‌లు తొలి టెస్టు తుది జట్టులో నిలిచారు. మాజీ చీఫ్ కోచ్ రవిశాస్త్రి నుంచి ఈ ఇద్దరు టెస్టు క్యాప్‌లు అందుకున్నారు. పంత్ పోషించిన వికెట్ కీపర్, డ్యాషింగ్ బ్యాటింగ్ బాధ్యతలను భరత్, సూర్య పోషించనున్నారు.

నేడు కీలకం!

భారత్, ఆస్ట్రేలియా తొలి టెస్టులో రెండో రోజు కీలకం కానుంది. జామ్తా స్పిన్ స్వర్గధామం. తొలి రోజు మధ్యాహ్నం నుంచే బంతి గింగిరాలు తిరుగుతోంది. జడేజా, అశ్విన్‌లు చివరి 8 వికెట్లు పంచుకున్నారు. ఆస్ట్రేలియా 200 పరుగులైనా చేయకుండానే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు అమోఘంగా రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు సైతం మెప్పించే దిశగా సాగుతున్నారు. సుదీర్ఘ విరామం అనంతరం టెస్టు మ్యాచ్ ఆడుతున్న రోహిత్ శర్మ ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. తొలి రోజు మూడో సెషన్లో 24 ఓవర్లలోనే బారత్ 77 పరుగులు చేసి మంచి స్థితిలో కొనసాగుతుంది.

అయితే, తొలి టెస్టులో రెండో రోజు ఆట ఫలితాన్ని శాసించనుంది. ఈ పిచ్‌పై పరుగులు చేయటం అంత సులువు కాదు. ఆ విషయం ఆస్ట్రేలియా బ్యాటింగ్‌తోనే అర్థమైంది. ఆసీస్ సైతం ఓ దశలో 84/2తో నిలిచినా.. వరుస వికెట్లతో చతికిల పడింది. ప్రస్తుతం భారత్ మంచి స్థితిలోనే నిలిచినా.. తొలి ఇన్నింగ్స్‌లో 250-300 పరుగులు చేయటం అత్యవసరం. రెండో ఇన్నింగ్స్‌లో 150 పైచిలుకు టార్గెట్‌ను ఛేదించటం సైతం జామ్తా పిచ్‌పై శక్తికి మించిన పని అవుతుంది. ఈ సంగతి భారత డ్రెస్సింగ్‌రూమ్‌కు బాగా తెలుసు. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగుల లోటు అధిగమించి.. మరో 150 పరుగుల ఆధిక్యమైనా సొంతం చేసుకోవాలి. అప్పుడే నాగ్‌పూర్ టెస్టును గుప్పిట నిలుపుకోవచ్చు. విరాట్ కోహ్లి, చతేశ్వర్ పుజారా స్పిన్ ఆడటంలో ఇబ్బందులు పడటం భారత్‌కు ఆందోళనకరం. రిషబ్ పంత్ తరహాలో ధనాధన్ దంచుడు బాధ్యత సూర్యకుమార్ యాదవ్ తీసుకునే అవకాశం ఉంది. కె.ఎస్ భరత్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ సైతం పూర్తి స్థాయి బ్యాటర్ బాధ్యతలు పోషించగలరు. ఇది భారత్‌కు ప్రధాన బలం. నేడు వీలైనంత ఆధిక్యం సాధిస్తేనే రెండో ఇన్నింగ్స్‌లో కఠిన పిచ్‌పై లక్ష్యాన్ని సులువుగా ఛేదించేందుకు వీలుంటుంది. రోహిత్ అండ్ కో నేడు ఏం చేస్తుందో చూడాలి.

దుమ్మురేపిన ఎల్‌ఐసీ

- క్యూ3లో రూ.8,334 కోట్ల లాభాలు
- రూ.1.11 లక్షల కోట్ల ప్రీమియం ఆదాయం



ముంబయి : ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3) ఏకంగా రూ.8,334 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.235 కోట్ల లాభాలతో పోల్చితే బహుళ రెట్ల వృద్ధి చోటు చేసుకుంది. కాగా.. గడిచిన జులై - సెప్టెంబర్ త్రైమాసికంలోనూ రూ.15,952 కోట్లు, ఏప్రిల్-జూన్ కాలంలో రూ.682.9 కోట్ల లాభాలు నమోదు చేసింది.

గడిచిన క్యూ3లో ఎల్‌ఐసీ నికర ప్రీమియం ఆదాయం 14.5 శాతం పెరిగి రూ.1.11 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలంలో రూ.97,620 కోట్ల నికర ప్రీమియం నమోదయ్యింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో సంస్థ నూతన ప్రీమియం వ్యాపారం రూ.9,724.71 కోట్లకు పెరిగింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,748.55 కోట్ల ప్రీమియం నమోదయ్యింది. క్రితం క్యూ3లో పెట్టుబడులపై ఎల్‌ఐసీ నికర ఆదాయం 11 శాతం పెరిగి రూ.84,889 కోట్లకు చేరింది. గురువారం బీఎస్‌ఈలో ఎల్‌ఐసీ షేర్ విలువ 0.53 శాతం పెరిగి రూ.613.35 వద్ద ముగిసింది. వరుసగా ఐదు సెషన్లలో లాభాల్లో సాగింది.

డిస్నీలో 7వేల మందికి ఎసరు

లాస్‌ఏంజెల్స్ : అమెరికన్ కంపెనీలు వరుస కట్టి ఆర్థిక అనిశ్చితి భయాల్లో వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఉద్యోగ కోతలపై రోజుకో కంపెనీ ప్రకటన చేస్తున్నాయి. తాజాగా వాల్ట్ డిస్నీ తన ఖర్చులను తగ్గించుకునే పనిలో భాగంగా తమ 7,000 మంది ఉద్యోగులను తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇది ఆ కంపెనీలోని 3.6 శాతం ఉద్యోగులకు సమానం. ఉద్వాసనలతో ఖర్చులు తగ్గించుకోవడంతోపాటు ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి సారించింది. ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్ వంటి సాఫ్ట్‌వేర్ దిగ్గజాలతో పాటు బోయింగ్ వంటి విమానయాన సంస్థలు ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నాయి. స్ట్రీమింగ్ వ్యాపారాన్ని లాభదాయకంగా మార్చడానికి 7వేల ఉద్యోగులను తగ్గించుకోవాలని నిర్ణయించామని వాల్ట్ డిస్నీ సీఈఓ బాబ్ ఐగర్ పేర్కొన్నారు. కంపెనీలో మొత్తం 2 లక్షల 20 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు నెలల్లో డిస్నీకి ఖాతాదారులు ఒక్క శాతం తగ్గి 16.81 కోట్లకు పరిమితమయ్యారు. కంపెనీ ఆదాయం 23.512 బిలియన్ డాలర్లతో 1.279 బిలియన్ డాలర్ల లాభాలు నమోదయినట్టు ఆ కంపెనీ తెలిపింది.

ఒలెక్ట్రా విద్యుత్తు టిప్పర్ ప్రదర్శన



హైదరాబాద్ : దేశంలోనే తొలిసారిగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ రూపొందించిన విద్యుత్తుతో నడిచే టిప్పర్‌ను బెంగళూరులో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్‌లో ప్రదర్శించింది. ఒలెక్ట్రా మాతృసంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) తమ ఇతర ఇంధన అనుబంధ సంస్థలైన డ్రిల్‌మెక్ స్పా, పెట్రీవెన్ స్పా, మేఘా సిటీగ్యాస్, ఐకామ్ టెలీ ఉత్పత్తులనూ ఇక్కడ సందర్శనకు ఉంచింది. నిర్మాణరంగం, గనుల కార్యకలాపాలకు ఒలెక్ట్రా టిప్పర్ ఎంతో అనువైనదని ఆ సంస్థ తెలిపింది. ఒకసారి ఛార్జింగ్‌తో 150 కిలోమీటర్ల వరకు ఇది ప్రయాణిస్తుందని పేర్కొంది. ఈ నెల 6-8 తేదిల్లో జరిగిన ప్రదర్శనలో హాజరైన ప్రతినిధులను ఆకర్షించిందని పేర్కొంది. ఇప్పటికే పలు రాష్ట్రాల రోడ్లపై ప్రయాణిస్తున్న ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల వివరాల గురించి కూడా హాజరైన వారు అడిగి తెలుసుకున్నారని తెలిపింది.

నాట్కో ఫార్మాకు రూ.62 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా 2022-23 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.62.5 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది లాభాలు రూ.80.4 కోట్లతో పోల్చితే 22.5 శాతం తగ్గుదలను చవి చూసింది. గడిచిన క్యూ3లో కంపెనీ రెవెన్యూ 12.1 శాతం తగ్గి రూ.492.5 కోట్లుగా నమోదయ్యింది. మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ షేర్‌పై రూ.1.25 ఇవ్వాలని కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయించారు.

డాక్టర్ రెడ్డీస్‌కు అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్ : ప్రముఖ ఔషద ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్‌కు అంతర్జాతీయ బ్లూమ్‌బర్గ్ జెండర్ ఈక్వాలిటీ ఇండెక్స్(జీఈఐ) 2023లో చోటు దక్కించుకున్నట్టు తెలిపింది. వరుసగా ఆరోసారి తమ సంస్థకు ఈ గుర్తింపు దక్కిందని తెలిపింది. ఫార్మాస్యూటికల్ విభాగంలో ఈ ఘనత పొందిన ఏకైక భారతీయ కంపెనీగా నిలిచిందని పేర్కొంది. 2023 సూచికలో మొత్తం 45 దేశాల్లోని 11 రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 484 కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ 16 ట్రిలియన్ డాలర్లు పైనా ఉన్న కంపెనీలను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు.

ఆర్ చంద్రశేఖర్‌కు హైసియా జీవనసాఫల్య పురస్కారం

- అందించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) తన ప్రతిష్టాత్మక వార్షిక సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2023ని ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్, ప్రొడక్ట్ ఎక్స్ పో, వార్షిక పరిశ్రమ అవార్డులను అందజేసింది. హైసియా తన ప్రతిష్ఠాత్మకమైన జీవన సాఫల్య అవార్డును ఆర్ చంద్రశేఖర్‌కు మంత్రి కెటిఆర్ ప్రదానం చేశారు. ఐటి, టెలికం రంగంలో విశేష సేవలు అందించడంతో పాటుగా హైదరాబాద్ పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను ఈ అవార్డును ఇచ్చారు. హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబూ మాట్లాడుతూ.. "తెలంగాణ ఐటీ పరిశ్రమ ముందంజలో ఉందని భావిస్తున్నాం. ఈ సరైన సమయంలో, మనం పునరాలోచించాలి, పున్నసమీక్షించాలి, భవిష్యత్తును పునర్నిర్మించాలి. వచ్చే 3 సంవత్సరాలలో భారతదేశంలో 20 లక్షల ఐటి ఉద్యోగాలు వస్తాయని అంచనా" అని ఆమె చెప్పారు.

అన్వయా కిన్ కేర్‌కు గుర్తింపు

ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), ఐఓటీ ఆధారిత, సమగ్రమైన, వ్యక్తిగతీకరించిన ఒన్ స్టాప్ సీనియర్ కేర్ ప్లాట్‌ఫామ్ అన్వయా కిన్ కేర్ సంస్థ హైసియా అవార్డును అందుకుంది. ఇంటి వద్దనే డెమెన్షియా కేర్, ఐఓటీ ఆధారిత ప్రోయాక్టివ్ స్మార్ట్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సొల్యూషన్స్ కోసం బెస్ట్ ప్రొడక్- ఎస్టాబిష్ట్ కేటగిరీలో ఈ అవార్డును సొంతం చేసుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడనేది తమ నిబద్ధత, మౌలిక విలువలకు ప్రతిరూపంగా నిలుస్తుందని అన్వయాకిన్ కేర్ ఫౌండర్, డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు.

పాత పెన్షన్ అమలుపై ప్రధాని అక్కసు

ఆర్థిక క్రమశిక్షణ అవసరమంటూ హెచ్చరికలు

- ప్రతిపక్షాలపై మరోమారు మోడీ మాటల దాడి
- ప్రజా సమస్యలపై మళ్లీ దాటవేత



న్యూఢిల్లీ : ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరోక్షంగా అక్కసు వెళ్లగక్కారు. భావితరాల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటించాలంటూ రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేశారు. దేశంలో ప్రజల వాస్తవ సమస్యలను, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఎప్పటిలానే దాటవేత వైఖరిని కొనసాగించారు. బుధవారం లోక్‌సభలో ప్రతిపక్షాలపై దాడి చేసిన ప్రధాని మోడీ, గురువారం రాజ్యసభలో మరోసారి దాడి చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని సమాధానం ఇచ్చారు. రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. రాజకీయ పార్టీలు దేశ భావి తరాల బాలల భవితతో ఆటలాడుకోకూడదని అన్నారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛను పథకం (ఓపీఎస్)ను అమలు చేయడానికి ప్రయత్నిస్తుండటాన్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. పొరుగు దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

ప్రధాని మోడీ మాట్లాడుతుండగా ప్రతిపక్ష సభ్యులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. అదానీ అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ సంఘంతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల నినాదాల హోరులోనే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. ప్రతిపక్షాలు ఎంత ఎక్కువ బురద జల్లితే, కమలం అంత గొప్పగా వికసిస్తుందని చెప్పారు. కొందరి భాష, ప్రవర్తన దేశానికి నిరాశ కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ.. ఖర్గే చెప్పినట్లుగా పునాదుల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రయత్నించి ఉండవచ్చునని, అయితే కాంగ్రెస్ పాలనా కాలంలో కేవలం గోతులను మాత్రమే తవ్వారని పేర్కొన్నారు.

డిజిటల్ ఇండియా విస్తరించినందువల్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నూతన రంగం వికసిస్తోందని చెప్పారు. మన దేశంలో 90 వేల రిజిస్టర్డ్ స్టార్టప్స్ ఉన్నాయని, ఇవి ఉపాధికి నూతన అవకాశాలను అందుబాటులోకి తీసుకొచ్చాయని తెలిపారు. 2020లో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) పేరోల్‌లో కోటి మందికిపైగా నమోదయ్యారన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన వల్ల 60 వేల మందికిపైగా లబ్ధి పొందారన్నారు. వైద్యం కోసం అయ్యే ఖర్చులకు భయపడే మహిళలకు ఆయుష్మాన్ కార్డు ద్వారా బీమా ప్రయోజనాలను కల్పించినట్లు తెలిపారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న 110 జిల్లాలను గుర్తించి వాటి సత్వరం అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. 2014వ సంవత్సరానికి ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు గిరిజనుల కోసం సుమారు రూ.20,000 కోట్లు కేటాయించిందన్నారు. అయితే తన ప్రభుత్వం రూ.1.20 లక్షల కోట్లు కేటాయించిందని మోడీ గొప్పలు చెప్పారు. నాలుగు దశాబ్దాలకు పైగా ఏమీ చేయని కాంగ్రెస్‌ను దేశం తిరస్కరించిందని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి షురూ

- పోటీకి సై అంటున్న పలువురు అభ్యర్థులు
- ఇప్పటికే ప్రచారంలో నిమగ్నం
- ఉపాధ్యాయులను ఆకర్షించేందుకు ప్రయత్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. ఈనెల 16 నుంచి 23 వరకు నామినేషన్లను స్వీకరిస్తామనీ, మార్చి 13న పోలింగ్, 16న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి పదవీకాలం ఈనెల 29వ తేదీతో ముగియనుంది. దీంతో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు సై అంటున్నారు. ఈసారి పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉండే అవకాశమున్నది. ఇప్పటికే పలువురి పేర్లను ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు ప్రకటించాయి. వారిలో చాలా మంది ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ నియోజకవర్గంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలనూ వారు కలియ తిరుగుతున్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల్లో మమేకమయ్యేందుకు, వారిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అధికార బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఎవరికన్న ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నది. ఎవరికి వారు తమకంటే, తమకంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఆ పార్టీ నుంచి ఇంత వరకు అధికారికంగా ప్రకటన రాకపోవడం గమనార్హం. ప్రస్తుతానికి ఈ నియోజకవర్గంలో 15,425 మంది పురుష టీచర్లు, 14,074 మంది మహిళా ఉపాధ్యాయులు కలిపి మొత్తం 29,501 మంది ఓటర్లున్నారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 8,687 మంది, మేడ్చల్ మల్కాజిగిరిలో 6,771 మంది, హైదరాబాద్‌లో 3,775 మంది, మహబూబ్‌నగర్‌లో 3,567 మంది, వికారాబాద్‌లో 1,937 మంది, నాగర్‌కర్నూల్‌లో 1,804 మంది, వనపర్తిలో 1,399 మంది, జోగులాంబ గద్వాలలో 873 మంది, నారాయణపేట్‌లో 688 మంది ఉన్నారు. తొమ్మిది జిల్లాల్లో కలిపి 126 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బహుముఖ పోటీ...

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఈసారి అధిక సంఖ్యలోనే ఎమ్మెల్సీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశమున్నది. టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా పాపన్నగారి మాణిక్‌రెడ్డి, పీఆర్టీయూటీఎస్ నుంచి గుర్రం చెన్నకేశవరెడ్డి, ఎస్టీయూటీఎస్ నుంచి బి భుజంగరావు, పీఆర్టీయూ తెలంగాణ నుంచి కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, టీపీటీఎఫ్ నుంచి వినయ్‌బాబు, బీజేపీ నుంచి ఎవిఎన్ రెడ్డి, జీటీఏ నుంచి కాసం ప్రభాకర్, ఎల్సీ జీటీఏ నుంచి ఎస్ రవీందర్, బీసీటీఏ నుంచి విజయ్‌కుమార్, టీయూటీఎఫ్ నుంచి మల్లారెడ్డి, టీఎస్‌టీసీఈఏ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా అయినేని సంతోష్‌కుమార్ ప్రస్తుతానికి పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో ఉన్నారు. మరికొంత మంది అభ్యర్థులు వివిధ సంఘాల నుంచి పోటీ చేసే అవకాశమున్నది. తెలంగాణ సీపీఎస్ యూనియన్ నుంచి అభ్యర్థి బరిలో ఉంటారని చెప్పినా ఇంత వరకు పేరు ప్రకటించలేదు. కాంగ్రెస్ నుంచి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పోటీ చేసే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఈ ఎన్నికల్లో బహుముఖ పోటీ జరగనుంది.

ఎవరికి లాభం... ఎవరికి నష్టం...

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టింది. ఇది ఏ అభ్యర్థికి కలిసొస్తుందనే చర్చ ఉపాధ్యాయుల్లో ఉన్నది. పండితులు, పీఈటీలకు పదోన్నతులు రాకపోవడంతో వారు ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికే సహాయ నిరాకరణ చేస్తున్నారు. నిషేధం విధించిన 13 జిల్లాల్లో భార్యాభర్తలకు సంబంధించి కేవలం 615 మంది స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఎస్జీటీలను మాత్రం ఒకే జిల్లాకు పంపేందుకు సుముఖంగా లేదు. దీంతో స్పౌజ్ టీచర్లు అసంతృప్తితో ఉన్నారు. హైకోర్టు ఆదేశాలతో 317 జీవో ద్వారా స్థానికతను వదిలి వేరే జిల్లాకు బదిలీ అయిన వారికి రెండేండ్ల సర్వీసు లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. కానీ స్థానిక జిల్లాకు రావాలన్న వారి ఆకాంక్ష నెరవేరడం లేదు. దీంతో సుమారు 22 వేల మంది ఉపాధ్యాయులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల అంశం ఎవరికి లాభం కలిసొస్తుందో, అసంతృప్తితో ఉన్న టీచర్లు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపుతారో ఎవరికి నష్టం కలిగిస్తారో అన్నది చర్చనీయాంశంగా మారింది. డీఏలు పెండింగ్‌లో ఉండడం పట్ల ఉపాధ్యాయులు వ్యతిరేకంగా ఉన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా మూడు వేల వరకు ఓటర్లుగా ఉన్నారు. వారు ఏ అభ్యర్థికి అనుకూలమనేది ఆసక్తి నెలకొంది. ఇంకోవైపు ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు సుమారు తొమ్మిది వేల మంది ఓటర్లుగా ఉన్నారు. వారు ఎవరికి ఓటేస్తారన్నది కీలకంగా ఉన్నది. టీఎస్‌యూటీఎఫ్ నుంచి పోటీ చేసే పాపన్నగారి మాణిక్‌రెడ్డికి ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అండగా నిలబడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ అవిశ్రాంతంగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. కాంట్రాక్టు అధ్యాపకులు కూడా ఆయనకు మద్దతు ఇస్తున్నారు. దీంతో ఉపాధ్యాయుల్లో మాణిక్‌రెడ్డి పట్ల సానుకూలత వ్యక్తమవుతున్నది.

అంగన్‌వాడి పిల్లలకు సాయం

- ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ వెల్లడి



హైదరాబాద్ : వికారాబాద్‌లోని రాజీవ్ గృహకల్పలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ప్రతినిధులు సందర్శించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పిల్లలకు స్కూల్ బ్యాగులు, నీటి బాటిళ్లు, పుస్తకాలు, పెన్సిళ్లు, పలక, బూట్లు, సాక్స్ సహా పౌష్టికహార లంచ్ ప్యాకేట్లను అందించినట్టు నిర్వాహకులు తెలిపారు. మరో కార్యక్రమంలో శ్రీ లక్ష్మి అనంత పద్మనాభ గుడికి వాటర్ కూలర్‌ను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌బీఐ లేడిస్ క్లబ్ ప్రెసిడెంట్ నుపూర్ జింగ్రాన్, ఇతర ఎగ్జిక్యూటివ్ సభ్యులు, వికారాబాద్ ఆర్‌ఎం రామక్రిష్ణ పాల్గొన్నారు.

గొర్రెల స్కీంకు రూ.5001.53 కోట్లు ఖర్చు

- మార్చి నెలాఖరు నుంచి మళ్లీ గొర్రెల పంపిణీ
- అసెంబ్లీలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ప్రస్తుతం 1.91 కోట్ల గొర్రెలు ఉన్నాయనీ, 75 శాతం సబ్సిడీ కింద మొత్తం రూ.5001.53 కోట్లు ఖర్చు చేశామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. రాష్ట్రంలో కుల వృత్తుల ప్రోత్సాహం, గొర్రెల పంపిణీ అంశాలపై ఎమ్మెల్యేలు నోముల భగత్, చల్లా ధర్మారెడ్డి, రవిశంకర్ సుంకె శాసనసభలో అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. 18 సంవత్సరాలు నిండిన గొల్ల కురుమలు అందరికీ గొర్రెలు ఇస్తామన్నారు. మార్చి నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారం నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు కేంద్రంగా ఈ కార్యక్రమం జరుగుతుందనీ, గొల్ల కురుమలు అందరూ డీడీలు కట్టాలని కోరారు. మొదటి దశ గొర్రెల పంపిణీలో 75శాతం సబ్సిడీగా రూ.3,751.15 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి 82.64 లక్షల గొర్రెల కొనుగోలు చేసి, సొసైటీల్లోని 3,93,552 మందికి పంపిణీ చేసినట్టు వివరించారు.

అదానీ అక్రమాలపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : అదానీ గ్రూపు సంస్థల అక్రమాలకు సంబంధించిన వ్యవహారంపై శుక్రవారం నాడు సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సన్నిహితుడైన గౌతమ్ అదానీకి చెందిన ఈ గ్రూపు సంస్థలు అనేక అక్రమాలకు పాల్పడినట్టు హిండెన్‌బర్గ్ సంస్థ విడుదల చేసిన నివేదికపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. అత్యవసర ప్రాతిపదికన దీనిపై విచారణ చేపట్టేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వద్ద లిస్టు చేశారని ఈ పిల్ దాఖలు చేసిన న్యాయవాది విశాల్ తివారి గురువారం తెలిపారు. ఇదే అంశానికి సంబంధించి దాఖలైన పిటిషన్లు శుక్రవారం నాడు విచారణకు రానున్నాయనీ, తన పిటిషన్‌నూ అదే రోజు విచారణ చేపట్టాల్సిందిగా న్యాయవాది విశాల్ చేసిన విజ్ఞప్తికి జస్టిస్ చంద్రచూడ్ అంగీకరించి, అనుమతించారు. 'ఇదే తరహా పిటిషన్లు శుక్రవారం విచారణకు రానున్నాయి. ఇవి కూడా హిండెన్‌బర్గ్ పరిశోధన నివేదికలకు సంబంధించి నవే. దేశ ప్రతిష్టతను దెబ్బతీయడమే గాకుండా, ఆర్థికంగానూ తీవ్ర నష్టాన్ని కలిగించిన ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ అవసరం' అని న్యాయవాది విశాల్ విజ్ఞప్తి చేయగా.. 'సరే.. జత చేయండి' అని సీజేఐ పేర్కొన్నారు.

ధరణిని రద్దు చేస్తామంటూ చెప్పడం దుర్మార్గం

- రెవెన్యూ శాఖ పద్దుపై అసెంబ్లీలో మంత్రి వేముల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతులకు గుండె ధైర్యం వచ్చిందని రాష్ట్ర రోడ్లు భవనాలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. భూములు క్రయ విక్రయాలు పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. ధరణి వల్ల రైతులు,ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. కానీ.. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులకు ధరణి ఇబ్బంది కరంగా మారిందని చెప్పారు. భూమి కొనేటప్పుడు, అమ్మేటప్పుడు ధరణిలో ఉన్నదా? అని చూసుకుంటున్నారనీ, ఆ పోర్టల్‌లో ఒక్కసారి రిజిస్ట్రేషన్ అయితే రైతులు ఎంతో భరోసాతో ఉంటున్నారని తెలిపారు. గతంలో బ్యాంకులోన్ తీసుకోవాలంటే చాలా రకాల డాక్యుమెంట్లు కావాలంటూ అడిగే వారనీ, లోన్ రావడానికి రెండు మూడు నెలలు తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. కానీ ఇప్పుడు ధరణి పాస్‌బుక్ తీసుకెళ్తే బ్యాంకులు వెంటనే లోన్ మంజూరు చేస్తున్నాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే.. ధరణిని రద్దు చేస్తామంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బయట మాట్లాడుతున్నారనీ, అదేతరహాలో ఆ పార్టీ సభ్యుడు శ్రీధర్‌బాబు శాసన సభలో దుర్మార్గమని మండిపడ్డారు. ధరణి రద్దు చేసి.. రైతుల రక్తం తాగే పాత పైరవీకారులు, లంచగొండులు మళ్లీ రావాలని కోరుకుంటు న్నారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణి రద్దు చేస్తామని మాట్లాడడం వెనుక కుట్రకోణం దాగి ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక లోచనలు ఉన్న కాంగ్రెస్‌కు పుట్ట గతులుండవని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యలను ధరణి సమస్యలుగా చిత్రీకరిస్తున్నారన్నారని విమర్శించారు. రెవెన్యూ సమస్యలు వేరు..సాఫ్ట్‌వేర్ సమస్యలు వేరని మంత్రి స్పష్టం చేశారు. చిన్న చిన్న సాఫ్ట్ వేర్ లోపాలు ఏవైనా ఉంటే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

ఫేస్‌బుక్‌లో అమ్మకానికి ఆయుధాలు

- అతివాద హిందూ సంస్థల సభ్యులకు ఆఫర్
- ఇలాంటివి పలు పోస్టులు గుర్తింపు
- తొలుత నిరాకరించి.. తర్వాత తొలగించిన ఫేస్‌బుక్
- 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం

న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో మైనారిటీలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. ఒకపక్క సీఏఏ వంటి చట్టాలు.. మరోపక్క హిందూత్వశక్తులు, సంస్థల దాడులు వారిని ఇప్పటికే ఆందోళనలకు గురి చేశాయి. వీటిని ఉక్కుపాదంతో అణచివేసి రాజ్యాంగం ప్రకారం మైనారిటీలకు రక్షణ కల్పించాల్సిన మోడీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నది. దీంతో అతివాద హిందూత్వ సంస్థలు ఇంకా రెచ్చిపోతున్నాయి. మరో అడుగు ముందుకేసి సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ వేదికగా ఆయుధాల కొనుగోలుకు తెరలేపుతున్నాయి. ప్రముఖ వార్త సంస్థ 'ది వాల్ స్ట్రీట్ జర్నల్'లో దీనిపై కథనం వెలువడటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఈ కథనం ప్రకారం.. భారత్‌లో హింసాత్మక చరిత్ర కలిగిన అతివాద హిందూ సంస్థకు అంకితమైన ఫోరమ్‌లోని సభ్యులకు.. ఫేస్‌బుక్ వినియోగదారులు ప్లాట్‌ఫారమ్ హ్యాండ్‌గన్‌లు, రైఫిల్స్, షాట్‌గన్‌లు, బుల్లెట్‌లు విక్రయించడానికి ఆఫర్ చేశారు. భారత్‌లో మతపరంగా మైనారిటీలైన వారిపై దాడులను పర్యవేక్షించే ఒక గ్రూపును ఏర్పాటు చేసిన రఖీబ్ హమీద్ నాయక్ దృష్టికి ఈ విషయం వచ్చింది. ఇలాంటివి 8 పోస్టులను ఆయన గుర్తించారు. దీనిపై ఫేస్‌బుక్ మాతృ సంస్థ అయిన మెటాకు ఆయన ఫిర్యాదు చేయటం మొదలుపెట్టారు.

సంస్థ నిబంధనల ప్రకారం.. ఫేస్‌బుక్ వేదికగా ఆయుధాల అమ్మకం, కొనుగోలు నిషేధం. అయితే, ఇలాంటి పోస్టులను తొలగించడానికి ఫేస్‌బుక్ తొలుత నిరాకరించింది. ఆ పోస్టులేవీ కంపెనీ నిబంధనలను ఉల్లంఘించలేదని తెలిపింది. అయితే, ఈ పోస్టులపై 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' దర్యాప్తునకు దిగింది. దీంతో అప్రమత్తమైన ఫేస్‌బుక్.. ఆయుధాల అమ్మకాలకు సంబంధించిన పోస్టులను తొలగించటం గమనార్హం. బజరంగ్‌దళ్, ఆరెస్సెస్‌కు అనుబంధ సంఘం అయిన వీహెచ్‌పీ వంటి హిందూత్వ సంస్థలకు అనుకూలంగా ఉండే ఫేస్‌బుక్ గ్రూపులలో ఈ ఆయుధాల అమ్మకాలకు సంబంధించిన ఆఫర్‌లు రావటం ఇప్పుడు ఆందోళనను కలిగిస్తున్నది.

ఫార్ములా రేసింగ్‌కు మసెరాటీ ఎంఎస్‌జి సిద్ధం

హైదరాబాద్ : ఏబీబీ ఎఫ్ఐఏ ఫార్ములా ఈ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్న తొలి ఇటాలియన్ తయారీదారు మసెరాటి హైదరాబాద్‌లో రేస్ కోసం పూర్తిగా సన్నద్ధమయినట్టు తెలిపింది. మసెరాటీ ఎంఎస్‌జీ రేసింగ్ ఇప్పుడు ట్రాక్‌పై మసెరాటీ టిపో ఫోల్గోరీ జెన్ 3 సింగిల్ సీటర్ వాహనంతో పోటీపడనుందని పేర్కొంది. ఈ వాహనాన్ని ఎడార్డో మోర్టారా, మ్యాక్సిమిలియన్ గుంథెర్ నడుపనున్నారని వెల్లడించింది. ఫిబ్రవరి 11న నగరంలో ఫార్ములా ఈ-రేసింగ్ జరగనుంది.

మండలి డిప్యూటీ చైర్మెన్‌గా బండ ప్రకాశ్

- రేపు నామినేషన్, 12న ఎన్నిక
- నోటిఫికేషన్ విడుదల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్‌గా బండ ప్రకాశ్‌ను బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఎంపిక చేశారు. ఇతర పార్టీల నుంచి పోటీ ఉండే అవకాశం లేదు. ఒకే నామినేషన్ దాఖలు కానుంది. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కావడం ఇక లాంఛనమే కానుంది. ఉభయసభల కార్యదర్శి నరసింహాచార్యులు గురువారం శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. శనివారం నామినేషన్లను స్వీకరిస్తామనీ, 12న ఎన్నిక ఉంటుందని ప్రకటించారు. బండ ప్రకాశ్ 2021, నవంబర్‌లో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన గతంలో రాజ్యసభ సభ్యునిగా పనిచేశారు. శాసనమండలి చైర్మెన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి కొనసాగుతున్న విషయం విదితమే.

అష్టకాల నృసింహరామశర్మ మరణం పట్ల సీఎం సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ సాహితీవేత్త, ఆధ్యాత్మికవేత్త అష్టావధాని అష్టకాల నృసింహరామశర్మ (80) మరణం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. ఆధ్యాత్మిక, సాహితీవేత్తగా ఆయా రంగాలకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమనిగురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అష్టకాల ఆధ్యాత్మిక సాహిత్య కృషి, సిద్ధిపేట ప్రాంత కీర్తి ప్రతిష్ఠలను మరింతగా ఇనుమడింపచేశాయని పేర్కొన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సీఎం ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నూతన సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా భారీ సభ

- ఏర్పాట్లపై మంత్రి కేటీఆర్ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 17న సచివాలయ ప్రారంభోత్సవంపై గ్రేటర్ హైద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు గురువారం అసెంబ్లీ కమిటీ హాల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడ లేని విధంగా సచివాలయానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ పేరు పెట్టిన నేపథ్యంలో ప్రతి నియోజక వర్గంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రారంభోత్సవం అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు ప్రతి నియోజకవర్గం నుంచి 10 వేల మంది హాజరయ్యేలా చూడాలన్నారు. జన సమీకరణ కోసం ఈ నెల 13న గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. ఇతర జిల్లాలకు చెందిన సీనియర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రతి నియోజకవర్గానికి ఇంచార్జీలుగా నియమిస్తామని తెలిపారు. వారు 13 నుంచి 17 వరకు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఉండి పర్యవేక్షిస్తారని చెప్పారు. సచివాలయ ప్రారంభోత్సవంతో పాటు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే సభను అందరు కలిసికట్టుగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'కేసీఆర్ కిట్ అద్భుతం'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేసీఆర్ కిట్ అద్భుతమని బీఆర్ఎస్ శాసనసభ్యులు ఆనంద్‌కుమార్ చెప్పారు. కేసీఆర్ కిట్‌తో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. మహిళలు, పిల్లల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ చేసుకున్న చర్యలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రులకు గర్భిణీలు వస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో పేదలకు న్యాయం జరుగుతున్నదని చెప్పారు.

చలో హైదరాబాద్‌కు వెళ్లకుండా అరెస్ట్ ఎక్కడికక్కడ నాయకుల అడ్డగింత



నవతెలంగాణ- విలేకరులు

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరిన పేదలు, ప్రజాసంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ అడ్డగించి ముందస్తు అరెస్టులు చేశారు. కేవీపీఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్‌ను బుధవారం రాత్రి ఇంటి వద్ద అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెనుబల్లి మండల కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాపంథా పార్టీ నాయకులను అరెస్టు చేశారు. నల్లగొండ పట్టణంలోని కతాలగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్యను అరెస్టు చేసి వన్‌టౌన్‌కు తరలించారు. నాంపల్లిలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళిని అరెస్టు చేశారు. మర్రిగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ పాండురంగారావులను అరెస్టు చేశారు. దామరచర్లలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మాలోతు వినోద్ నాయక్, ప్రజా సంఘాల నాయకులు పాపానాయక్, వినోద్, సుబాని, రవి, పిచ్చయ్యను ముందస్తు అరెస్టు అయ్యారు. పెద్దపల్లి జిల్లాలో సీపీఐ(ఎం), సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, పట్నం తదితర ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుల కుమార స్వామి, ఎ.ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, అధ్యక్షుడు ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్‌ను అరెస్టు చేశారు. రాజ న్న సిరిసిల్ల జిల్లాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు కోడం రమణ, నాయకులు ఎలిగెటి రాజశేఖర్‌ను అరెస్టు చేశారు.

పసుపు రేటు ఢమాల్

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్‌కు ప్రతిరోజూ ఐదు వేల క్వింటాళ్ల పసుపు వచ్చి చేరుతోంది. గతేడాది గరిష్ఠ ధర రూ.9800 వరకు పలకగా.. ప్రస్తుతం గురువారం రైతు లకు వచ్చిన గరిష్ఠ ధర రూ.5910 కావడం గమనార్హం. ఇక కనిష్ఠంగా రూ.4000 పలుకుతోంది. సగటున రూ.5050 వరకు ధర వస్తోంది. మెజార్టీ రైతులకు రూ.4500 నుంచి రూ.5000 వరకు మాత్ర మే ధర పలుకుతోంది. దీంతో రైతు లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి పంట మార్కెట్‌కు రాగానే ధరలు తగ్గిపోతున్నాయని వాపోతు న్నారు. ప్రస్తుత ధరతో ద్రమ్ముకు రూ.1200 వరకు నష్టపోతున్నామని చెబుతున్నారు. నిజామాబాద్ మార్కెట్‌కు ఆర్మూర్ డివిజన్‌తో పాటు జగిత్యాల, మెట్‌పల్లి నుంచి కూడా రైతులు పసుపు తీసుకొస్తున్నారు. చివరకు తమకు రవాణా ఖర్చులు కూడా రావడం లేదని చెబుతున్నారు.

ఈ-నామ్ ఉన్నా ధరలు సున్నా..

ఈ-నామ్ విధానంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందని అధికారులు, నాయకులు చెబుతున్నప్పటికీ.. ఆ ప్రయోజనం పసుపు రైతులకు దక్కడం లేదు. దేశంలో ఎక్కడి నుంచైనా వ్యాపారులు తమ పంటలను కొనుగోలు చేస్తారన్నది ఉత్తమాటగానే మిగిలింది. ఈ యేడాది పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

క్వింటాకు రూ.4060 మాత్రమే వచ్చింది : ఈ లింగారెడ్డి, ఇబ్రహింపట్నం, జగిత్యాల

ఈ సంవత్సరం రెండు ఎకరాల 5 గుంటల్లో పసుపు పంట సాగు చేశాను. నిజామాబాద్ మార్కెట్‌కు పంట విక్రయానికి తీసుకొస్తే క్వింటాకు కేవలం రూ.4060 మాత్రమే పలికింది. గతేడాది క్వింటాకు రూ.8400 ధర వచ్చింది.

పంట సాగు తగ్గిస్తాం : రాజరెడ్డి

పసుపు పంటతో ప్రతియేడాది లాభాల కన్నా నష్టాలు ఎక్కువ అవుతున్నాయి. పంట చేతికి వచ్చిన సమయంలో రేట్లు పడిపోతున్నాయి. ఇది ఓ తంతుగా జరుగుతోంది. అందుకే పసుపు పంట సాగు తగ్గిస్తున్నాం. గతేడాది మూడు ఎకరాల్లో పంట సాగు చేస్తే.. ఈ రెండు ఎకరాలకు తగ్గించాను. వచ్చే యేడాది పూర్తిగా మానేస్తాను. క్వింటాకు రూ.4500 ధర పలికింది.

సింగరేణిపై కేంద్రం కుట్రలను భగ్నం చేస్తాం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి సంస్థను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చూస్తున్న కేంద్రం కుట్రలను భగ్నం చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హెచ్చ రించారు. గురువారం శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనులను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలంటూ సీఎం కేసీఆర్, ప్రధాని మోడీకి లేఖ రాస్తే.. వాటిని వేలం వేస్తు న్నామంటూ మోడీ చెప్పారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కార్మికుల కోసం అవసరమైతే ఎంత దూరమైనా పోతాం.. కేంద్రం కుట్రలను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. కార్మికులను, అన్ని రాజకీయ పక్షాలను కలుపుకుని ఐక్య ఉద్య మానికి శ్రీకారం చుడతామని చెప్పారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ విషయంలో కేంద్రం నిస్సిగ్గుగా మాట తప్పిందని విమర్శించారు. అక్కడ ఉక్కు నిక్షేపాలు లేవంటూ కేంద్ర మంత్రి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హెచ్ఈఓ పోస్టులపై జీవోను విడుదల చేయాలి

- కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాల ఎదుట విద్యార్థుల ధర్నా



నవతెలంగాణ-రాజేంద్రనగర్

ఉద్యాన రంగాల్లో హెచ్ఈఓ పోస్టుల భర్తీకై వెంటనే జీవోను విడుదల చేయాలని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాల ఎదుట విద్యార్థులు గురువారం ధర్నా నిర్వహించారు. హెచ్ఈఓ పోస్టుల భర్తీకై ప్రభుత్వం స్పష్టమైన హామీ వచ్చే వరకూ ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఉద్యానవన యూనివర్సిటీ పెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి నోటిఫికేషన్ రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగాలు లేకపోతే తాము చదివి ఏం లాభం అని వాపోతున్నారు. వ్యవసాయం, వెటర్నరీలలో విస్తరణ అధికారులను ప్రభుత్వం నియమించి ఉద్యానవన రంగంలో ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ధర్నా విరమించకపోవడంతో యూనివర్సిటీ అధికారులు హాస్టల్, మెస్‌కు తాళం వేశారు. అయినా విద్యార్థులు ధర్నా కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగాల భర్తీ విషయం తమ పరిధిలో లేదని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల సాధనే మా లక్ష్యం

- పీఆర్టీయూటీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తు న్నామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి చెప్పారు. పీఆర్టీయూటీఎస్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సంఘ పతాకాన్ని పీఆర్టీయూటీఎస్ అధ్య క్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా పంచాయతీరాజ్ టీచర్లకు పెన్షన్, గ్రామీణ ప్రాంత హెచ్ఆర్ఏ, ప్రసూతి సెలవులు, 010 పద్దు కింద వేత నాలు, ఇంగ్లీష్, ఫిజికల్ సైన్స్, పీఎస్‌హెచ్ఎం పోస్టుల మంజూరయ్యా యని వివరించారు. 40 జీవో నెంబర్ 40 ద్వారా ఎంఈవో, ప్రధానోపాధ్యా యులకు అధికారాలొచ్చాయని చెప్పారు.

లోపాలుంటే సరిచేస్తాం.. ధరణిని రద్దు చేయం

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు కూడా ఇబ్బంది పెట్టాలనుకుంటున్నారా? అదే అయితే చెప్పండి? అని ప్రశ్నించారు. ఏదో అవకాశం దొరికింది..రాజకీయంగా చేయాలిగనుక విమర్శ చేద్దామనుకునే ధోరణి విడనాడి అర్థవంతంగా చర్చలో పాల్గొనాలని హితవు పలికారు. ఫార్మాసిటీకి రైతుల నుంచి రూ.8 లక్షల భూమిని తీసుకుని రూ.1.38 కోట్లకు ప్రభుత్వం ఎక్కడ అమ్మిందో ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. సభను పక్కదోవ పట్టించే వ్యాఖ్యలు చేయొద్దన్నారు. అసత్యపు మాటల్ని వెనక్కి తీసుకోవాలని దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. ఒకవేళ ఆయన వెనక్కి తీసుకోకపోతే రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్‌కు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రగతి భవన్‌ను పేల్చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు దుర్మార్గంగా మాట్లాడుతున్నారనీ, ఆయన్ను సమర్థించేలా సభలో కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతున్నారని విమర్శించారు. అసలు ఆ పార్టీకి అంటూ ఒక వైఖరి ఉందా?అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల నోట్లో నుంచి ఒక్క పాజిటివ్ మాట కూడా రావడం లేదని విమర్శించారు. అందుకే అది ఎక్కడా కాకుండా పోతుందనీ, వారికి ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఆ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు.

టైటిల్ గ్యారంటీ యాక్టు తేవాలి : దుద్దిళ్ల

రాష్ట్రంలో టైటిల్ గ్యారంటీ యాక్టు తేవాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. ధరణి సమస్యల పరిష్కారంపై సూచనలు, సలహాల కోసం అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. మాజీ సైనికుల భూములను నిషేధితజాబితా నుంచి తొలగించాలని కోరారు. ఆధార్ అనుసంధానం లేకుండా హక్కుల మార్పిడి జరగడం లేదని చెప్పారు. ఒకే డాక్యుమెంట్ ద్వారా గిఫ్ట్ ఇచ్చేలా చూడాలన్నారు. గుంట భూమి వివాదంలో ఉన్నా మొత్తం ఆ సర్వేనెంబర్లన్నింటినీ బ్లాక్‌లిస్టులో పెట్టడం తగదన్నారు. అసైన్డ్ భూముల సమస్యను పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన భూములను తీసుకుని ఆక్షన్ చేయడం సరిగాదన్నారు. హరితహారం కోసం అసైన్డ్ భూములు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం భూములను లాక్కుని కోట్ల రూపాయలకు అమ్ముకుంటున్నదని ఆరోపించారు. ఫార్మాసిటీలో రూ.8 లక్షలకు సేకరించిన భూమిని రాష్ట్ర సర్కారు రూ.కోటీ 38 లక్షలకు అమ్ముకున్నదని ఆరోపించారు. ప్రభుత్వం సేకరించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని కోరారు. ల్యాండ్ సర్వే కోసం కేంద్ర ప్రభుత్వం రూ.83 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిందనీ, ఇంత వరకు సర్వే ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల్లో ల్యాండ్ సర్వే దాదాపు పూర్తికావచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తరేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. రైసుమిల్లర్ల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతున్నదని వాపోయారు. రైతులను మిల్లర్లు దోచుకుంటున్న తీరును సభలో వివరించారు. ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలనీ, ఇసుక లారీలు తిరగటం వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతు చేయాలని కోరారు.

ఇసుకతో రూ.800 కోట్ల ఆదాయమొచ్చింది : ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లలో ఇసుక ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.40 కోట్ల ఆదాయమొస్తే..టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక అది రూ.800 కోట్లకు చేరిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి వివరించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ సభ్యులొచ్చి ఇసుక మాఫియా అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ డబ్బులు ఎక్కడకు పోయాయి? అని ప్రశ్నించారు. పద్దులపై చర్చించకుండా ప్రతిదాన్ని రాజకీయం చేయడం ఆ పార్టీ సభ్యులకు అలవాటైపోయిందని విమర్శించారు.

దుద్దిళ్ల వ్యాఖ్యలను తొలగిస్తున్నాం : స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఫార్మాసిటీ భూములపై కాంగ్రెస్ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఆ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని ఆయన్ను పదేపదే సూచించినా వెనక్కి తగ్గకపోవడం సరిగాద న్నారు.'సమయం ఇవ్వటం లేదంటారు. ఇస్తే వినియోగించుకోరు. నిమిషం అంటారు ఐదు నిమిషాలు మాట్లాడుతున్నరు. నేను మంత్రి ఉన్నప్పుడు భూముల సమస్యపై దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎప్పుడు, ఎక్కడ మాట్లాడాడో నాకైతే తెలియదు. మాట్లాడినట్టు చెప్పడం సరిగాదు' అని స్పీకర్ అన్నారు.

ఆయిల్ ట్యాంకు శుభ్రం చేస్తుండగా.. ఊపిరాడక ఏడుగురు కార్మికులు మృతి

ఏపీలో ఘటన

కాకినాడ : కాకినాడ జిల్లాలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమలో ఆయిల్ ట్యాంకర్ క్లీన్ చేయడానికి దిగి ఊపిరి ఆడక ఏడుగురు కార్మికులు మృతి చెందారు. వీరిలో ఐదుగురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు, మిగిలిన ఇద్దరూ కాకినాడ జిల్లాకు చెందినవారు. తోటి కార్మికులు, స్థానికులు, మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దాపురం మండలం జి.రాగంపేటలో అంబటి సుబ్బన్న అండ్ కో ఆయిల్ కంపెనీకి చెందిన పరిశ్రమను ఏడాది క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఉత్పత్తిని ప్రారంభించారు. బుధవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో ఫ్యాక్టరీలోని ఐదో నెంబరు ఆయిల్ ట్యాంకును శుభ్రం చేసేందుకు ప్యాకింగ్ సెక్షన్‌కు చెందిన ఇద్దరు కార్మికులను అందులోకి యాజమాన్యం దింపింది. 25 అడుగుల ఎత్తున్న ఈ ట్యాంకులోకి ఎలాంటి భద్రతా పరికరాలు ఇవ్వకుండా కార్మికులను పంపింది. వారు రాకపోయే సరికి మరో ఇద్దరిని, ఆ తర్వాత మరో ఇద్దరిని ఇలా విడత విడతలుగా ఏడుగురుని ట్యాంకులోకి దింపింది. ట్యాంకులో దిగిన కార్మికుల్లో ఏ ఒక్కరూ బయటకు రాకపోవడంతో తోటి కార్మికులు అనుమానం వచ్చి చూసేసరికి అందులో వారు విగత జీవులుగా పడి ఉన్నారు. ఘాటైన వాయువుల వల్ల ఊపిరాడక మృతి చెందారని తోటి కార్మికులు తెలిపారు. ట్యాంకు కింది భాగాన్ని కట్ చేసి మృతదేహాలను బయటకు తీశారు. మృతుల్లో పాడేరుకు చెందిన వెచ్చంగి కృష్ణ (35), వెచ్చంగి నరసింహ (38), వెచ్చంగి సాగర్ (20), కురతాడు బంజుబాబు (26), కుర్ర రామారావు (43), కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన కట్టమూరి జగదీష్ (25), యల్లమిల్లి దుర్గాప్రసాద్ (27) ఉన్నారు. వీరిలో కృష్ణ, నరసింహ, సాగర్ ఒకే కుటుంబానికి చెందిన వారు. ప్రమాద విషయం తెలియగానే పాలిమేరు గ్రామం నుంచి మృతులు బంధువులు ఫ్యాక్టరీకి చేరుకున్నారు. వారి రోదనలతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది.

కరెంటు లేక రైతులు కష్టాలు పడుతున్నారు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం కనీసం నాలుగు, ఐదు గంటల కరెంటు కూడా ఇవ్వలేని ప రిస్థితి. ఎప్పుడు ఇస్తున్నారో, ఏ సమయంలో ఇస్తున్నారో తెలువదు. వాయి దా తీర్మానం ఇస్తే స్పీకర్ తిరస్కరించారు. ఆవేదనతో నిరసన తెలిపి బయ టికి వచ్చాం. రైతుల సమస్యలపై చర్చించే చిత్తశద్ధి ఈ ప్రభుత్వానికి లేదు.

స్పీకర్ తీరు బాధాకరంములుగు ఎమ్మెల్యే సీతక్క

రైతుల ఆవేదన అర్థం చేసుకుని మేము వాయిదా తీర్మానం ఇస్తే స్పీ కర్ తిరస్కరించడం బాధాకరం. మిర్చి, వరి ఇతర పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారు. రైతులు ఆత్మహత్య చేసుకునే ప్రమాదం పొంచి ఉంది.'

విద్యుత్ కొనుగోలు ప్రతిపాదన వాస్తవామా? కాదా? ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

'విద్యుత్ కొనుగోలు చేయడానికి డిస్కంలు ప్రతిపాదన పెట్టాయా? లేదా? వాస్తవమా కాదా? చెప్పాలి. కొనుగోలు చేయకుంటే రైతులు ఇబ్బంది పడతారని పత్రికల్లో వచ్చిన వార్తలు నిజం కాదా? వివిధ రూపాల్లో వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీలు వసూలు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంతో విప్లవాత్మక మార్పు

- టీజీవో ఇంటర్ విద్యాఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనమనేది ఒక విప్లవాత్మక మార్పు అని టీజీవో ఇంటర్ విద్యాఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వర్లు, ఎండీ ఇస్మాయిల్, అసోసియేట్ ప్రెసిడెంట్ వి ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సస్పెండైన మధుసూదన్‌రెడ్డి ఇంటర్ విద్యా కమిషనర్‌పై కక్షపూరిత ధోరణితో నిరాధార ఆరోపణలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆన్‌లైన్ మూల్యాంకనంపై భయాందో ళనలు సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. సాంకేతిక విద్యాశాఖలో మూడేండ్ల నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం కొనసాగుతున్నదని వివరించారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్

- దేశవ్యాప్తంగా బ్లాక్ డే విజయవంతం
- 300 జిల్లాల్లోని 12 వేలకు పైగా గ్రామాల్లో బడ్జెట్ ప్రతులు దగ్ధం

న్యూఢిల్లీ : రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ఇచ్చిన బ్లాక్ డే పిలుపు దేశవ్యాప్తంగా విజయవంతమైంది. దేశవ్యాప్తంగా వేలాది మంది రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఆందోళనలో భాగమయ్యారు. 300 జిల్లాల్లోని 12 వేలకు పైగా గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దహనంచేశారు. కొన్ని గ్రామాల్లో ప్రధాని దిష్టిబొమ్మలను కూడా దహనం చేశారు. బహిరంగ సభల్లో రైతులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కార్పొరేట్ అనుకూల విధానాలపై పోరాడతామని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు. నిరసనలను ఉద్దేశించి ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ, సామాజిక రంగాలకు బడ్జెట్ కేటాయింపులను భారీగా తగ్గించడం రైతాంగం, గ్రామీణ శ్రామిక వర్గాల బాధలను తీవ్రతరం చేస్తుందని విమర్శించారు. వ్యవసాయం కోసం బడ్జెట్ అంచనా 2022-23లో రూ.1,24,000 కోట్ల నుంచి ఈ ఏడాది రూ.1,15,531 కోట్లకు గణనీయంగా తగ్గిందని అన్నారు. అదేవిధంగా, ఉపాధి హామీ కోసం కేటాయింపులు 2022-23 సవరించిన అంచనాలో రూ.89,000 కోట్ల నుంచి ఈ బడ్జెట్‌లో రూ.60,000 కోట్లకు తగ్గించారని విమర్శించారు. సవరించిన అంచనా ప్రకారం 2022-23లో రూ.2,25,000 కోట్లుగా ఉన్న ఎరువుల సబ్సిడీలను ఈ ఏడాది రూ.1,75,000 కోట్లకు భారీగా తగ్గించారనీ, 2022-23 సవరించిన అంచనాలో మార్కెట్ జోక్యం, మద్దతు ధర పథకానికి రూ.1,500 కోట్ల కేటాయించారనీ, 2023-24 బడ్జెట్ అంచనాలో ఎలాంటి ప్రస్తావన లేదని విమర్శించారు. ఫిబ్రవరి 13న కేరళ, ఫిబ్రవరి 11న తమిళనాడులో బ్లాక్‌డేగా జరుపుతారని ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ ధావలే, విజూ కృష్ణన్, ఏఐఏడబ్ల్యూయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ. విజయరాఘవన్, బి వెంకట్‌లు తెలిపారు.

24 గంటల ఉచిత విద్యుత్ ఊతపదమైంది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

'శాసనసభ సమావేశాలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలి. సభాపతులు అధికార పార్టీకి వంత పాడుతున్నట్టు ఉన్నది. 24 గంటల ఉచిత విద్యుత్ కేవలం ఊత పదమైంది. కనీసం 13 గంటలు విద్యుత్ కూడా ఇవ్వడం లేదు" అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. రైతాంగం సబ్ స్టేషన్ల ముందు ధర్నా చేస్తుంటే వీరికి కనబడటం లేదు.. మీరు పెట్టిన కంటి వెలుగులో కంటి పరీక్షలు చేయిం చుకోండి. అప్పుడన్నా కనబడుతది అని బీఆర్ఎస్ మంత్రులకు సూచించారు. "బరితెగించి అబద్ధాలు మాట్లాడుతున్నారు. శాసన సభాపతి, శాసన మండలి అధ్యక్షులు.. మాతో రండి సమస్య ఏంటో చూపిస్తాం. పత్రికలు, టీవీల్లో నిత్యం రైతుల ఆందోళనలు వీళ్లకు కనబడటం లేదు. ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన అంశా లపై కాకుండా వాళ్ల మాటలు వాళ్లవే. 24 గంటల ఉచిత విద్యుత్‌పై శాసన మండలిలో వాయిదా తీర్మానం పెట్టాను. సభాధ్యక్షులు దాన్ని తిరస్కరించడం ఎందుకు? వాస్తవాలు వెలుగులోకి వస్తాయనా?' అని ప్రశ్నించారు.

పెండ్లిండ్లకు ఆర్టీసీ డిస్కౌంట్ బస్సులు

- జూన్ 30 వరకు వర్తింపు


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పెండ్లిండ్ల సీజన్‌లో బుక్ చేసుకొనే తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) బస్సుల్లో 10 శాతం ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్టు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. అన్ని రకాల బస్ సర్వీస్‌లపై ఈ రాయితీ వర్తిస్తుందని గురువారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశం జూన్ 30 ఉంటుందని వివరించారు. కార్తీక మాసం, వనభోజనాలు, శబరిమల అయ్యప్ప దర్శనం సందర్భంగా అద్దె బస్సులకు రాయితీని కల్పించామని తెలిపారు.

శ్రీశైలంలో 50 టీఎంసీలే..

- విద్యుత్‌కు వినియోగిస్తే.. సాగు, తాగునీటికి కష్టం
- ముచ్చుమర్రి దగ్గర ఆగని నీటి వాడకం
- కనీస స్థాయికి పడిపోయిన నీటి నిల్వలు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి



వేసవితోపాటే తాగు, సాగు నీటి సమస్య దగ్గరవుతోంది.. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు రబీలో సాగునీరందించే కల్వకుర్తి ఎత్తిపోతలకు నీరు ఇచ్చే శ్రీశైలం రిజర్వాయరు వట్టిపోతోంది. 215 టీఎంసీలకు ఇప్పుడు మిగిలింది 50 టీఎంసీలు మాత్రమే. ఆవిరి, లీకేజీలు పోను మిగిలేది 40 టీఎంసీలు మాత్రమే. తెలుగు రాష్ట్రాలు ఇప్పటికీ విద్యుత్ తయారీ ఆపకపోవడం వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తాగు, సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో క్రమంగా రిజర్వాయర్లలో నీరు తగ్గిపోతోంది. మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరిచ్చేందుకు సైతం రిజర్వా యర్లలో నీరు అందుబాటులో ఉండే అవకాశాలు లేవు. ప్రధానంగా శ్రీశైలం రిజర్వాయరులో 215 టీఎంసీలకు ప్రస్తుతం 50 టిఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. గతేడాది వేసవిలో తగిన నీరు అందుబాటులో లేక శ్రీశైలం నుంచి దిగువకు పోయిన నీటిని తిరిగి పంపింగ్ చేసుకొని వాడుకొనే పరిస్థితి వచ్చింది. ఈసారి ఇప్పటికే రిజర్వాయరులో నీటిమట్టం కనీస స్థాయికి పడిపోయాయి. అయి నా.. తెలుగు రాష్ట్రాలు విద్యుత్ తయారీ ఆపడం లేదు. 30 టీఎంసీల డెడ్ స్టోరేజీ దగ్గర నీటి నిల్వను నిలిపేయాల్సింది. మిగిలిన నీటిని విద్యుత్‌కు గాకుండా తాగు, సాగు నీటికి ఉపయోగించాల్సి ఉన్నది. వేసవిలో తాగునీటితోపాటు పంటలు ఎండి పోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా శ్రీశైలం ఎగువన ముచ్చుమర్రితో పాటు పోతిరెడ్డి పాడు ద్వారా నిబంధనలకు విరుద్ధంగా నీటిని వాడటం వల్ల వేసవిలో నీటి సమస్య వస్తుందనే విమర్శలు ఉన్నాయి.

ప్రధాన నీటి వనరులదీ అదే పరిస్థితి

జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులైన ఎల్లూరులో 8.865 టీఎంసీల నీరు ఉంది. జూరాల 1.4, కోయిల్ సాగర్ 1.3, రామన్‌పాడు 1.2, గోపల్‌దిన్నె 0.110, శంకర్‌సముద్రం 0.120 టీఎంసీల నీటి ని ల్వలున్నాయి. ఇవి ప్రస్తుతం సాగు నీటితోపాటు తా గునీటికి ఉపయోగ పడుతున్నాయి. జిల్లాలో 71 మండలాలు 2137 ఆవాసాలకు అవసరమైన తాగు నీటిని అందించాల్సి ఉంది. ఐదు జిల్లాలకు వేసవి మూడు 14 టీఎంసీల నీరు అవసరముంటుంది.

రబీ సాగుకు తప్పని కష్టాలు

ఉమ్మడి జిల్లాలో ఏటా రబీ సాగుకు కష్టాలు తప్పడం లేదు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో వరి పంట అధికంగా సాగువుతోంది. ఎక్కువ మంది రైతులు మిర్చి, వేరుశనగ పంటలను కెఎల్ఐ కాల్వల ద్వారా వచ్చే నీటి ఆధారంగా సాగు చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం వల్ల సాగు నీరు ఇవ్వడం కష్టమని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వనపర్తి, కోల్లాపూర్ పరిధిలో ఉండే భూములకు వచ్చే జూరాల నీటికి వారబందీ పెట్టారు. వారం రోజులు సాగు నీళ్లు వస్తే.. మరో వారం రోజులు నిలిపేస్తారు. ఇక వీపనగండ్ల, పెబ్బేరు, చిన్నంబావి వంటి చివరి ఆయకట్టుకు సాగునీరు రావడం లేదు. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చేవరకు పొలాలకు సాగునీరు విడుదల చేసి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పాలక వర్గాలకు ముందు చూపు కరువు నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే నాగం జనార్ధన్‌రెడ్డి

రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. నీళ్లు ఉన్నప్పుడు విచ్చలవిడిగా వాడటం సరికాదు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి వల్ల సాగు, తాగునీటి సమస్య తీవ్రంగా మారనున్నది. ఈ సమస్య నుంచి బయటపడే మార్గం చూడాలి.

హుస్సేన్‌సాగర్‌లో అతిపెద్ద ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్

- రూ.17.2 కోట్లతో ఏర్పాటు చేసిన హెచ్ఎండీఏ
- ప్రారంభించిన మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

జంట నగరాలను కలిపే చారిత్రాత్మక హుస్సేన్‌సాగర్ బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ (బిపిపి) పరిసరాలను అత్యంత ఆకర్షణీయంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిది ద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. హుస్సేన్‌సాగర్, లుంబినీ పార్క్ సమీపంలో రూ.17.2 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ రూపొందించిన ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్‌ను మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ మూద్ అలీ గురువారం ప్రారంభించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయరెడ్డి, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్ కుమార్‌తో కలిసి మ్యూజికల్ ఫౌంటెన్‌ను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ నగ రానికి అపూర్వ ఆదరణ ఉందని, ట్యాంక్ బండ్ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మంత్రి కేటీఆర్ ఆలోచనలకనుగుణంగా హెచ్ఎండీఏ అధికా రులు ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారని అభినందిం చారు. ఇప్పటివరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మంత్రి కేటీఆర్ ఆదేశాలతో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్ పర్యవేక్షణలో అతి తక్కువ సమయంలో హుస్సేన్ సాగర్‌లో అతిపెద్ద ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్ రూ.17.2 కోట్లతో హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ట్యాంక్‌బండ్ సుందరీకరణ (బ్యూటిఫికేషన్) పనులను హెచ్ఎండీఏ విజయవంతంగా పూర్తి చేసిన విషయం తెలిసిందే. పీవీ మార్గ్ (నెక్లెస్ రోడ్)వెంట మరికొన్ని ఆకర్షణీయమైన అంశాలను చేకూర్చేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోందన్నారు.

రాష్ట్రంపై కేంద్రం వివక్ష అయినా ఆగని సంక్షేమం, అభివృద్ధి

- మండలిలో మంత్రి హరీశ్ రావు
- ఆదివారానికి మండలి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపిస్తూ ఆర్థిక సహకారం అందించకపోగా, హక్కుగా రావాల్సిన వాటిని ఇవ్వకుండా వేధిస్తున్నదని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. శాసనమండలిలో బడ్జెట్‌పై రెండు రోజుల పాటు జరిగిన చర్చకు గురువారం ఆయన సమాధానమిచ్చారు. వివక్ష చూపిం చినా...రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆగలేదని తెలిపారు. దేశంలో మిగిలిన రాజకీయ పార్టీలకు బీఆర్ఎస్ భిన్నమైందనీ, ఆ పార్టీలు ఎన్నికలప్పుడు హామీలిచ్చి మరిచిపోతాయనీ, బీఆర్ఎస్ ఇవ్వని హామీలను కూడా అమలు చేసిందని తెలిపారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర పథకాలతో రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. రైతులపై కేంద్రం కక్ష కట్టిందనీ, ఆ వర్గానికి సంబంధించిన పలు పథకాలకు కోత విధిం చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయింపులో కోతలను కేంద్ర కొనసాగించిందని తెలిపారు. రాష్ట్రం సమ్మిళిత బడ్జెట్‌ను ప్రవేశపెడితే, కేంద్రం కార్పొరేట్లకు దోచి పెట్టే బడ్జెట్ పెట్టిం దని విమర్శించారు.

కేంద్రం చేసిన అప్పుల కన్నా రాష్ట్రం తక్కువగా అప్పులు చేసిం దని తెలిపారు. రాష్ట్రానికి హక్కు గా రావాల్సిన వాటిని సాధించడంపై లేని శ్రద్ధ చూపని బీజేపీ రాష్ట్ర నాయకులు భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్దిపొం దాలని చూస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న గుజరాత్‌లో ఫసల్ బీమా పథకం పనికి రాదనీ అమలు చేయడం లేదనీ, రాష్ట్రంలో బీజేపీ నాయకులు ఇక్కడెందుకు గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కన్నా ఎక్కువ జీతాలు

రెండో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల కన్నా అధికంగా జీతాలిస్తున్నామని రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలతో పోల్చి మంత్రి హరీశ్ రావు వివరించారు. దసరా నాటికి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

కేంద్రం ఆర్టీసీని అమ్మేయమంటోంది



ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రశ్నకు ఆర్థికమంత్రి హరీశ్‌రావు సమాధానం



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వరంగంలోని ఆర్టీసీని అమ్మేస్తే, ప్రోత్సాహకాలు ఇస్తామని కేంద్రప్రభుత్వం పదే పదే రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నదని ఆర్థిక మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఉన్నది కాబట్టే, ఆర్టీసీకి ఏటా రూ.1,500 కోట్లు గ్రాంటుగా ఇస్తూ సంస్థను పరిరక్షిస్తున్నామని చెప్పారు. గురువారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీల చెల్లింపు, కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెస్తున్న స్క్రాప్ చట్టం ద్వారా ఆర్టీసీలో 3వేలకు పైగా బస్సులు తగ్గిపోతున్న అంశాలను సభలో ప్రస్తావించి, ఆర్థికమంత్రి సమాధానం ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి హరీశ్‌రావు పై విధంగా స్పందించారు.

రాష్ట్రంలో కేసీఆర్ లేకుండా ఇంకే ప్రభుత్వం ఉన్నా, ఆర్టీసీని ఇప్పటికే అమ్మేసి ఉండేవారని వ్యాఖ్యానించారు. కానీ సీఎం కేసీఆర్ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కట్టుబడి ఉన్నారని చెప్పారు.

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- కేంద్రాన్ని డిమాండ్ చేసిన శంకర్‌నాయక్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ ఇచ్చిందనీ, దానికి కేంద్రం ఆమోదం తెలపడం లేదని బీఆర్ఎస్ శాసనసభ్యులు శంకర్‌నాయక్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు. గురువారం బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ గిరిజనులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నారని తెలిపారు. బంజారాహిల్స్‌లో 'బంజారాభవన్' నిర్మించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వక్ఫ్‌బోర్డుపై సీబీసీఐడీ విచారణ జరిపించాలి

ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వక్ఫ్‌బోర్డు అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మూడేండ్ల కిందటే సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల అద్దెలపై కలెక్టర్లు సమీక్షించాలని కోరారు. పాత అద్దెలు వసూలు చేయడం ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఆదాయం రావడం లేదన్నారు. శాఖలో కొంత మంది అధికారులు పాతుకుపోయారనీ, ముఖ్యంగా అకౌంట్ ఆఫీసర్ 15 ఏండ్లుగా ఏ ప్రతిపాదికన కొనసాగుతున్నారని ప్రశ్నించారు. నూతన వక్ఫ్‌బోర్డు నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ ఎందుకు పనులు మొదలు పెట్టడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో ముస్లింలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింలకు పూర్తి రక్షణ కల్పిస్తున్నదని చెప్పారు. ఎంఐఎం ముస్లిం హక్కుల కోసం మాత్రమే కాకుండా హిందూ, సిక్కు, క్రిష్టియన్ మతాలకు చెందిన పౌరుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నదని చెప్పారు. స్కాలర్‌షిప్‌లు సమానంగా ఇవ్వడంలో ముస్లిం పట్ల వివక్ష కనిపిస్తున్నదన్నారు. ఆలయాలు, మసీదు, మఠాలకు సంబంధించిన భూముల రికార్డులు పరిషయన్ భాషలో ఉన్నాయనీ, ఆ రికార్డులను తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లోకి తర్జుమా చేయాలని కోరారు. సివిల్ సర్వీస్ విద్యార్థుల కోసం కోచింగ్ సెంటర్‌ను నిర్మించాలని తెలిపారు.

రేషన్ డీలర్లకు ఔట్‌సోర్సింగ్ వేతనం ఇవ్వాలి

బీఆర్ఎస్ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్

రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు ఔట్‌సోర్సింగ్ కార్మికుల తరహాలో వేతనాలు చెల్లించాలనీ, లేదంటే కమీషన్ పెంచాలని బీఆర్ఎస్ శాసనసభ్యులు నన్నపనేని నరేందర్ డిమాండ్ చేశారు. కరోనా కాలంలోనూ వారు పేదలకు బియ్యాన్ని అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలు ఆత్మగౌవరంతో బతుకుతున్నారని చెప్పారు. నామినేటేడ్ పదవులకు కూడా ఎన్నో ఇచ్చారని తెలిపారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం ద్వారా రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి పెరిగిందన్నారు. వివిధ కారణాలతో వృత్తిదారులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ 6 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నదని చెప్పారు.

సాధాబైలామా దరఖాస్తులపై తగిన నిర్ణయం తీసుకోవాలి

బీజేపీ శాసనసభ్యులు రఘునందన్‌రావు

భూముల క్రయ విక్రయాల కోసం సాధాబైలామా దరఖాస్తులపై తగిన నిర్ణయం తీసుకోవాలని బీజేపీ శాసనసభ్యులు రఘునందన్‌రావు కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అసైన్డ్ భూములను లాక్కుంటుందన్నారు. చాలా గ్రామాల్లో రైతుల భూములను అడవిగా చూపించారని తెలిపారు. ధరణిలో భూములు నమోదు కాలేదనీ, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనాథ పిల్లలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. వివిధ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన వెయ్యి కోట్ల రూపాయాల్లో ఎంత ఖర్చైయింది. లబ్దిదారులు ఎంత మంది ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

సాగు విస్తీర్ణంలో 117 శాతం పెరుగుదల

- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతోనే..
- ఎనిమిదేండ్లలో అదనంగా 72.52 లక్షల ఎకరాలకు సాగునీరు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిందని సమాచార పౌర సంబాధాల శాఖ తెలిపింది. ఈ ప్రాజెక్టును పూర్తి చేయటం వల్ల 18.25 లక్షల ఎకరాలు సాగు లోకి వచ్చాయి. అలాగే సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ వలన 3.87 లక్షల ఎకరాలు, జే. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వలన 5.58 లక్షల ఎకరాలు, రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 02 2.03 లక్షల ఎకరాలు సాగు పరిధిలోకి వచ్చాయి. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4.24 లక్షల ఎకరాలకు, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ద్వారా సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాగా పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, దేవాదుల ఎత్తిపోతల పథకాల పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇవి పూర్తయితే మరో 15.91 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

మిషన్ కాకతీయతో..

మిషన్ కాకతీయ కింద చిన్ననీటి పారుదలకు చెందిన చెరువులు, కుంటలను ప్రభుత్వం పునరుద్దరించింది. దాదాపు 27, 472 చెరువులు, కుంటలను రూ.5,349 కోట్లతో పునరుద్ధరించారు. ఫలితంగా గత ఐదేండ్లలో 8.93 టీఎంసీల నీటిని నిలువ చేసే సామర్థ్యంతో 15.05 లక్షల ఆయకట్టును స్థిరీకరణ జరిగింది. 1200 చెక్ డ్యాంలను రూ.3, 850 కోట్లతో నిర్మించాలని నిర్ణయించగా, అందులో 638 చెక్ డ్యాం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 562 చెక్ డ్యాం పనులు ప్రగతిలో ఉన్నాయి.

97.57 లక్షల ఎకరాలకు సాగునీరు

రాష్ట్రంలో మొత్తం 97.57 లక్షల ఎకరాలకు సాగునీరు వినియోగంలో ఉంది. కాగా మైక్రో ఇరిగేషన్ క్రింద 20.35 లక్షల ఎకరాలు సాగవుతోంది. గత ఆరేండ్లలో భూగర్భ జలమట్టం 4.14 మీటర్లు పైకి పెరిగింది. రానున్న రోజుల్లో సాగునీటి విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

ఏప్రిల్ 6న చలో పార్లమెంట్

అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డి.రవీంద్రన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు చెరుకు ధర నిర్ణయించాలనీ, టన్నుకు రూ.5వేలకు తగ్గకుండా ధర కల్పించాలనే డిమాండ్‌తో ఏప్రిల్ 6న చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని అఖిల భారత చెరుకు రైతుల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డి. రవీంద్రన్ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 10.25 శాతం రికవరీ కోసం టన్ను చెరుకు ధరను రూ.3050, 9.5 శాతం రికవరీకి టన్నుకు రూ.2821 ధరను ప్రకటించిందని తెలిపారు. కేంద్రం ఈరకంగా టన్నుకు రూ.150 ధర పెంచిందనీ, రికవరీ రేటును కూడా 0.25శాతం పెంచిందన్నారు. అయితే డీజిల్, యంత్రాలు, ఎరువుల ధరల పెరుగుదల కారణంగా చెరుకు ఉత్పత్తి ఖర్చు పెద్ద ఎత్తున పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కేంద్రం పెంచిన ధర ఏ మూలకూ సరిపోవడం లేదన్నారు. ఈ రకంగా మోడీ సర్కారు చెరుకు రైతులకు ద్రోహం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందికి పైగా చెరుకు రైతులకు, 50 లక్షల మంది కార్మికులకు నిరాశే మిగిలిందని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం టన్ను చెరుకుకు రూ.5,000 ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ చెరుకు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బొంతు రాంబాబు మాట్లాడుతూ...రాష్ట్రంలో చెరుకు సాగు విస్తీర్ణం సగానికి పడిపోయిందన్నారు. సాగుదారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాష్ట్రంలో మూడు చక్కెర పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. డ్రిప్ ఇరిగేషన్, రోటవేటర్, హార్వెస్టర్లను సబ్సిడీ ద్వారా అందించాలనీ, సమగ్ర చెరుకు విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్ భూ కబ్జాకోరు

- ఆరోపణలపై విచారణ జరిపించాలి
- అరెస్టులకు భయపడేది లేదు
- ప్రగతి భవన్‌ను.. అంబేద్కర్ స్టడీ సెంటర్‌గా మారుస్తాం: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఆర్ఐ కంపెనీలను బెదిరించి వంద ఎకరాల భూమిని తన మిత్రులు, దళారుల పేర్లతో బదలాయించి వేలకోట్లు కొల్లగొట్టిన ఐటీ, పురపాలక శాఖ మంత్రి (డ్రామారావు (కేటీఆర్) తనని దందాలకు పాల్పడుతున్నాడని అసెంబ్లీ వేదికగా అనటం హాస్యాస్పదంగా ఉందని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ధరణి పేరుతో ఎన్నో కుంభకోణాలకు అడ్డాగా మారిన తెలంగాణను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విముక్తులను చేస్తామని తెలిపారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన 'హాత్ సే హాత్' జోడో యాత్ర మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి గురువారం చేరుకుంది. అసెంబ్లీలో మంత్రి కేటీఆర్, ఢిల్లీలో ఎంపీ మాలోత్ కవిత తనపై చేసిన ఆరోపణలకు రేవంత్‌రెడ్డి మీడియా ముఖంగా కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి అనే వ్యక్తి సమాచార చట్టాన్ని వాడుకుని భూదందాలకు పాల్పడుతున్నాడని మంత్రి డ్రామారావు ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ధరణి లోపాలను, దందాలను త్వరలోనే బయట పెడతామని, తాము అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని స్పష్టంచేశారు. ఆర్టీఐ చట్టం ద్వారా ప్రజలకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కబ్జాలు, దందాలు వెలికితీస్తున్న తనపై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు కొడుకు చేసే అక్రమాలు తెలియకుండా ఉన్నాయా ? ధృతరాష్ట్రుడిలా కండ్లు మూసుకుని ఉన్నాడా? అంటూ కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కేసీఆర్ కుటుంబం 2014 నుంచి ఇప్పటి వరకు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రయివేటు భూములుగా మార్చారని, వీటిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అవినీతి, కుంభకోణాలకు పాల్పడిన ప్రతి కలెక్టర్‌ను కటకటాల్లోకి నెడుతుందన్నారు. ధరణి పోర్టల్ అనేది ఐఅండ్ఎఫ్ఎస్ కంపెనీకి ఇచ్చి ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేశారన్నారు. ధరణి పోర్టల్ ద్వారా సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కేటీఆర్ చేసిన భూదందాలపై విచారణ జరిపించాలన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కేసులు పెట్టారని, ఎన్నోసార్లు అరెస్టులు చేశారని, అరెస్టులకు ఎన్నడూ భయపడలేదన్నారు. యాత్ర విజయవంతం అయితే కేసీఆర్ ప్రభుత్వం కూలడం ఖాయమని భయపడి ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు కుట్రలు పన్నుతున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ప్రగతి భవన్‌ను.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌గా మార్చి తెలంగాణలోని యువతకు విజ్ఞాన కేంద్రంగా మారుస్తామని తెలిపారు.

మూడు నిర్దిష్ట ఆరోపణలపై విచారణ జరపాలి..

హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న తెల్లపూర్ భూములు టిష్మన్‌స్పియర్ అనే అమెరికన్ కంపెనీని 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లకు పిలిచింది. ఆ సందర్భంలో రూ.460కోట్లు చెల్లించి కంపెనీ కొనుగోలు చేయగా, స్థానిక వివాదంతో ప్రాజెక్టు నిలిచిపోయిందన్నారు. అనంతరం తెలంగాణ ఏర్పడ్డాక 2021లో కేటీఆర్ అండ్ కంపెనీ బెదిరింపులకు పాల్పడి రూ.260కోట్లకు ప్రతిమ శ్రీనివాస్ పేరుతో కొనుగోలు చేయలేదా అని ప్రశ్నించారు. ఢిల్లీలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలన్నారు.

మియాపూర్ ప్రాంతంలో రూ.500కోట్ల విలువైన భూమి ఎలా వచ్చిందంటూ ప్రశ్నించారు. సర్వే నెం.80లో ఐదెకరాల భూమి ఎక్కడినుంచి వచ్చిందని, రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పలేదని, డాక్యుమెంట్ ప్రూఫ్‌తో మాట్లాడుతున్నానని, మీరు ఎక్కడికి రమ్మన్నా వచ్చి నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానంటూ అధికారులు ధ్రువీకరించిన పత్రాలు చూపిస్తూ సవాల్ విసిరారు.

మధుసూదన్‌రెడ్డి అవినీతిపై సీఐడీ విచారణ చేపట్టాలి

- కార్పొరేట్ కాలేజీలకు అక్రమ ర్యాంకులపై 'లై డిటెక్టర్' నిర్వహించాలి
- ఇంటర్ పరీక్షలపై విద్యార్థుల్లో నమ్మకం కలిగించాలి
- సీఎం కేసీఆర్‌కు కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మార్చిలో నిర్వహించబోయే ఇంటర్ వార్షిక పరీక్షలను నిజాయితీగా, నిక్కచ్చిగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాలేజీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం (టీఎస్‌జీసీసీఎల్ఏ-475) కోరింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల్లో నమ్మకం కలిగించాలని సూచించింది. ఇంటర్ విద్య, బోర్డు కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డి చేసిన అవినీతిపై సీఐడీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు, ఇంటర్ బోర్డు చైర్మెన్, విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ గురువారం ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీలకు అక్రమంగా ర్యాంకులు, మార్కులు రావడంపై మధుసూదన్‌రెడ్డిపై 'లై డిటెక్టర్' పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఆయనకు సహకరించిన అధికారుల పాత్రను బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సీసీ కెమెరాల ట్యాంపరింగ్ జరిగిందంటూ ప్రకటించారని గుర్తు చేశారు. కార్యాలయ కంప్యూటర్ పాస్‌వర్డ్ ప్రైవేటుగా వాడుతున్నట్టు చెప్పారని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు రాష్ట్రంలో పది లక్షల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. ఈ దశలో సస్పెండైన మధుసూదన్‌రెడ్డి ఇంటర్ బోర్డు ప్రతిష్టను మంటగలుపుతూ, అధికారులపై ఆరోపణలు చేయడం సరైంది కాదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ చూపకుంటే ఇంటర్ పరీక్షలు, ఫలితాల్లో మళ్లీ గందరగోళం ఏర్పడే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ గౌరవాన్ని దెబ్బతీయాలనుకుంటున్న ఇలాంటి కుట్రలను అరికట్టాలని కోరారు.

రేవంత్‌రెడ్డికి వస్తున్న నష్టం ఏంది?

మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'నిజాం రాజులు నిర్మించిన నిర్మాణాలు మనం వాడుకుంటున్నాం. సెక్రటేరియట్‌లాంటి గొప్ప నిర్మాణం కడితే రేవంత్‌రెడ్డికి వస్తున్న నష్టం ఏంది? రంగులు వేసి బతికేటోనివి. రియల్ ఎస్టేట్ వాళ్లను భయపెట్టి సొమ్ము చేసుకునే వాడివి నువ్వు. నీకు క్యారెక్టర్ లేదు. అప్పుడు టీడీపీని, ఇప్పుడు కాంగ్రెస్‌ను తుంగలో తొక్కుతున్నవు. నువ్వు మావోయిస్టువా? నేను సైగ చేసి ఉంటే మానుకోట రాళ్ల రుచి చూసే వానివి. శంకర్ నాయక్ చరిత్ర తెలుసా నీకు? 70 ఏండ్లు ఓట్లను దండుకున్న మీరు రైతులు, గిరిజనుల గురించి ఆలోచించలేదు. దేశంలో ఎక్కడికి పోదామో చెప్పు 70 యేండ్ల మీ ప్రభుత్వం ఏ అభివృద్ధి చేసిందో చూపెట్టు. ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టినందుకు రాజశేఖర్‌రెడ్డిని పొగిడిన చరిత్ర కేసీఆర్‌ది. ఒక ఇంజినీర్‌గా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు. ఎర్రబెల్లి గురించి నీకు ఏం తెలుసని మాట్లాడుతున్నావు. వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఆయనది. గొప్ప చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలోకి నీలాంటి సన్యాసులు వచ్చి ఆ పార్టీని నాశనం చేశారు. భట్టి, ఉత్తమ్‌లాంటి వారు కాంగ్రెస్ పార్టీని బతికించే ప్రయత్నం చేస్తున్నారు. నువ్వేం చేస్తావో అది మాట్లాడు. కేసీఆర్ గురించి, కుటుంబం గురించి మాట్లాడితే ఖబడ్దార్..'

పంటలు ఎండుతున్నాయ్..

కరెంటు కోతలపై రైతన్న ఆగ్రహం

- సబ్‌స్టేషన్ల ముట్టడి





నవతెలంగాణ-దిలావర్‌పూర్/ బెజ్జంకి

విద్యుత్ కోతలతో పైర్లు వాడుబడుతున్నాయి.. వారం పది రోజులుగా కరెంట్ కోతలపై రైతులు ఆందోళన చెందుతున్నారు.. లక్షల రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేస్తే.. నీరందక పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ కోతలను నిరసిస్తూ గురువారం నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో రైతులు సబ్‌స్టేషన్లను ముట్టడించారు.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌ను రైతులు ముట్టడించగా.. వారికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. అధికారులను నిలదీశారు. రోడ్డుపై బైటాయించి రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి, ప్రజా రవాణాను అడ్డుకున్నారు. వారికి నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు దొడ్డికింది ముత్యంరెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కోతలు లేని విద్యుత్ అందిస్తామని చెప్పినా ఆచర ణలో మాత్రం సాధ్యం కావడం లేదన్నారు. విచ్చల విడిగా కరెంట్ కోతలు విధి స్తోందని, పగటిపూట ఆరు గంటలు కూడా సరైన కరెంటు ఇవ్వలేని దుస్థితి నెల కొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమ యాల్లో కరెంటు ఇవ్వడంతో రైతులందరూ పంట పొలా ల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులకు గురవు తున్నారన్నారు. కరెంటు బిల్లులేమో సర్‌చార్జీల పేరుతో ఇష్టారీతిన వసూలు చేస్తున్నార న్నారు. సర్ చార్జీల పేరుతో అధిక విద్యుత్ బిల్లుల వసూలు చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. ఇకనైనా కోతలు లేని విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ పాకాల గీత, ఏఈ శ్రీనివాస్ నిరసనకారులను బుజ్జగించే ప్రయత్నం చేసినా ధర్నా విరమించలేదు. సీఐ వెంకటేష్, డీఈ నాగరాజు ధర్నా స్థలానికి చేరుకుని ఇక నుంచి పగటిపూట విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ విరేష్‌కుమార్, రాంపూర్ సర్పంచ్ గోవింద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంద మల్లేష్, భాగ్యారావు, ఉమాశంకర్, అరవింద్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధనం

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ బండలింగాపూర్ గ్రామానికి చెందిన సుమారు 300 మంది రైతులు కరెంట్ కోతలను నిరసిస్తూ రోడ్డెక్కారు. గ్రామ శివారులో గల 63వ నెంబర్ జాతీయ రహదారిని దిగ్బంధించారు. పగటి పూటే త్రీ ఫేస్ కరెంట్ అందించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బేగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా

సమయపాలన లేని విద్యుత్ సరఫరాతో వరిపైరు ఎండిపోతోందని రైతులు సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల పరిధిలోని బేగంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. లక్ష్మీపూర్ గ్రామ రైతులు ధర్నా చేపట్టగా కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. తెగుళ్లు సోకిన పైరును కాపాడుకోవడానికి తంటాలు పడుతుంటే.. విద్యుత్ అధికారుల తీరువల్ల మొత్తానికే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.వెయ్యి కోట్లతో మహీంద్రా ఈవీ తయారీ కేంద్రం

- రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ రూ.వెయ్యి కోట్లతో లాస్ట్ మైల్ మొబిలిటీ ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రస్తుతం జహీరాబాద్‌లోని తమ ప్లాంట్‌కి అనుబంధంగా ఈ నూతన తయారీ ప్లాంట్ రానునట్టు వెల్లడించారు. ఈ మేరకు గురువారం మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు సమక్షంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జేజురికర్ అవగాహనా ఒప్పందం చేసుకున్నారు. ఇక్కడ మూడు, నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దీనివల్ల దాదాపు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ, భవిష్యత్తులో తమ సంస్థ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు.

12 గంటలకు పైగా..

- ఉదయం 10 గంటలకు ప్రారంభమై
- రాత్రి 10.50 గంటలకు ముగిసిన అసెంబ్లీ
- పద్దులపై గురువారం సభలో సుదీర్ఘ చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించాలనే తాపత్రయమో..? లేక కచ్చితంగా ఆదివారం నాటికి సమావేశాలను ముగించాలనో ఆతృతో తెలియదు గానీ గురువారం రాష్ట్ర శాసనసభను ప్రభుత్వం ఏకంగా 12 గంటలకు పైగా కొనసాగించింది. ఉదయం సరిగ్గా 10 గంటలకు ప్రశ్నోత్తరాలతో ప్రారంభమైన సభ.. రాత్రి 10.50 గంటలకు పద్దులపై చర్చతో ముగిసింది. ఈ రకంగా 12 గంటలా 50 నిమిషాలపాటు సుదీర్ఘంగా సభ కొనసాగటం బీఆర్ఎస్ రెండో దఫా ప్రభుత్వంలో ఇదే మొదటిసారి. సభలో పద్దులపై చర్చ సందర్భంగా గురువారం సాయంత్రం... బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. బీసీల సంక్షేమానికి అత్యధిక నిధులు కేటాయించింది తమ ప్రభుత్వమేనని గంగుల ఈ సందర్భంగా తెలిపారు. 2023-24 బడ్జెట్‌లో వారి సంక్షేమం కోసం రూ.6,229 కోట్లను కేటాయించామని చెప్పారు. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందని తెలిపారు. రైతుల సంక్షేమం, పేదల కడుపు నింపటమే పౌర సరఫరాల శాఖ కర్తవ్యమని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహంతో కేవలం ఎనిమిదిన్నరేండ్లలోనే తమ శాఖ ఎన్నో అద్భుతాలను చేసిందని వేముల ప్రశాంత్‌రెడ్డి వివరించారు. ఈ కాలంలో రోడ్ల నిర్మాణం కోసం రూ.17,232 కోట్లను ఖర్చు చేశామనీ, తద్వారా 8,672 కిలో మీటర్ల మేర రోడ్లను వేశామని తెలిపారు. గిరిజనుల జనాభా శాతం కంటే అధికంగా నిధులు కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని సత్యవతి రాథోడ్ చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అర్హులైన గిరిజనులందరికీ పోడు భూముల పట్టాలిస్తామని ఆమె హామీనిచ్చారు.

ఆర్టీసీపై ఆర్థికమంత్రి అబద్ధాలు

- తీవ్రంగా ఖండిస్తున్నాం-టీఎస్‌ఆర్టీసీ జేఏసీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీ సాక్షిగా ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆర్టీసీపై అబద్ధాలు చెప్పి, ప్రజలు, కార్మికులను తప్పుతోవ పట్టించారని టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆక్షేపించింది. మంత్రి వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ కత్తుల యాదయ్య తెలిపారు. గురువారం శాసనమండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆర్టీసీ కార్మికుల పెండింగ్ పీఆర్సీ గురించి అడిగినప్పుడు మంత్రి హరీశ్‌రావు సభలో అబద్ధాలు చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి బడ్జెట్‌లో కేటాయించిన రూ.1,500 కోట్లు బస్‌పాస్ రీయింబర్స్‌మెంట్ సొమ్మేనని స్పష్టం చేశారు. 2022-23 బడ్జెట్లో రూ.1,500 కోట్లు కేటాయించి, రూ.600 కోట్లే ఇచ్చారని చెప్పారు. ఇంకా రూ.900 కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి 2 శాతం నిధులు కేటాయించాలనీ, మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా ఆర్టీసీ కార్మికుల వేతన సవరణ కోసం మినహాయింపు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నిక ముగిసి 70 రోజులైన పట్టించుకోకుండా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను మోసం చేస్తున్నదని విమర్శించారు. ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలు రద్దు చేసి యూనియన్లకు గుర్తింపు ఇస్తామని వేలాది మంది ఆర్టీసీ కార్మికులతో టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

పాల్‌కు భద్రతపై హైకోర్టు విచారణ

- నెలలోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్

తనకు ప్రభుత్వం భద్రతను తొలగించిందంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే ఏ పాల్ రాసిన లెటర్‌ను హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారించింది. భద్రత కల్పించే విషయంలో నెలలోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని సూచించింది. 30 రోజుల్లోగా కే ఏ పాల్‌కు ఉన్న థ్రెట్‌ను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ఉజ్జల్‌భూయాన్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ గురువారం ఆదేశించింది. పాల్ కోర్టులో స్వయంగా వివరిస్తూ, సిరిసిల్లలో పోలీసుల ఎదుటే తనపై దాడి జరిగిందనీ, ఆ తర్వాత కూడా ప్రభుత్వం భద్రత కల్పించలేదని చెప్పారు. అనేక దేశాల్లో తిరిగిన తనకు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉండేదనీ, 2019లో కేసీఆర్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందన్నారు. సచివాలయంలో ఫైర్ యాక్సిడెంట్ ఘటన గురించి పాల్ ఈ సందర్భంగా చెప్పారు.

ప్రార్థనామందిరాలపై ప్రత్యేక చట్టం

- రక్షణశాఖ స్థలాల్లో కేంద్రం అనుమతులు ఇవ్వట్లేదు
- అసెంబ్లీలో పురపాలకశాఖ మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రార్థనా మందిరాల నిర్మాణంపై త్వరలో ప్రత్యేక చట్టం తెస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. గుజరాత్‌లో అప్పటి ముఖ్యమంత్రి, ఇప్పటి ప్రధాని నరేంద్రమోడీ ఈ తరహా చట్టాన్ని తెచ్చారనీ, దాన్ని అధ్యయనం చేసి, మార్పులు చేర్పులతో కొత్త చట్టాన్ని రూపొందిస్తామని తెలిపారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో గ్రేటర్ హైదరాబాద్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ సందర్భంగా ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా స్పందించారు. రోడ్ల విస్తరణకు ప్రార్థనామందిరాలు ప్రధాన అడ్డంకిగా ఉంటున్నాయనీ, దాన్ని అధిగమించేందుకు గుజరాత్ తరహా చట్టం తేవాలని సుధీర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. దానిపై మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ...'ఏ దేవుడూ, భక్తులు దుమ్మూ ధూళిలో ఉండాలని కోరుకోరు. రోడ్లకు అడ్డంగా ఉన్న ప్రార్థనామందిరాలను తొలగించి, మరో ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేస్తాం' అని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ అభివృద్ధి పనులకు రక్షణ శాఖ స్థలాల్లో అనుమతులు ఇవ్వకపోవడంపై సభలో ప్రస్తావించారు. దీనిపై కూడా మంత్రి సమాధానం చెప్పారు. గడచిన ఎనిమిదన్నరేండ్లలో కంటోన్మెంట్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకోసం కేంద్ర రక్షణ శాఖ మంత్రుల్ని పలు దఫాలు కోరినా, సహకరించలేదని అన్నారు. 'నలుగురు కేంద్ర రక్షణ శాఖ మంత్రులు మారారు. వారందరికీ విన్నవించాం. ఎవరూ సహకరించలేదు. సమస్యను వివాదాస్పదం చేయదలుచుకోలేదు. రాష్ట్రంలోని రక్షణ శాఖ స్థలాలను కేంద్ర ప్రభుత్వానికి బదలాయించలేదనే వాస్తవాన్ని గమనించాలి' అని చెప్పారు. దేశరక్షణకు సంబంధించిన అంశం కాబట్టే తాము సంయమనంతో ఉంటున్నామనీ, అవసరమైతే దీనిపై న్యాయపోరాటానికీ సిద్ధంగా ఉన్నామన్నారు. రక్షణశాఖ స్థలాలు ఉన్న చోట్ల ఇతర పట్టణాలతో అభివృద్ధి పనుల అనుసంధానం జరగట్లేదన్నారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఆర్‌డీపీ) కింద జీహెచ్ఎంసీ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను మంత్రి వివరించారు. ఎమెల్యే అరికెపూడి గాంధీ తమ నియోజకవర్గంలోని పనులను ప్రస్తావిస్తూ, వాటిని వేగవంతం చేయాలని కోరారు.

నవ వధువుకు 60 గజాల స్థలం అందజేత

నవతెలంగాణ-సరూర్‌నగర్



పేదింటి ఆడపడుచు పెండ్లి నేపథ్యంలో నూతన వధువుకు 60 గజాల స్థలం డాక్యుమెంట్ పత్రాన్ని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కొత్త మనోహర్ రెడ్డి అందజేశారు. ఆర్కెపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న వురుపాక మాధవి, అశోక్‌ల పుత్రిక లహరి వివాహమునకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి పెండ్లి కానుకగా 60 గజాల స్థలం డాక్యుమెంట్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొత్త మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే చాలామంది నిరుపేదలకు 60 గజాల చొప్పున భూమిని అందజేయడం జరిగిందన్నారు.

వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-బడంగ్‌పేట్



కొత్త మనోహర్ రెడ్డి.వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన సంవత్సర క్యాలండర్‌ను బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం కంటెస్టడ్ ఎమ్మెల్యే కొత్త మనోహర్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ పేద బడుగు బాలహీన వర్గాల ప్రజల అభివద్ధి సంక్షేమం కోసం ఎంతో కషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె కష్ణ, సంతోష్ ముదిరాజ్, రాజు కుమార్, అభిలాష, దేవుల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

- పోకిరీల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం
- రాచకొండ కమిషనర్ డి.ఎస్. చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహిళలను వేధించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, మహిళల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ తెలిపారు. పోకిరీలు, ఆకతాయిల పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. గురువారం షి టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంరక్షణ కోసం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆకతాయిలు, పోకిరీల ఆగడాలను అరికట్టడంతోపాటు గృహ హింస, పని ప్రదేశాల్లో మహిళలు, అమ్మాయిలను వేధించే వారి నుంచి బాధితులను రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. రాచకొండ పోలీసుల నేతృత్వంలో మహిళల భద్రతకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు, ప్రయాణ సమయాల్లో వేధింపుల వంటి ఇబ్బందుల నుంచి వారిని రక్షించేందుకు రాచకొండ పోలీసులు ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటున్నారని స్పష్టం చేశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఆడపిల్లల భద్రత కోసం ప్రత్యేకంగా షి టీమ్స్ పనిచేస్తున్నాయన్నారు. ఆకతాయిల ఆటకట్టించి బాధితులకు భరోసా నిలుస్తున్నాయన్నారు. పట్టుబడిన ఆకతాయిలకు కౌన్సిలింగ్ ద్వారా వారి చెడు ప్రవర్తనను మార్చుకునే విధంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తిరిగి బాధ్యత గల పౌరులుగా మారే అవకాశం కల్పిస్తున్నారన్నారు. మహిళలను గౌరవించడం తమ వ్యక్తిత్వంలో భాగం కావాలని పురుషుల నుద్దేశించి కోరారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో గడిచిన రెండు నెలల కాలంలో షీ బృందాలు ఈవ్ టీజర్లపై 118 కేసులు నమోదు చేయగా 247 మంది ఆకతాయిలను అరెస్టు చేశారన్నారు. వాటిలో 33 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 41 పెట్టీ కేసులు నమోదు చేశారన్నారు. మిగిలిన వారికి కౌన్సిలింగ్ అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు బాల, డీ.శ్రీనివాస్, సాయి శ్రీ, ఏసీపీ శ్రీధర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తుల అరెస్టు

నవతెలంగాణ-బోడుప్పల్



నిబంధనలను విరుద్ధంగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు రెండు లారీలను సీజ్ చేసిన సంఘటన మేడిపల్లి పోలీసు స్టేషను పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్‌కు చెందిన ఐతగొని సాయిరాం (22) ఐతగోని వెంకటేష్ (52)లు యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం లక్ష్మీ దేవి కాల్వ నుంచి సర్కారు నిబంధనలను విరుద్ధంగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తూ వ్యాపారం చేస్తున్నారు. అదే క్రమంలో గురువారం వారికి చెందిన లారీలు టీఎస్ 07 యూకే 8985,టీఎస్ యూజీ 2339 నెంబరు కలిగిన లారీల ద్వారా బోడుప్పల్ ప్రాంతంలో ఇసుక డంప్ చేస్తుండగా అనుమానం వచ్చిన ఇసుక లారీ యాజమానుల అసోసియేషన్ సభ్యులు తనిఖీలు చేశారు. దాంతో అసలు విషయం బయటపడింది.గత కొన్ని రోజులుగా సదరు వ్యక్తులు సర్కారు కండ్లు కప్పి ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు చెల్లించకుండానే ఇసుక వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. అక్రమ ఇసుక వ్యాపారం చేస్తూ అందరి నోట్లో మట్టికొడుతున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీ శ్రీ వినాయక లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న మేడిపల్లి పోలీసులు అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తూ ఇసుక తరలిస్తున్న లారీలతో పాటు లారీ యజమానులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...

లక్షల రూపాయలు పన్నులు చెల్లించి నిబంధనల ప్రకారం ఇసుక వ్యాపారం చేసి చివరకు అప్పులపాలై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న లారీ యజమానులకు న్యాయం జరిగేలా ఇలాంటి అక్రమ ఇసుక రవాణా చేసే వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలని శ్రీ శ్రీ వినాయక లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీను డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దోమ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి,కోశాధికారి బుచ్చిరెడ్డి,సలహ దారు రమేష్ కుమార్ గౌడ్,రవి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ-హస్తినాపురం



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో బహుళజాతి కంపెనీలతో జాబ్ మేళాను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం శుభ పరిణామమని హస్తినాపురం డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాలో స్థానిక యువత అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని, 120 బహుళజాతి కంపెనీల ద్వారా సుమారు పదివేల ఉద్యోగాలు ఇచ్చే విధంగా కంపెనీలు సన్నద్ధమయ్యాయని తెలిపారు. బి.ఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుంచి రాష్ట్రంలో అభివద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధితో పాటు ,నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిదే అని అన్నారు.



గంజాయి స్మగ్లింగ్ కేసులో విద్యార్థులు అరెస్ట్

నవతెలంగాణ-హయత్‌నగర్

గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన విద్యార్థులతో పాటుగా మరికొంత మందిని ఎల్‌బీ నగర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఎల్‌బీ నగర్ పోలీసులకు అప్పగించారు. ఎల్‌బీ నగర్ ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నాగోల్ వెంకటరమణ కాలనీ(స్వస్థలం సూర్యాపేట)లో నివాసం ఉంటున్న షైక్ అబ్బాస్, అదే ప్రాంతానికి చెందిన మర్యాద దినేష్ రెడ్డి(మాడ్గుల పల్లి నల్గొండ), మన్సూరాబాద్ సరస్వతీ నగర్ కాలనీకి చెందిన చెరుకు చందు(సూర్యాపేట), నల్లగొండకు చెందిన సత్తు శ్రీరామ్ చరణ్ తేజ అలియాస్ బంటి, వనస్థలిపురం ప్రగతి నగర్‌కు చెందిన ఆవుల సందీప్(నల్లగొండ), నాగోల్ వెంకటరమణ కాలనీకి చెందిన అజం పాషా (సూర్యాపేట), మంగల్ హాట్‌కు చెందిన సాహిల్ సింగ్, అదే ప్రాంతానికి చెందిన అభిషైక్ సింగ్ లు కలిసి నాగోల్ లో ఉన్న పేదలకు గంజాయి అమ్మకాలు చేస్తున్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10సెల్ ఫోన్‌లు, 10కేజీల గంజాయి, 3వాహనాలు, రూ. 56,930నగదు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌కు చెందిన భూక్య శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ సీలేరుకు చెందిన రాంబాబు, ఒడిస్సాకు చెందిన ఆంజనేయులు పరారీలో ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి



నవతెలంగాణ-మీర్‌పేట్

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా కీలకమని మీర్ పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మద్ది మహేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం లక్ష్మీ నగర్ కాలనీ, ఆర్ఎన్ రెడ్డి నగర్ కాలనీలలో స్వంత ఖర్చుతో దాదాపు 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతీ కాలనీల్లో, ఇండ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సొంత ఖర్చుతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కార్పొరేటర్ సిద్దాల బీరప్పను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాద్య నాయక్, గోవింద్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హెూల్ పనులను వెంటనే పూర్తి చేయాలి

- కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్



నవతెలంగాణ-ఉప్పల్

చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీనివాస హైట్స్ దగ్గర ఉప్పలకు వెళ్లే ప్రధాన రహదారిలో సివరేజీ పైప్ లైన్ మ్యాన్ హెూల్ ప్రమాదవుశాత్తు కూలిపోవడంతో, ఓవర్ ఫ్లో అయ్యే సమస్యను గణేష్ నగర్ కాలనీ సభ్యుల ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ వెంటనే స్పందించారు. సమస్యను వెంటనే ఏఈ సత్యనారాయణ దష్టికి తీసుకువెళ్లి, ప్రత్యక్షంగా అధికారులతో పర్యవేక్షించి కూలిపోయిన మ్యాన్ హెూల్‌కు మరమ్మత్తులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి కౌకొండ జగన్, రామానుజన్, సివరేజీ వాటర్ బోర్డు సిబ్బంది ఉపేందర్ మొదలగువారు పాల్గొన్నారు.

యూజీడీ పైప్ లైన్ పనులు చేయించాలి

- జలమండలి జనరల్ మేనేజర్‌కు కార్పొరేటర్ వినతి

నవతెలంగాణ- సరూర్‌నగర్



సరూర్‌నగర్ డివిజన్‌లో పలు కాలనీలలో అభివృద్ధి పనుల కోసం యూజీడీ పైప్ లైన్‌లను శాంక్షన్ చేయాలని కోరుతూ జలమండలి జనరల్ మేనేజర్ బలరా ంకు గురువారం సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీవాణి మాట్లాడుతూ కాలనీలలో పగిలిపోయిన పైపులు, డ్యామేజ్ అయిన మాన్యువల్స్ లాంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భగత్ సింగ్ నగర్, ఇంద్ర హిల్స్ ,చెరుకు తోట కాలనీ, చౌడి, బాపూనగర్, అంబేద్కర్ నగర్, లక్ష్మీ నగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, పోచమ్మబాగ్, హుడా కాలనీ, డాక్టర్స్ కాలనీ, వికాస్ నగర్ ప్రాంతాలలో రిపేర్స్‌తో పాటు కొత్త పైపులైన్ పనులు అవసరం ఉందని కోరారు. గతంలో కూడా ఇవే సమస్యలపై వినతి పత్రం అందజేశామని గుర్తు చేశారు.

ఉస్మాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-బడంగ్‌పేట్



జల్ పల్లి మున్సిపాల్టీలోని 7వ వార్డు ఉస్మాన్ నగర్ కాలనీలో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశాలతో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీఆర్ఎస్ జల్ పల్లి మున్సిపాల్టీ సీనియర్ నాయకులు సయ్యద్ యూసఫ్ పటేల్‌తో కలిసి 7వ వార్డు కౌన్సిలర్ మజర్ అలీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇప్పటికే మంత్రి సబితా సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో మున్సిపాల్టీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రికి ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా

నవతెలంగాణ-ధూల్‌పేట్



జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్ 09 పరిధిలో అక్రమ కట్టడాలపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. పురానాపూల్, ఘాన్సీ బజార్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలను గురువారం జీహెచ్ఎంసీ అధికారులు అడ్డుకున్నారు. నిర్మాణాలను కూల్చివేశారు. పురాణపూల్ డివిజన్ పరిధిలో ఓ భవన నిర్మాణ దారుడు స్థానికులకు ఇబ్బంది కలిగేలా తన భవనాన్ని నిర్మిస్తుండగా సర్కిల్ 09 ఏసీపీ రాణి తన సిబ్బందితో వెళ్లి ఆ అక్రమ కట్టడాన్ని కూల్చి వేయించారు. అదే సందర్భంలో ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని మట్టికా షేర్, లాడ్ బజార్ పరిధిలో కోర్టు ఉత్తర్వుల మేరకు ఏడు నిర్మాణాలను సీజ్ చేసి, వాటిలో కొన్నింటిని కూల్చి వేయించారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటు చూసుకుంది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ దక్షిణ మండల టాస్క్ ఫోర్స్ టీమ్ ఇన్‌చార్జ్, సంతోష్ నగర్ డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు, టౌన్ ప్లానింగ్ ఏసిపి లు రాణి, శ్రీహరి, రాందాస్, ఫహిమ్ సిబ్బంది శివ, అజీమ్, అబ్బాస్ అలీ, స్థానిక పోలీసుల సహాయంతో ఏడు భవనాలను సీజ్ చేశారు. వాటిలో కొన్ని నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణ చేపడితే చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎవరైనా సరే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



చలో ఇందిరాపార్క్‌కు తరలిన ప్రజలు

నవతెలంగాణ-తుర్కయాంజల్

అర్హులైన నిరుపేదలందరికీ ఇల్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని, స్థలం ఉన్నవారికి ఐదు లక్షల రూపాయలు నిర్మాణానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరుగుతున్న మహాధర్నాకు తుర్కయంజాల్ మున్సిపాల్టీ నుంచి ఆర్డీవో కార్యాలయంలో అర్జీలు పెట్టుకున్న వందలాది మంది నిరుపేదలు రాగన్నగూడలోని తుర్కయంజాల్ మున్సిపాల్టీ సీఐటీయూ కార్యాలయం నుంచి సీఐటీయూ నాయకులు డీ కిషన్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకులు మంచాల మాజీ జెడ్పీటీసీ పగడాల యాదయ్య సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా నాయకులు బోడ సామేల్, డి జగదీష్, ప్రకాష్ కారత్, రామకష్టారెడ్డి, ముసలయ్య, పంది జంగయ్య, తుర్క యంజాల్ మున్సిపాల్టీ ప్రజాసంఘాల నాయకులు తులసి గారి నరసింహ, ఇల్లూరి భాస్కర్, కందుకూరి శారద, కొండిగారి శంకర్, మల్యాద్రి రత్నమ్మ, యాదగిరి, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన
- బీఎన్ రెడ్డి నగర్‌లో ఘటన



నవతెలంగాణ-హస్తినాపురం

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల గర్భిణీ మృత్యువాత పడిందంటూ బంధువులు ఆందోళనకు దిగిన ఘటన బి.ఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాయి స్వరూప హాస్పిటల్‌లో చోటు చేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవర కొండ సమీపంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన నక్క చందన (20)కు నల్గొండ జిల్లా పి.ఏపల్లి మండలం అజ్మా పురం గ్రామానికి చెందిన హరీష్‌తో 8 నెలల క్రితం వివాహమైంది. బీ.ఎస్ రెడ్డినగర్‌లోని టీచర్స్ కాలనీలో హరీశ్ కారు నడుపుతూ భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. చందన రెండు నెలల గర్భిణి కాగా ఈ నెల 6న (సోమవారం) రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం బీఎన్ రెడ్డినగర్‌లోని సాయి స్వరూప హాస్పిటల్‌లో చేర్పించారు. అంతకు మునుపే ఆమె రక్త హీనతతో బాధ పడటం వలన ఆమెకు రక్తం ఎక్కించారు. బుధవారం ఉదయం చందన ఆరోగ్యం విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఎల్.బి నగర్ సమీపంలోని గ్లోబల్ హాస్పిటల్ తీసుకెళ్లాలని సాయి స్వరూప వైద్యులు సూచించారు. దాంతో బాధితురాలి బంధువులు గ్లోబల్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి చందన మరణించినట్టు ధవీకరించారు. కేవలం సాయి స్వరూప వైద్య బందం నిర్లక్ష్యం కారణంగా చందన మరణించిందని మతురాలి బంధువులు హాస్పిటల్ ముందు బైఠాయించారు.మెరుగైన వైద్య సదపాయాలు లేకున్నా బాధితులను మభ్యపెట్టి కేవలం లాభార్జనే లక్ష్యంగా ఇక్కడి వైద్యుల తీరు ఉందని, తమ దగ్గరి అత్యాధునిక వైద్య సదుపాయాలు లేకున్నా నామమాత్రపు చికిత్స అందిస్తూ ఇక్కడి యాజమాన్యం పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని వారు ఆరోపించారు. ముందే వేరేదైనా హాస్పిటల్ కి వెళ్తే చందన ప్రాణాలతో ఉండేదని మతురాలు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. వివరణ కోసం నవతెలంగాణ ప్రతినిధి ఫోన్‌లో డాక్టర్ ను సంప్రదించగా వారు స్పందించకపోవడం గమనార్హం.

జాతీయ మహిళ కమిషన్ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదస్సు

నవతెలంగాణ-హయత్ నగర్



ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగుంటే సమాజంలో ప్రతీ ఒక్కరితో మాట్లాడే సామర్థ్యం ఉంటుందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీదేవి అన్నారు. రంగారెడ్డి న్యాయ సేవా ఆధ్వర్యంలో జాతీయ మహిళ కమిషన్ చేత మహిళలకు భద్రత, బాధ్యతలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గురువారం హయత్‌నగర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవ అధికార సంస్థ రంగారెడ్డి జిల్లా రిసోర్స్ పర్సన్స్ అయిన్ శ్యామలాదేవి న్యాయవాది, సామాజికవేత్త అమితా రాణి, లాయర్‌ను నామినేట్ చేశారు. ఈ అవగాహన సదస్సు ద్వారా మహిళలకు ప్రాథమిక హక్కులు, ప్రాథమిక బాధ్యతలు, యాసిడ్ ఎటాక్, వరకట్న వేధింపుల, లైంగిక వేధింపులు, పోక్సో చట్టం, మహిళల హక్కులు, కార్మికుల చట్టాలు, కుటుంబ చట్టాలు, జిల్లా న్యాయవాదికార సంస్థలు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, ఉచిత లాయర్ గురించి వివరించారు. తదనంతరం జడ్జి మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతి ఒక్క మహిళకి ఉచిత న్యాయ సహాయం, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందిస్తామని, ఈ సమాచారాన్ని ప్రతి ఒక్కరికి చేరవేయాలని అంగన్వాడి ఆశా వర్కర్లను కోరారు. ఈ కార్యక్రమానికి ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సీపీడీఓ వర్కర్లు, సఖి సెంటర్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్‌లు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ 59 దరఖాస్తుదారులకు ప్రత్యేక డ్రైవ్‌లో వెంటనే రిజిస్ట్రేషన్లు

- ఉప్పల్ తహసీల్దారు కె.గౌతమ్ కుమార్

నవతెలంగాణ-ఉప్పల్



జీఓ నం.59 దరఖాస్తుదారులు ఈ వారం రోజులు జరిగే ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ తహసీల్దారు కె.గౌతమ్ కుమార్ తెలిపారు. జీఓ నం.59 కింద భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు ఎవరైతే చేసుకున్నారో వారు డబ్బులు చెల్లిస్తే వెంటనే రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు చెప్పారు. గురువారం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం జీఓ నెం.59కు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్ నడుస్తున్నదన్నారు. ఈ డ్రైవ్‌లో దరఖాస్తుల పరిశీలన, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నడుస్తుందన్నారు.ఉప్పల్ మండల పరిధిలో 221మంది లబ్దిదారులకు డిమాండ్ నోటీసులు అందజేశామన్నారు. వీరిలో ఇప్పటికే 16 మంది డబ్బులు చెల్లించినట్లుగా తెలిపారు. లబ్దిదారులు రామంతాపూర్, ఉప్పల్ లోని సర్వే ఆఫ్ ఇండియా, మౌలాలి హౌసింగ్ బోర్డు, చైతన్య పురి లోని ప్రభుత్వ మీ సేవ కేంద్రాలలో మాత్రమే చలాన్లు తీసి తహసీల్దారు కార్యాలయంలో సమర్పిం చాల్సిందిగా కోరారు.

అఖిల భారత కమ్యూనిస్ట్ పార్టీ అభివృద్ధికి కృషి

- సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ కేంద్ర కమిటీ సభ్యులు సదానందం, పూజార్ పిలుపు

నవతెలంగాణ-హయత్‌నగర్



అఖిల భారత కమ్యూనిస్ట్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శిలు జి సదానందం, డిహెచ్ పూజార్‌లు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ రాష్ట్రస్థాయి సదస్సులో వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత కోసం అన్ని 'మార్క్సిస్ట్ – లెనినిస్ట్' పార్టీలతో చర్చలు జరిపి ఒకే అఖిల భారత కమ్యూనిస్ట్ పార్టీ ఉండాలన్నారు. కాషాయ మనువాద కార్పొరేట్ ఫాసిస్ట్ మోడీ పాలనను ఓడించడానికి సాధ్యమైనంత విస్తృతమైన ఫాసిస్టేతర రాజకీయ ఫ్రంట్ నిర్మించడానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 28న ఫాసిస్ట్ వ్యతిరేక సభ హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, ఏఐఆర్‌డబ్ల్యూ రాష్ట్ర స్థాయి సదస్సు మంచిర్యాలలో మార్చి 8న నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆర్ సంతోష్, జాడి దేవరాజ్, గూడూరు వైకుంఠం, తాటికొండ రమాదేవి, బింగి సుధాకర్, అన్వర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు టి.పూర్ణచంద్రరావు , అడ్వకేట్ మేకల అరుణ్, ఉస్మాన్ బాష, గొల్లిపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా పురస్కారం అందుకోనున్న డా.చింతల రాకేశ్ భవాని

నవతెలంగాణ-హయత్‌నగర్



ఈనెల 23న అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం పురస్కరించుకొని 2023 సంవత్సరానికి గాను ఉత్తమ సామాజిక సేవా పురస్కారానికి ఎన్ఎస్ఎస్ విభాగంలో డా.చింతల రాకేశ్ భవాని ఎంపికయ్యారు. అస్తిత్వం సంస్థ ఈ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఆయనను ఎంపిక చేశారు. ఈనెల 20న హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. రాకేశ్ భవాని ప్రస్తుతం హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి తెలుగు కౌన్సిలర్‌గా కూడా సేవలందిస్తున్నారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ బాలుర విభాగానికి ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వంచే రంగారెడ్డి జిల్లా కోవిడ్ నోడల్ అధికారిగా సేవలందించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ క్రీడలు,యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చైర్మెన్‌గా పని చేసే "నెహ్రూ యువకేంద్రం" కు సలహా సంఘ సభ్యునిగా, రంగారెడ్డి జిల్లా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా డా.రాకేశ్ భవానిని ఎన్.ఎస్.ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ రామకష్ణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవిన్ సౌదా, సిబ్బంది, పలువురు ప్రోగ్రాం అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోత్స్న ప్రభ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి , అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించండి

- నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్



నవతెలంగాణ-నాగోల్

చెత్తను ఎక్కడపడితే అక్కడ వీధులలో పారవేయకుండా డివిజన్ ను చెత్త రహిత డివిజన్ ను గా తీర్చిదిద్దేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ సూచించారు. గురువారం డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సుచి- శుభ్రత అవగాహన ర్యాలీలో అరుణ సురేందర్ నాథ్ యాదవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం నివసిస్తున్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఇంటిలో ఉన్న తడి పొడి చెత్తను వీధులలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా వేరువేరుగా చేసి ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు వేసి డివిజన్ పరిశుభ్రతకు సహకరించాలని వారు కోరారు. పాఠశాల లు విద్యావంతులకు ఒక దేవాలయం లాంటివని అటువంటి దేవాలయాలలో చెత్త వేయకూడదని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిహెచ్ఎంసి సిబ్బంది బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగులో 1,23,663 మందికి కంటి అద్దాల పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో
కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 3,51,674మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 1,56,848 మంది పురుషులు, 1,92,807 మంది మహిళలు కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఇప్పటి వరకు 1,23,663 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా 1,68,672 మందికి ఎలాంటి కంటి జబ్బులు లేవని గుర్తించడం జరిగింది, 59,235 మందికి ప్రిస్కిప్షన్ ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. గురువారం జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో 20,992మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 6218మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశారు.

రేపు జాతీయ లోక్ అదాలత్



నవతెలంగాణ-సిటీబ్యూరో
లోక్అదాలత్ కేసులు సత్వర పరిష్కారం అవుతాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మెన్ బి సురేష్ అన్నారు. గురువారం నేరేడ్మెట్‌లో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శంకర్ శ్రీదేవితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు ఈనెల 11వ తారీఖున జరగబోయే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు. దీనికోసం ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇరుపక్షాలు రాజీకి సత్వరమే కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందని.. తద్వారా డబ్బు సమయాన్ని ఆదా చేసుకునే అవకాశాన్ని పొందవచ్చు అన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ శైలజ పాల్గొన్నారు.

సారూ... మాకు ఏదైనా ఉపాధి కల్పించరూ..

- తెలంగాణ బిడ్డల బతుకు బాగుపడేదెన్నడు ?
- వలస కూలీలు ఆవేదన



నవతెలంగాణ-నేరేడ్మెట్
అయ్యా సీఎం కేసీఆర్ సారూ తెలంగాణ వస్తే బతుకు బాగుంటదంటివి....చేతి నిండా పని అంటివి...బంగారు తెలంగాణ చేస్తనంటివి.. బతుకు బంగారం మంటివి.. డబల్ బెడ్ రూం ఇస్తనంటివి...ఏవి సారూ...? ఆ మంచి రోజులు.. తెలంగాణ బిడ్డల బతుకు బాగుపడేదెన్నడు...?? ఒకసారి మా బతుకుల గురించి ఆలోచించు సారూ...!! మాకు ఏదైనా ఉపాధి కల్పించండి సారూ....!! అంటూ నగరంలో వలస కూలీలు దీనంగా వేడుకుంటున్నారు.. పొట్ట చేతబట్టి... పట్నం వచ్చినా...పని లేకపాయే....పట్టెడు బువ్వ దొరకక పాయె...అంటూ...వలస కూలీలు కన్నీటి పర్యంతరమవుతున్నారు. వారి ఆవేదన వారి మాటల్లోనే..

మా బ్రతుకులు మారేది ఎన్నడు

'తెలంగాణ ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా పని చేస్తే కానీ కడుపునిండని బతుకులు మావి.. రోజు అడ్డా మీదికి వచ్చి పని కోసం చూస్తాం... ఒక రోజు పని ఉంటాది.. ఒక రోజు ఉండదు.పని ఉంటేనే పూట గడిచేది...పొట్ట నిండేది. పని లేని నాడు మేం ఇంటిల్లిపాది పస్తులు ఉండాల్సి వస్తుంది. 15, 20 ఏండ్ల నుంచి ఇదే పని చేసుకుంటూ జీవనం కడుపుతున్నాం.. రెక్క ఆడితే కానీ డొక్క నిండని పరిస్థితి మాది. 3 ఏండ్లు కరోనా వచ్చి మా బతుకులు తలకిందులను చేసింది. ఇప్పుడైనా కనీసం సంతోషంగా బతుకుదామంటే దిన దిన గండమే. రోజు రోజులు బియ్యం, కూరగాయలు తదితర నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో మాకు వచ్చే కూలి డబ్బులతో ఎలా బతకాలో తెలియక మా ఇంట్లో కొందరు మద్యానికి బానిసై తప్ప తాగి చని పోతున్నారు. ప్రతీ రోజు అడ్డమీదికి పోకపోతే మా బతుకులు తెల్లారవు. కూలి పని ఒకరోజు దొరికితే మరోసారి దొరకకుండా పోతుంది. పనికి వెళ్లినా రూ 500, రూ 700 కూలి కూడా రావడం లేదు. మహబూబ్ నగర్, వరంగల్, జనగాం, సిద్దిపేట జిల్లాల నుండి బతకడానికి పట్నం వస్తే చాలీచాలని వేతనంతో సరుకులు కొనలేక ఇల్లు గడవక అవస్థలు పడుతున్నాం. తెలంగాణ వచ్చాక, మా బతుకులు మారుతాయని, కోటి ఆశలతో ఎదురు చూసాం, కానీ, ఉన్న వారికి ఉందన్నట్టు తెలంగాణ ప్రభుత్వం ఉన్నవారికి పట్టం కడుతుంది, ఇంక మా బ్రతుకులు మారటం లేదు.'



మాది మహబూబ్ నగర్ జిల్లా. పొట్ట చేతబట్టి బతకడానికి పట్నం వచ్చి నాం. అడ్డా కూలి గా బతుకు తున్నా. రోజు రోజు వయసు తగ్గిపోవ డంతో మా ఆయ న, నేను చేతగానప్పటికీ పొట్ట తిప్పలు కోసం అడ్డమీదికి వచ్చి పని చేయవలసి వస్తుంది.

-సాయిలమ్మ

అయ్యా కేసీఆర్ మాది వరంగల్. పది సంవత్సరాల నుంచి ఇదే అడ్డ మీద బ్రతుకుతున్నాం. ఊరు విడిచి , ఊర్లో ఉన్న అయినోళ్ల అందర్నీ వదిలేసి ఇక్కడ వచ్చాం. పని లేదు..సపాటు లేదు. ఈడా బతకలేకపోతున్నాం.ఏదైనా పని ఇప్పించి పుణ్యం గట్టుకోండి సారూ.

- వలస కూలీ

దెబ్బతిన్న ఇండ్లను మరమ్మతు చేయిస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-బేగంపేట్
కష్టకాలంలో ఉన్న ప్రజలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గత నెలలో మినిస్టర్ రోడ్‌లో జరిగిన అగ్నిప్రమాదం తో ఇండ్లు దెబ్బతిన్న కుటుంబాలకు, ఇండ్లను ఖాళీ చేసి ఇతర ప్రాంతా లకు వెళ్లిన కుటుంబాలకు గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద మంత్రి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దెబ్బతిన్న ఇండ్లకు ప్రభుత్వ పరంగానే మరమ్మతులు చేపడతామని చెప్పారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి బాధితులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించేలా మంత్రి పర్యవేక్షణ జరిపారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆదుకున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట ఆర్డీఓ వసంత, తహసీల్దార్ శైలజ, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్ తదితరులు ఉన్నారు.

సర్కారు భూముల్లో నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులే

- జవహర్ నగర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్

నవతెలంగాణ-జవహర్‌నగర్
సర్కారు భూముల్లో నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని, పేపర్లపై లేవుట్ వేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్న వారిపై చట్టం ప్రకారం కేసులను నమోదు చేస్తామని జవహర్‌నగర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. కార్పొరేషన్‌లోని సర్వే నెం. 395లో అక్రమంగా నిర్మిస్తున్న బెస్మెంట్‌ను గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్ లోని భూములు పూర్తిగా ప్రభుత్వానివేనని, కబ్జాదారులు కబ్జాలు చేస్తూ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలకు వెనకాడబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అన్ని వసతులు కల్పించాలి



- జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్,
- కీసరలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్
మహాశివరాత్రి సందర్భంగా కీసర గుట్టలోని శ్రీరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు అన్ని వసతులు కల్పించి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఈ విషయంలో అధికారులు పూర్తి సమన్వయంతో తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వహించాలని మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ అన్నారు. కీసర రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో గురువారం కీసర గుట్టకు వెళ్లిన కలెక్టర్ అమోయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, ఆలయ చైర్మెన్ తటకం రమేష్ శర్మ, సర్పంచ్ మాధురి, అధికారులతో కలిసి క్యూలైన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆలయం వద్ద జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న మహాశివరాత్రి జాతరకు కీసరగుట్టకు భక్తుల సంఖ్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆయా శాఖలు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు , సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తుల సంఖ్య ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అవసరమైన అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రామలింగేశ్వరస్వామి జాతర నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలు, ఆయా ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశమున్నందున దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. స్నానపు గదులు, మహిళలకు ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేయాలని, అదే సమయంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు, ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చెయాలన్నారు. బారీకేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో జిల్లా పంచాయతీ అధికారులు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. భక్తులకు అత్యవసర చికిత్సకు, ప్రథమ చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు చేసి అవసరమైన వైద్య సిబ్బందిని జాతరలో అందుబాటులో ఉంచాల్సిందిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్‌కు ఆదేశించారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం ఎక్కువ సంఖ్యలో బస్సులు నడపాలని ఈ విషయంలో ఇప్పటి నుంచే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని.. ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలియజేయా లన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయానికి సంబం ధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, చైర్మెన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, కీసర ఆర్డీవో రవి, కీసర ఆలయ చైర్మెన్ రమేష్ శర్మ, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, కీసర సర్పంచ్ మాధురి, ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కీసర ప్రజాప్రతినిధులు

కలెక్టర్ అమోయ్ కుమార్ కీసరగుట్టకు విచ్చేయటం తో కీసర సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్, ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్ శర్మ ,వార్డు సభ్యుడు రామరం ప్రదీప్ , ఆలయ చైర్మెన్ తటకం రమేష్ శర్మలు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతూ పూల మొక్కలను అందజేశారు.





కంటి వెలుగు శిబిరం పరిశీలన

నవతెలంగాణ-కంటోన్మెంట్
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యానా శిబిరాన్ని గురువారం బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం సందర్శించారు. మాజీ బోర్డు సభ్యుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో వైద్యులను కలిసి అవసరమైన వారందరికీ కంటి అద్దాలు ఇవ్వాలని, అవసరమైన పేద ప్రజలకు ఆపరేషన్లు కూడా నిర్వహించాలని సూచించారు శిబిరంలో ఏ సమస్యలు తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు సింగ్, ప్రవీణ్ యాదవ్, అక్తర్, సోమయ్య ఇతర నాయకులు పాల్గొన్నారు.



వివాహానికి హాజరైన డిప్యూటీ స్పీకర్

నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ ఏ టు జెడ్ నందికొండ శ్రీనివాస్ రెడ్డి కుమార్తెల వివాహానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ , కార్పొరేటర్ బొంతు శ్రీదేవి లు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. గోలూరి అంజన్న, బీఆర్ఎస్ నాయకులు అనుముల వెంకట్ రెడ్డి, ఎస్కే నజీర్, ముత్యాలు, రవి యాదవ్, నరసింహ ఉన్నారు.

నాలా పనులను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



నాలా పనులను త్వరగా పూర్తి చేయాలిని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. అంబర్ పేట డివిజన్‌లో గల నాలా పనుల పురోగతిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన కార్పొరేటర్ మాట్లాడుతూ ఎస్టీపీలో గల నాలా పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేర్రాజు, సువర్ణ, ఆర్టికల్చర్ సిబ్బంది శ్రీధర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేష్ ముదిరాజ్, వినయ్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

గ్యారీ వేడుకల్లో డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



తార్నాక డివిజన్, లాలాపేటలోని శాంతినగర్‌లో నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ ముబారక్‌లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించారు. అనంతరం ముస్లిం సోదరులకు అన్నప్రసాదములను వడ్డించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ గ్యార్వీ షరీఫ్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ స్మారకార్థం ఇస్లామిక్ సూఫీ పండుగ. అతను ఖాద్రీ తారీఖా యొక్క శ్రేయోభిలాషి, మొత్తం ప్రపంచంలో వర్ధిల్లుతున్నాడు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ
- పలువురు ఏఎన్ఎంల అరెస్ట్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాష్ట్రంలో పని చేస్తున్న 3,500 రెండో ఏఎన్ఎంలను జీవో 16లో చేర్చి రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో అసెంబ్లీ ఉద్రిక్తంగా మారింది. బుధవారం నుంచే మండలాలు, జిల్లాల్లో అరెస్టుల పర్వం కొనసాగుతున్న బృందాలను ఎదుర్కొని, వందలాది సంఖ్యలో ఏఎన్ఎంలు హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత జీవో 16లో చేర్చిన షరతులు లేకుండా రెండో ఏఎన్ఎంలను వెంటనే రెగ్యులర్ చేయాలనీ, వెయిటేజీ వద్దు రెగ్యులేషన్ ముద్దు అనీ, తాము యంత్రాలం కాదు మనుషులమే అంటూ నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేస్తూ గ్రామం, వార్డు స్థాయిలో ప్రజలందరికీ తలలో నాలుకలాగా వ్యవహరిస్తూ మాతా శిశు సంరక్షణ హాస్పిటల్ ప్రసవాలు, సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్మూలనకు తీవ్రంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, మాతాశిశువు మరణాల సంఖ్య తగ్గుదల, జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ఆరోగ్య రంగంలో మూడో స్థానం సాధించుటకు ముఖ్య కారణం రెండో ఏఎన్ఎంలే అన్నారు. 2020 నుంచి విరుచుకు పడిన కోవిడ్-19, కరోనా అదుపు చేసే క్రమంలో వ్యాధిపై పూర్తి అవగాహన రాని రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా మరణాల సంఖ్య అధికంగా ఉన్న సమయంలో వైద్య సిబ్బంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులే పరమావధిగా భావించి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వ్యాధి కట్టడికి అవసరమైన సేవలను అందిస్తూ ముందు వరుసలో నిలిచిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే ఎంతో మంది ఏఎన్ఎంలు మరణించినప్పటికీ ప్రభుత్వం నుంచి వారికి ఎటువంటి సహాయం అందలేదన్నారు. అనంతరం తెలంగాణ రెండో ఏఎన్ఎం యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు మాట్లాడుతూ అనేక సమస్యలతో సతమతమవుతున్న రెండో ఏఎన్ఎంలు న్యాయమైన హక్కులను అడగడం కోసం చలో అసెంబ్లీకి పూనుకుంటే బుధవారం నుంచే 1,500 మందిని అరెస్టులు చేశారన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజతో పాటు మరి కొంత మందిని పోలీస్ స్టేషన్లలో దిగ్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలు, మండలాల్లో అరెస్టు చేసిన ఏఎన్ఎంలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసెంబ్లీ ముట్టడికి యత్నించగా పోలీసులు సుమారు 300 మంది పైగా ఏఎన్ఎంలను అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండో ఏఎన్ఎంల యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల మమత, ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్.విజయ కుమారి, సహాయ కార్యదర్శులు సరళ, రేణుక, అరుణ, ఉపాధ్యక్షులు పద్మ, సావిత్రి, కోశాధికారి వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీల కుల జనగణన డిమాండ్‌ను ప్రధాని దృష్టికి తీసుకెళ్తా



- కేంద్ర మంత్రి శ్రీ రాందాస్ అథావాలే
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-అడిక్‌మెట్

దేశంలో ఓబీసీ వర్గాల ఆకాంక్ష అయిన ఓబీసీ కుల జనగణన డిమాండ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి శ్రీ రాందాస్ అథావాలే హామీనిచ్చారు. ఏపీ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ, బీసీ సంక్షేమ సంఘ జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి శ్రీ రాందాస్ అథావాలే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి ఓబీసీ బీసీ వర్గాలు ప్రజలు కోరుకుంటున్నా పలు న్యాయ సమ్మతమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి స్టేట్ కన్వీనర్ లాల్ కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో 74 మంత్రిత్వ శాఖలు ఉన్నవి అలాగే ఎస్సీలకు, ఎస్టీలకు, మైనారిటీలకు, మహిళలకు కూడా ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉన్నాయి అని తెలిపారు. కానీ 56శాతం జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడంతో బీసీ కులాల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. 75 ఏండ్ల తర్వాత ప్రత్యేక బిసి మంత్రిత్వ శాఖ పెట్టకపోవడం అన్యాయం అన్నారు . రాజ్యాంగబద్ధమైన మండల కమిషన్ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయం అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.వెంకన్న గౌడ్, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు బెల్లం మాధవి, ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు పిల్ల నివాస్ కే యుగంధర్, ఎం.జ్యోతి, అడ్వకేట్ ముద్దాడ భవాని గణేష్, జేటి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది కాలంలో ఎన్నో సవాళ్లు



- డ్రగ్స్ మూలాలపై క్షేత్రస్థాయిలో ఆరా
- ముంబాయ్, గోవా, కర్నాటకా వివిధ రాష్ట్రాలో దాడులు
- మోస్ట్ వాంటెడ్ డాన్ల ఆటకట్టించిన హెచ్‌న్యూ
- దేశవ్యాప్తంగా అలజడి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌గా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా డ్రగ్స్‌ను క్షేత్రస్థాయిలో నివారించేందుకు నగర పోలీసులు అన్ని చర్యలు చేపట్టారు. సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవతో 'హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్-ఎన్ఇడబ్ల్యూ)ను రంగంలోకి దించారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (హెచ్‌న్యూ) చేస్తున్న కృషికి ఫలితాలొస్తున్నాయి. డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణిచివేసేందుకు చేపట్టిన గోవా ఆపరేషన్‌తో డ్రగ్ మాఫియాలో భయం పుట్టింది. గతంలో డ్రగ్స్ సప్లయ్ దారులు, కొనుగోలు దారులు మాత్రమే పోలీసులకు చిక్కేవారు. కానీ సీపీ సీవీ ఆనంద్ పనితీరుతో డ్రగ్స్ డాన్లతోపాటు సప్లయ్ దారులు, కొనుగోలు దారులు చిక్కుతున్నారు. వారిని కటకటాల్లోకి పంపిస్తున్నారు. సీపీ దిశానిర్దేశంతో పనిచేస్తున్న నార్కొటెక్ వింగ్ ఏడాది కాలంలో ఎన్నో సవాళ్లను అధిగమించింది. ముంబాయ్, గోవా, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్నాటకాతోపాటు తదితర రాష్ట్రాలో తలదాచుకున్న డ్రగ్స్ డాన్ల ఆటకట్టిస్తోంది. అయితే కరుడు కట్టిన డాన్లను పట్టుకునే సమయంలో ఎదురు దాడులను సైతం ఎదుర్కొంటున్నారు.

హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్

డీసీపీలు సునితా రెడ్డి, జీ.చక్రవర్తి నేతృత్వంలో ఈ వింగ్ పనిచేస్తోంది. ఇందులో పి.రమేష్ రెడ్డి, పి.రాజేష్ ఇద్దరు ఇన్‌స్పెక్టర్లతోపాటు ఎస్ఐలు జీ.ఎస్.డానియేల్, సీ.వెంకట్ రాములతోపాటు మరో 20 మంది ఉన్నారు. ఎన్నో సవాళ్లను అధిక మించిన ఈ బృందం సీపీ చేత ప్రశంసలు అందుకున్నారు. ప్రత్యేక రివార్డ్‌ను సొంతం చేసుకున్నారు.

మూలాలపై ప్రత్యేక నిఘా.. డాన్లకు వణుకు

డ్రగ్స్ నివారణపై దృష్టి సారించిన నార్కొటెక్ టీం దేశంలో డ్రగ్స్ మూలాలు ఎక్కడున్నా అక్కడికి వెళ్లి నేరగాళ్లను, కింగ్ పిన్లను పట్టుకుంటున్నారు. తప్పించుకుని తిరుగుతున్న వారిపై నిఘా పెట్టారు. ముఖ్యంగా డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్ విక్రయాలు సాగుతుండటంతో డార్క్‌నెట్‌పై కూడా నిఘా పెంచారు. ఈ క్రమంలో డార్క్‌నెట్‌లో, వెబ్‌సైట్లలో సైతం 'నో సేల్ ఫర్ తెలంగాణ పీపుల్'.. 'నో సేల్ ఫర్ హైదరాబాద్ పీపుల్' అంటూ కామెంట్లు పెడుతున్నారు. హెచ్‌న్యూ ఆపరేషన్‌తో నేరుగా డ్రగ్స్ విక్రయించే వారితో పాటు డార్క్‌నెట్ వేదికగా విక్రయాలు సాగించే వారిలో కూడా భయం మొదలైంది. దాంతో తెలంగాణ వ్యక్తులకు డ్రగ్స్ ఇవ్వాలంటేనే డాన్లకు సైతం వణుకు పుడుతోంది. ముఖ్యంగా గోవాలో డ్రగ్స్ కోసం ఎవరైనా ప్రయత్నిస్తే వారి స్వస్థలం ఎక్కడా అని ఆరా తీస్తున్నారు. హైదరా బాద్, తెలంగాణ అని చెబితే పక్కకు తప్పుకుంటున్నారు. గతంలో డార్క్‌నెట్‌లో డ్రగ్స్ ఆర్డర్ తీసుకుంటూ, ఆర్డర్ ఇచ్చిన వారు సైతం డ్రగ్స్ సప్లై చేయాలంటేనే భయ పడుతున్నారు. డ్రగ్స్ సరఫరా చైన్ లింక్‌ను తెంచాలనే లక్ష్యంతో విక్రేతలు ఎంత దూరమున్నా అక్కడికి వెళ్లి పట్టుకుంటున్నారు.

విదేశీయుల అరెస్టు

దేశంలోని వివిధ రాష్ట్రాలల్లో తలదాచుకున్నవారితో పాటు విదేశాల నుంచి డ్రగ్స్ సప్లయ్ చేస్తున్న మాఫియా దందాను నియంత్రిస్తున్నారు. ఏడాది కాలంలో 104 కేసులు నమోదు చేశారు. అందులో 13 మందిని విదేశీ స్మగ్లర్లు, 195 సప్లయ్‌దారులతోపాటు 1075 మంది వినియోగ దారులను అరెస్టు చేశారు. ముఖ్యంగా ఐవరీకోస్టు, నైజీరియా, సుడాన్ దేశాలకు చెందిన ఆరుగురిని అరెస్టు చేశారు.

షియోమీ, సౌరవ్ గంగూలీ ఫౌండేషన్, CRY భాగస్వామ్యముతో #BackToSchool కార్యక్రమం..

నవతెలంగాణ-హైదరాబాద్ : ఇండియాలో అగ్రగామి స్మార్ట్ ఫోన్ స్మార్ట్ టీవీ బ్రాండ్ అయిన షియోమీ సౌరవ్ గంగూలీ ఫౌండేషన్ CRY భాగస్వామ్యముతో తన #BackToSchool పౌరసత్వ చొరవ కార్యక్రమాన్ని ఈ రోజున ప్రకటించింది. హయ్యర్ సెకెండరీ తరగతుల్లో అణగారిన వర్గాలకు చెందిన 1600 మంది పిల్లలు బడిలో తమ చదువును కొనసాగించడానికి ప్రేరణ కలిగిస్తూ వారికి ధ్యాసతో కూడిన మద్దతును అందించడానికి ఈ చొరవ కార్యక్రమం లక్ష్యంగా చేసుకొంది. ఈ భాగస్వామ్యము ద్వారా కంపెనీ, చదువుకు సంబంధించిన మద్దతుతో, చేకూర్పుతో కూడిన అభ్యసన అవకాశాలను అందిస్తూ మరియు త్వరగా బడి మానేసే అవకాశాలను తగ్గిస్తూ ఈ పిల్లలను సాధికారపరచడానికి లక్ష్యంగా చేసుకొంది. ఈ చొరవ కార్యక్రమం క్రింద, షియోమీ ఇండియా, SGF, CRY, జమ్మూ & కాశ్మీర్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాఠశాలల్లో అందుకు తగిన కేంద్రాలను నెలకొల్పాయి. పిల్లలకు తమ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అంశాలైన తమ చదువు జీవన నైపుణ్యాలకు సంబంధించి 3 నెలల పాటు హితబోధ కార్యక్రమాలు నిర్వహించబడతాయి.

ఎన్ని నిర్బంధాలు విధించినా 'చలో అసెంబ్లీ' నిర్వహించి తీరుతాం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎన్ని నిర్బంధాలు విధించినా 'ఛలో అసెంబ్లీ' నిర్వహించి తీరుతామని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ నేతలు బి.వెంకటేశం, ఆర్.మల్లేష్ (ఏఐటీయూసీ), అమానుల్లా ఖాన్ (తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్), వి.కిరణ్ (ఐ.ఎఫ్.టి.యు), వి.మారయ్య (తెరాసకెవి), ఏ.సత్తిరెడ్డి (ఆటో యూనియన్స్) జి.మల్లేష్ (ఐ.ఎస్.టి.యు.సి), ఎంఏ.సలీం (తాడ్వా) హెచ్చరించారు. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరూ బడుగు బలహీన వర్గాలకు చెందినవారనీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడు తున్నారనీ, అనిశ్చిత ఆదాయాల కారణంగా ఆటో డ్రైవర్ల జీవన స్థితిగతులు సంతృప్తికరంగా లేవని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ నుండి ఇప్పటి వరకు ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించలేదనీ, అసలు కనీసం తమను మనుషులుగా పరిగణించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 9 ఏండ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు 100 శాతం పెరిగాయనీ, ప్రభుత్వం స్పందించి ఒక్కసారి కూడా ఆటో మీటర్ చార్జీలను పెంచలేదన్నారు. పెరిగిన ఇంధన, నిత్యావ సర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలనీ, ఆటో డ్రైవర్ల సామజిక భద్రత కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనీ, నిరుద్యోగ యువత ఉపాధి కోసం కొత్త ఆటో పర్మిట్లను జారీ చేయాలనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదిరిగా తెలంగాణలో ప్రతి ఆటో డ్రైవర్‌కూ రూ.10 వేలు, ప్రతి ఏడాదీ వాహన ఆటో ఇన్సూరెన్సు చార్జీలు తదితర ఖర్చుల కోసం ఆటో బంధు ప్రవేశపెట్టాలన్నారు. భారీగా పెరిగిన ఇన్సూరెన్సు ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం, సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ఉదయం 11 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ 'ఛలో అసెంబ్లీ' ప్రదర్శన ప్రారంభమౌతుందనీ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లు అందరు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాల న్నారు. 'ఛలో అసెంబ్లీకి వచ్చేవారిని పోలీసులు ఎక్కడ ఆపితే, అక్కడే నిరసన తెలుపాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ క్యాబ్ డ్రైవర్స్ యూని యన్ అధ్యక్షులు టి.రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ గౌడ్, ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ నగర నాయకులు ఆర్.మల్లేష్ కురుమ, ఒమర్ ఖాన్, కొమరెవెల్లి బాబు, ఎస్.కె.లతీఫ్ పాల్గొన్నారు.


ఓయూ విద్యార్థుల విద్యాభివృద్ధికి నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-ఓయూ

బడ్జెట్ ప్రతిపాదనలు సవరణ చేసి ఓయూ విద్యార్థుల విద్యాభివృద్ధికి నిధులు కేటాయించాలి అని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఓయూలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పీడీఎస్‌యూ దశల వారీగా పోరాటం ఫలితంగానే యూనివర్సిటీలకు తాజా నిధుల కేటాయింపు, అసెంబ్లీలో ఓయూ సమస్యలపై చర్చ జరిగిందన్నారు. పీడీఎస్‌యూ నేతలు ఎస్.నాగేశ్వర రావు, ఎన్.సుమంత్, కె.స్వాతి మాట్లాడుతూ ఓయూలో కొంతకాలంగా పీడీఎస్‌యూ దశల వారీగా నిర్వహించిన ఫలితంగానే విశ్వవిద్యాలయాల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఓయూ నాయకులు వెంకటేష్, రుక్మత్ పాషా, చిరంజీవి, క్రాంతి, భువన, శివ, ఫిరోజ్ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15వ డిప్యూటీ కమిషనర్‌గా యాదయ్య బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-అడిక్‌మెట్



ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15వ డిప్యూటీ కమిషనర్‌గా తిప్పర్తి యాదయ్య బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్‌లో స్పోర్ట్స్ విభాగంలో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీ పై ముషీరాబాద్ సర్కిల్ 15 డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

అమెజాన్.ఇన్ పై గెట్ ఫిట్ డేస్తో మీ ఫిట్నెస్ ప్రయాణం ఆరంభించండి

నవతెలంగాణ-హైదరాబాద్ : మీ ఫిట్ నెస్ పరిమాణాన్ని ఒక స్థాయి ఎక్కువ ఉంచండి, కార్డియోతో, కండరాలు రూపొందించడం, యోగా చేయడం లేదా ఏదైనా క్రీడ ఎంచుకోవడం వంటి ఫిట్ నెస్ కు మీదైన విధానం ద్వారా నాజూకుగా తయారై ఆరోగ్యవంతమైన జీవనశైలి దిశగా అడుగు వేయండి. గెట్ ఫిట్ డేస్ తో అమేజాన్ మళ్లీ వచ్చింది. ట్రెడ్ మిల్స్, సైకిల్స్, యోగా మ్యాట్స్, స్మార్ట్ వాచ్, స్పోర్ట్స్ షఉస్, స్పోర్ట్స్ అప్పారెల్, జిమ్ యాక్సరీస్ వంటి ఉత్పత్తులను ఒకే చోట ఉంచి కస్టమర్స్ కు సమగ్రమైన షాపింగ్ అనుభవం ఇస్తోంది. ఈ గొప్ప డీల్స్ ను 2023 ఫిబ్రవరి 10 నుండి 12 వరకు పొందండని ఆ సంస్థ తెలిపింది. పవర్ మ్యాక్స్, ప్యూమా, అర్బన్ టెర్రెన్, నివియా, ఆడిడాస్, రీబక్, లైఫ్ లాంగ్, ఫ్లెక్స్ నెస్ట్, యోనెక్స్, గార్మిన్, ఇంకా ఎన్నో ప్రముఖ బ్రాండ్స్ నుండి అమెజాన్. ఇన్ పై గెట్ ఫిట్ డేస్ సమయోం 70శాతం వరకు ఉత్తేజభరితమైన డిస్కౌంట్స్ ను కస్టమర్స్ పొందవచ్చని తెలిపింది. ఇంకా, ఫిట్ నెస్ అండ్ క్రీడల ఎంపిక పై రూ.1500 కనీస ఆర్డర్ కొనుగోలుపై రూ.300 వరకు అదనపు 10శాతం తగ్గింపు పొందవచ్చని. పాల్గొంటున్న విక్రేతలు నుండి ఆఫర్స్ అండ్ డీల్స్ తో ఫిట్ నెస్ ఉత్సాహవంతులు కోసం అమెజాన్.ఇన్ ప్రత్యేకంగా రూపొందించిన వాటి నుండి కస్టమర్స్ కొన్ని ఉత్పత్తులను ఎంచుకోవచ్చని ఆసంస్థ పేర్కొంది.

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-అంబర్‌పేట

హైదరాబాద్ వేదికగా జరగనున్న ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభల పోస్టర్‌ను హైదర్‌గూడ, న్యూస్ సర్వీస్ సిండికేట్ లో గురువారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి పి.వి. సుందరరామరాజు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి. ప్రసాద్, ఉపాధ్యక్షులు అంబటి జోజి రెడ్డి, కార్యదర్శులు కె.తేజ్ డీప్ రెడ్డి, జి.వంశీధర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి రాములు యాదవ్, అధ్యక్షులు సయ్యిద్ తౌఫిక్ అలీ, ఉపాధ్యక్షులు కె. వెంకటేష్ యాదవ్, నగర నాయకులు ఆవుల శ్రీకాంత్ యాదవ్, అరుణ్ కుమార్ మైలవరపు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో ఈ నెల ఈ నెల 23 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. విదేశీ ప్రతినిధులు, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ నాయకత్వంతోపాటు దేశంలోని మొత్తం 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సుమారు 1000 మంది ప్రతినిధులు హాజరు అవుతారని తెలిపారు. ఈ మహాసభలలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై చర్చించి భవిష్యత్ రాజకీయ సామాజిక, ఆర్థిక భడా పెట్టుబడిదారి గుత్తధిపత్య నిర్ణయాలను, మతోన్మాద విధానాలను ఎండగట్టి పబ్లిక్ సెక్టర్ల విధ్వంసంపై వాటిని సామాన్యులకు చేరావేసి దేశ భవిష్యత్ వామపక్షాలతోనేనని చాటిచెప్పేందుకు ఈ సభలు అంకురార్పణ చేయబోతున్నాయని స్పష్టం చేశారు. ముందుచూపు లేని పాలకుల మసకథోరణి దేశవిలువలను దిగజార్చే శంకుచిత స్వాభావాల పై లౌకిక శక్తుల ఐక్యతనే దేశ భవిష్యత్ అనే ఈ దేశ మూల సూత్రాలను వామపక్షాలు కాపాడగలరనే వాస్తవాన్ని ఈ మహాసభ నాంది కాబోతున్నదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న దోపిడీ పాలనకు వ్యతరేకంగా పేదలు, కర్షకుల కార్మికుల రైతుల కష్టజీవుల సమస్యల పరిష్కరానికి భవిషత్‌లో నిర్వహించే పోరాటాలపై ఈ మహాసభలలో నిర్ణయాలు తీసుకుంటారనీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా దేశంలో ప్రతి గ్రామ, నగరాల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్‌ను ముందుకు తీసుకవెళ్తామని ప్రకటించారు.

పరిశోధన ప్రతిపాదనల రచనలపై ఓరియంటేషన్



నవతెలంగాణ-ఓయూ

హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో "పరిశోధన ప్రతిపాదన (సారాంశం) రచన"పై నాలుగు ఉచిత ఓరియంటేషన్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంశం ఎంపిక, సమస్య పరిచయం/ప్రకటన, సాహిత్య సమీక్ష, లక్ష్యాలను రూపొందించడం, పరిమాణాత్మక/గుణాత్మక విధానాలు, డేటా విశ్లేషణ ప్రణాళిక/గణాంక పరీక్షపై సెషన్స్ నిర్వహించారు. ఈ బృందంలో జంట నగరాల్లోని కళాశాలల నుంచి వివిధ ఫ్యాకల్టీలకు చెందిన రీసెర్చ్ స్కాలర్లు, ఫ్యాకల్టీ సభ్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఉన్నారు. హాజరుకాని వారి ప్రయోజనం కోసం కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమానికి రీసోర్స్ పర్సన్లుగా జర్నలిజం నుంచి ప్రొ. కె. స్టీవెన్సన్, కామర్స్ నుంచి ప్రొ. ఎ. ప్యాట్రిక్, కెమిస్ట్రీ నుంచి డాక్టర్ పి.మురళీధర్ రెడ్డి, ప్రొ.సీహెచ్. జువాలజీ నుంఱఉచి శ్రీనివాసులు, లైబ్రరీ సైన్సెస్ నుంచి ప్రొ.ఆదిత్య, డాక్టర్ పి.రమేష్, డాక్టర్ చక్రవర్తి పలు అంశాలపై వివరించారు. విద్యార్థులు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. పరిశోధన చేసే విద్యార్థులకు ముందుకు ఎంచుకన్న అంశం దాని ప్రతిపాదనలు ఎంతో ముఖ్యం అన్నారు. ఎంచుకున్న అంశంపై రచన ఎలా చేయాలో విద్యార్థులు వివరించారు. నాలుగు రోజుల ఒరియంటేషన్ భవిష్యత్తులో చేయబోయే పీహెచ్డీకు ఎంతో దోహదపడుతుందని విద్యార్థులు చెప్పారు.

ఎడల్వైస్ జెనరల్ ఇన్సూరెన్స్ ఇప్పుడు జునో జెనరల్ ఇన్సురెన్స్

నవతెలంగాణ-హైదరాబాద్ : ఎడల్వైస్ జెనరల్ ఇన్సురెన్స్ దాని కొత్త గుర్తింపు జునో జెనరల్ ఇన్సురెన్స్ లిమిటెడ్ ప్రకటించింది. బీమాని సులువుగా, స్నేహపూర్వకంగా, పారదర్శకంగా చేసేట్లుగా ఒక ఆకాంక్షతో మళ్ళీ ఊహించేందుకు, మళ్ళీ నిర్వచించేందుకు జునో జీఐ ఒక కొత్త తరం డిజిటల్ ఇన్సురర్. ఈ సందర్భంగా జునో జెనరల్ ఇన్సురెన్స్ షనై గోష్ మాట్లాడుతూ... జునో జీఐ వినియోగదారుల అనుభవాన్ని, ఇన్నోవేషన్, డిజిటల్ డెలివరి ఫ్లాట్ఫార్మ్స్ అనే మూడు మూల స్థంభాలను వాడుతూ బీమాని సులువుగా, పారదర్శకంగా, స్నేహపూర్వకంగా చేయడానికి దాన్ని మళ్ళీ ఊహించుకోవడం గురించే అంతా అన్నారు. తాము ఎల్లప్పుడూ తమ వినియోగదారులు చెప్పేది వింటామన్నారు. చాలా సౌకర్యవంతమైన, చికాకులు-లేని దారులలో తెలివైన, సులువైన పరిష్కారాలను అందిస్తామన్నారు. తాము ఈ లక్ష్యాన్ని నివేదిక ద్వారా చర్య రూపంలోకి దించామన్నారు. ఇక్కడ తాము యూబీఐని గురించి యువ, మొబైల్ సావీ భారతీయ వినియోగదారుల్లో యూబీఐ అర్థం చేసుకోవడాన్ని, ఆలోచనని ప్రాప్తి చేసుకోడానికి చూశామన్నారు. భారతదేశంలో సంభావ్యతను గురించి తమ ఊహని ఈ పరిశోధనలు తీవ్రమైన అంతర్ దృష్టిని ఇచ్చిందన్నారు.

చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి అని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఎంపీ నేతృత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా జరిగిన పార్లమెంట్ ముట్టడి సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ దేశంలో 70 కోట్లకుపైగా అత్యధిక జనాభా 65శాతం గల బీసీలు ఇప్పటికీ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజిక, అన్ని రంగాల్లో వెనుకకు నెట్టివేయబడ్డారన్నారు. చట్టసభలలో బీసీ రిజర్వేషన్ లేకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య నాయకత్వం లో బీసీ బిల్లు పెట్టేవరకు పోరాడతామనీ, బీసీలు అంతా ఏకమై రాజ్యాధికారం సాధించే దిశగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.42 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కేవలం రెండువేల కోట్లు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే బీసీలకు బడ్జెట్ లో రెండు లక్షల కోట్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, భూపేష్ సాగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్ల అది మల్లేశం పటేల్, బీసీ యువజన సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూపా శ్యామ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అనిల్, బీసీ యువజన సంఘం నగర అధ్యక్షులు నితిన్, దిలీప్, మండల ప్రధాన కార్యదర్శి మహేష్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్లో 99శాతంకుపైగా ఉత్తీర్ణత సాధించిన 23 మంది ఆకాష్ బైజూస్ విద్యార్థులు

నవతెలంగాణ-హైదరాబాద్ : హైదరాబాద్లోని ఆకాష్ బైజూసకు చెందిన 23మంది ప్రతిభావంతులైన విద్యార్థులు పర్సం టైల్ కు పైగా మార్కులను జేఈఈ మెయిన్స్ 2023 పరీక్షల మొదటి సెషన్లో సాధించారు. ఈ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ సంస్థ వెల్లడించింది. ఈ సంవత్సరం ఇంజినీరింగ్ కోసం నిర్వహించనున్న రెండు ఉమ్మడి ప్రవేశ పరీక్షలలో ఇది మొదటిది. టాప్ స్కోరర్లలో



గుంజి మణిదీప్ రామ్ 99.96 పర్సంటైల్, బీ సిద్దార్థ్ 99.94, అల్లాడి లోహిత్ కుమార్ 99.90, పూర్వీ సదగోపన్ 99.86, సిద్ధార్థ్ ఎస్ 99.66, వాసా హరిష్ 99.65 పర్సంటైల్ సాధించిన వారిలో ఉన్నారు. ప్రపంచంలో అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షగా భావిస్తోన్న ఐఐటీ జేఈఈలో విజయం సాధించేందుకు వీరు ఆకాష్ బైజూస్ ఇనిస్టిట్యూట్ క్లాస్రూమ్ ప్రోగ్రామ్ కోసం చేరారు. కాన్సెప్ట్ ను అర్థం చేసుకోవడంలో తాము పడిన కష్టం, లెర్నింగ్ షెడ్యూల్స్కు కట్టుబడి ఉండటమే టాప్ పర్సంటైల్ సాధించిన ఎలైట్ జాబితాలో చోటు సంపాదించుకోవడానికి కారణంగా అభివర్ణించారు. ఆకాష్ ఇనిస్టిట్యూట్కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులను అభినందించిన ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా మాట్లాడుతూ... అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ అభినందిస్తున్నానన్నారు. జెఈఈ మెయిన్ 2023 కోసం దేశవ్యాప్తంగా 8.6 లక్షల మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారన్నారు. స్టేట్ టాపర్, పర్సంటైల్ టాపర్స్ వారు సాధించిన విజయం. వారు పడిన కష్టం గురించి ఎంతో వెల్లడిస్తుందన్నారు. భవిష్యత్లో మరిన్ని విజయాలను వారు సాధించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

బీసీల సంక్షేమానికి రూ.2లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-అడిక్‌మెట్



కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జు కృష్ణ, భూపేష్ సాగర్, వేముల రామకృష్ణ, నందా గోపాల్, ఎస్.మరేష్, బాషయ్య, రాకేశ్ కుమార్ తదితరులు హాజయ్యారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజవేషన్లు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభ గణనలో బీసీలకు గణన చేపట్టాలన్నాఉ. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతం కు పెంచాలన్నారు. ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి అని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలనీ, బీసీల అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను రూపొందించాలన్నారు. ప్రత్యకంగా కేంద్ర స్థాయిలో స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపాధి రంగంలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి అని కోరారు. బీజేపీ ప్రభుత్వం కులాల వారిని లెక్కలు తీయడానికి సుముఖంగా ఉందనీ, సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. ప్రధానమంత్రితో నరేంద్ర మోడీ, ఇతర కేంద్ర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు అని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ధరణి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుభాష్ (34) రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. అలాగే డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 1లో నివసిస్తున్న పుట్నాల ఇందిర (55) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. సమాచారం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కుమారుడు దొడ్ల రామకృష్ణగౌడ్ బాధిత కుతుంబాల సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి రూపాయలు 5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరిగింది.

పరికి చెరువులో దోమలమందు పిచికారీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువులో ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌ల ఆదేశాల మేరకు, దోమల నివారణ కోసం డ్రోన్ యంత్రం సాయంతో దోమల మందు పిచికారి చేశారు. అనంతరం ఎంటమాలజి సిబ్బంది మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ఇంటితోపాటు ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరిచేరవని అన్నారు. కాబట్టి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని తెలుపుతూ చుట్టుపక్కల ప్రాంతంలో నాలాల్లో, చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను, ప్లాస్టిక్ కవర్లను వేయొద్దని సూచించారు. చెత్తను ఇంటివద్దకు వచ్చే చెత్త ఆటోల్లోనే తడి చెత్త, పొడి చెత్త వేరు వేరు చేసి వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలాజీ సూపర్‌వైజర్ డి.నరసింహులు మరియు ఎంటమాలాజీ సిబ్బంది, కేటీఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం - ప్రజలకు శాపం

- చిత్తశుద్ధి లేదు... చెత్త సమస్య తీరదు
- రోడ్లపైనే చెత్తాచెదారం.. లోపిస్తున్న పారిశుధ్యం
- చెత్త కుప్పలపై పందులు, పశు సంచారం
- డివిజన్‌లో అపరిశుభ్రత వాతావరణం పొంచివున్న వ్యాధులు





నవతెలంగాణ - బాలానగర్

కూకట్‌పల్లి మూసాపేట జంట సర్కిళ్లలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచి సుందర నగరంగా తీర్చిదిద్దాలన్న తలంపుతో ఎన్ని ప్రణాళికలు రూపొందించినా, మరెన్ని పథకాలు రచించినా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా పారిశుధ్య సమస్య ప్రజారోగ్యంపై ప్రభావం చూపిస్తోందనడంలో ఏ మాత్రం సందేహంలేదు. జంట సర్కిళ్లలో అధికారులు, సిబ్బందికి చిత్తశుద్ధి లేకపోవడం వల్ల చెత్త సమస్య పెనుముప్పుగా మారింది. ప్రధానంగా ఫతేనగర్ డివిజన్లలోని గౌతంనగర్, శివశంకర్ కాలనీ, పార్థివాడ, ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ముందు ప్రధాన కూడళ్లలో, రహదారులపై చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో జీహెచ్‌ఎంసి తడి - పొడి చెత్త సేకరణకు ఇంటింటికీ డబ్బాలు పంపిణీ చేసి, గార్బేజ్ రిక్షాలను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ ప్రజల్లో అవగాహన, చైతన్యం కలగకపోవడంతో సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా తయారయింది.

దోమలకు ఆవాసాలుగా కాలనీల కూడళ్లు :

నగరంలో భారీ వర్షాలు, వరదలకు తేరుకోని నగర ప్రజలకు చెత్త, మురుగు సమస్య ముప్పుగా మారింది. ఆయా ప్రాంతాలలో నాలాలు పొంగిపొర్లి బస్తీలను ముంచెత్తుతున్నాయి. దీంతో దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముంపు ప్రాంతాలలో బాధితులకు ఆర్థిక సాయం అందించడంలో సర్కిల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమగ్నమయ్యారు. దీంతో పారిశుధ్య నిర్వహణ పనులపై చర్యలు తీసుకోవాల్సిన వారు ఏమాత్రం పట్టించుకోక పోవడం వల్ల సమస్య జఠిలంగా మారింది. దోమల నిర్మూలనకు చేపట్టాల్సిన ఫాగింగ్ నిర్వహణ లేకపోవడం దోమలు వ్యాప్తికి కారణమయ్యింది. డివిజన్ల పరిధిలోని నాళాల్లో పూడికతీత పనుల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

> రోడ్ల పక్కన చెత్త కనిపించొద్దు. చెత్త డబ్బాలు ఎక్కడున్నా తీసేయండి, నగరంలో మొత్తం క్లీన్ అండ్ గ్రీన్ కావాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు హడావుడిగా సిబ్బందిని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సిబ్బంది ఎక్కడికక్కడ చెత్త డబ్బాలను తొలగించారు. కానీ, ఇంటింటి చెత్త సేకరణ లేకపోవడంతో మళ్లీ అదే స్థలంలో ప్రజలు చెత్త వేస్తున్నారు. గతంలో నగరంలో తడి, పొడి చెత్త వేరు చేసేందుకు 22 లక్షల ఇండ్లకు 44 లక్షల చెత్త బుట్టలను జీహెచ్‌ఎంసీ పంపిణీ చేసింది. 3,150 స్వచ్ఛ ఆటోలు, 1,850 డస్ట్ బిన్లను ఏర్పాటు చేశారు. ఇటీవల గత కొంత కాలం క్రితం డస్ట్ బిన్లను ఆకస్మాత్తుగా తొలగించారు. దీంతో జనం మళ్లీ అక్కడే చెత్త వేస్తుండడంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి.
>
> ఇంటింటి చెత్తను సేకరించడం 90 శాతం అమలవుతున్నట్లు జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నా వాస్తవానికి ఇది 30శాతానికి మించడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం రెండు వేల ఆటోలు మాత్రమే సిటీలో చెత్త సేకరిస్తుండగా వారు ప్రతి ఇంటికీ రూ.100, ఆపై డబ్బులు డిమాండ్ చేస్తుండడంతో చాలా మంది చెత్త రోడ్లపైనే వేస్తున్నారు.

పూడిక తీసి రెండు, మూడు నెలలు గడవకముందే మళ్లీ పూడిక చేరుతుందని అంటున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల సంతతి వృద్ధి చెందుతోందని, నాలాల్లో తీసిన పూడిక మట్టిని అక్కడే వేయడంతో అది మళ్లీ నాలాల్లోకి చేరుతుందని తెలిపారు.

ఫతేనగర్ డివిజన్‌లో కానరాని స్వచ్ఛత

రాష్ట్ర ప్రభుత్వం చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ సర్వేక్షణ్ స్వచ్ఛ హైదరాబాద్ అంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కలిగిస్తూ చైతన్య పరుస్తూ వినూత్న పద్ధతుల్లో ప్రయత్నాలు జరుగుతున్నా ప్రజల్లో ఏమాత్రం మార్పు రావడంలేదు. స్వచ్ఛ ఆటోలు ఇంటరిటికీ వెళుతున్నా బస్తీవాసులు విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ అంతర్గత రహదారులపై వేసుకున్నా సిబ్బంది సకాలంలో తరలించడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పేరుకుపోయిన చెత్తకుప్పలను తరలించలేకపోవడంతో పందులు, పశువులు సంచారంతో పాటు దోమల వ్యాప్తి అధికమవడంతో స్థానిక బస్తీ వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

తూతూ మంత్రంగా సిబ్బంది ఫాగింగ్ నిర్వహణ

దోమల నివారణకు బస్తీలు, కాలనీలలో ఫాగింగ్ నిర్వహించడంలో జీహెచ్‌ఎంసి ఎంటమాలజీ విభాగం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తూతూ మంత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ప్రభుత్వం రసాయనాలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తుంటే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్పందించి ఫాగింగ్ నిర్వహణ సక్రమంగా జరిగేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాట్ ఒలంపియాడ్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల విజయ కేతనం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నాలెడ్జ్ అసెస్మెంట్ ఒలంపియాడ్ లెవెల్ 2 పరీక్ష (క్యాట్)ఫలితాలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ బ్రాంచ్ శ్రీ చైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారని పాఠశాల ఏజీఎం శివరామకృష్ణ తెలిపారు. మొత్తం 69 మంది విద్యార్థులు పరీక్షలకు ఎంపికయ్యారని, వీరిలో ప్రతిభగనపరిచిన విద్యార్థులకు 43 మెడల్స్‌తో పాటు 7వేల నగదు పారితోషికం అందుకున్నారు. 69 విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్‌లు సాధించారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో అధ్యాపక బృందంతో కలిసి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో తమ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం పాఠశాల క్యాంపస్‌లో విద్యార్థులను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. పద్మజ. ప్రిన్సిపాల్. బోయపాటి భార్గవి. జోనల్ కోఆర్డినేటర్. మురళీకృష్ణ. డీన్ ప్రసాద్. వైస్ ప్రిన్సిపల్ సుమ సి బ్యాచ్ ఇంచార్జ్ రమేష్. ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులే దేశానికి వెన్నుముక

రైతులే దేశానికి వెన్నుముక అని శ్రీ చైతన్య పాఠశాల చింతల్ బ్రాంచ్ ఏజీఎం శివరామకృష్ణ అన్నారు. గురువారం పాఠశాల క్యాంపస్‌లో 'సస్యభారత్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు. వ్యవసాయం, రైతుల జీవన విధానం, పంట పొలాల్లో పండుతున్న ధాన్యాల గూర్చి విద్యార్థులకు వివరిస్తూ రైతు చేస్తున్నటువంటి పని విధానాన్ని నాటిక ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయనతో పాటు అధ్యాపక బృందం కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మచిలీపట్నంకు చెందిన రైతు వీర రాఘవయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు.

తెలంగాణ రాష్ట్ర పౌసరఫరాల శాఖ మాజీ చైర్మెన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా, వారిని గురువారం మర్యాదపూర్వకంగా స్వగృహంలో కలిసి, శ్రీనివాసరెడ్డిని శాలువాతో సత్కరించి, రాష్ట్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

-నవతెలంగాణ,దుండిగల్



100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీసి, టీఐ, ఎఎంసీలు వారికి కేటాయించిన టార్గెట్ ప్రకారం 100 శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత అధికారులకు సూచించారు. గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్ళపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిల్ కలెక్టర్లకు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు రోజువారి, నెల వారి టార్గెట్ విధించి వసూళ్ళు అయ్యేలా చూడాలని సర్కిల్ ఉపకమిషనర్లకు ఆదేశించారు. సర్కిల్ ఉపకమిషనర్లు వారంలో రెండు సార్లు, ఉదయం, సాయంత్రం సమయాలలో బీసీ, టీఐల ఆస్తి పన్ను వసూళ్ళు వారి టార్గెట్లపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. సర్కిల్లోని ఆస్తి పన్ను పాత బకాయిల ప్రకారం వారికీ టార్గెట్స్ విధించి ప్రతి రోజు పాత బకాయిల వసూళ్ళపై సమీక్ష నిర్వహించి, సర్కిల్ సహాయ మున్సిపల్ కమిషనర్లకు తగు సూచనలు జారీ చేయాలని సూచించారు. ఆస్తి పన్ను విభాగం అధికారులు ప్రతి రోజు ఉదయం 8 గంటల వరకు క్షేత్ర స్థాయిలో ఉండి వారి సర్కిల్ వాట్సాప్‌లో పోస్టు చేయాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పూర్ కలెక్షన్ ఉన్న ప్రాంతాలలోని పాత బకాయిలపై శ్రద్ధ వహించి వసూళ్ళు అయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఉప కమిషనర్లు వారి వారి సర్కిళ్ళలోని పాత బకాయిల ప్రకారం ఎఎంసీలందరూ ఆస్తి పన్ను వసూళ్ళు రోజు వారి టార్గెట్ విధించి వివరాలు జోనల్ కమిషనరుకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్లు కె.రవికుమార్, పి.రవీందర్ కుమార్, మంగతాయారు, నాగమణి, సహాయ మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, అన్ని సర్కిళ్ల సహాయ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

శానిటేషన్‌పై ఫిర్యాదులు లేకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ - కూకట్‌పల్లి

గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో, బోయిన్‌పల్లికి సంబంధించిన జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా బోయిన్‌పల్లిలోని శానిటేషన్ సిబ్బంది సరిగా స్పందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడా కూడా శానిటేషన్ విషయంలో ఫిర్యాదు రాకుండా తగిన చర్యలు చేపట్టాలని, 10 రోజులు గడువు ఇస్తున్నామని, లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటికి వచ్చిన చెత్త వాహనంలోనే చెత్త అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీలు రవీంద్రకుమార్, రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలి

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వినతి



నవతెలంగాణ - బాలానగర్

కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులోని ఉమామహేశ్వర కాలనీలో సర్వేనెంబర్ 109, 111, 112 లో ఎఫ్టీఎల్ బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇల్లు నిర్మించుకున్న ఇళ్లను తక్షణమే తొలగించాలని, అదేవిధంగా ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం కూడా చేస్తున్న వాటిని ఆపివేసి ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుని యాజమాన్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం కాంగ్రెస్ పార్టీ కొంపల్లి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇలాంటి సంఘటనలపై కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేస్తుందని, హైకోర్టు తీర్పును ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలు చేస్తున్న అక్రమ కట్టడాలు చేస్తున్న వారికి అధికార పార్టీ నాయకుల అండదండలతోనే ఇలాంటి నిర్మాణం చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ కట్టడాలు చేసిన వాటిని తక్షణమే తొలగించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జోష్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బైరి ప్రశాంత్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఆదిరెడ్డి సురేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నవీన్, కావాలి గోపాల్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

మెగా రక్తదాన కార్యక్రమంపై ఉద్యోగుల్లో అవగాహన



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సేవారత్న డాక్టర్ ఎస్.ఎమ్.హుస్సేని (ముజీబ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా రక్తదాన కార్యక్రమంపై ఉద్యోగుల్లో అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం డీఈవో హైదరాబాద్ యూనిట్, ఎక్సైజ్ యూనిట్, ఐజీ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను సందర్శించి.. అందరూ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు. అలాగే అసద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్ తరఫున ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో సుమారు 500 మందికి శాకాహార భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యులు కె.ఆర్.రాజకుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, శ్రీధర్, మహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ముస్తఫా షరీఫ్, మొహమ్మద్ వహీద్, మిత్రులు శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

శేరిలింగంపల్లి బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని శేరిలింగంపల్లి బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్‌లో భాగ్యనగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన గురువారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతోపాటు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ తీగలు ఇండ్లపై నుంచే ప్రమాదకరంగా వేలాడుతున్నాయన్నారు. డివిజన్‌లో ప్రభుత్వ భూములు ఎన్నో కబ్జాకి గురయ్యాయన్నారు. పారిశుధ్య సమస్య కారణంగా దోమలు పెరిగి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకి గురవుతున్నారన్నారు. తెలంగాణ వచ్చి ఇన్ని ఏళ్లు అవుతున్నా రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, తాగు నీటి, విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. 'మీ సమస్య మా పోరాటం' ద్వారా త్వరలోనే వాటిని పరిష్కరించి ఒక కొలిక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, వెలగా శ్రీనివాస్, విజీత్‌వర్మ, నవీన్‌గౌడ్, కృష్ణంరాజు, శేషయ్య, బి.కోటేశ్వర రావు, లక్ష్మీ అన్నపూర్ణ, బాషా, కరుణాకర్, లక్ష్మీనారాయణ, బాలాజీ, బ్రమయ్య, విజయ్, బాలకృష్ణ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



మంత్రి కేటీఆర్‌తో 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్ర బృందం

మంచి సందేశాత్మక చిత్రం

ఏబి సినిమాస్, నిహాల్ ప్రొడక్షన్స్ పతాకంపై అంజి వల్గుమాన్, రాజవ్వ, సుధాకర్ రెడ్డి, డా॥కీర్తి లత గౌడ్, అభిరామ్, రూప శ్రీనివాస్, సాయి ప్రసన్న నటీనటులుగా రమేష్ చెప్పాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డాక్టర్ బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సిబిఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, నాయకులు అద్దంకి దయాకర్ ఈ చిత్రంలో నటించటం విశేషం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్ర టీజర్‌ను గురువారం మంత్రి కేటీఆర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్ర టీజర్‌ను చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను. మంచి మెసేజ్ ఉన్న సినిమా అని అర్థం అవుతోంది. పూర్తి సినిమాను తప్పకుండా చూస్తాను' అని తెలిపారు.

'ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దర్శకుడు రమేష్ చెప్పాల మంచి విషయాన్ని కామెడీ వేలో చెప్పడంతో జనాలకి ఈ సినిమా ఈజీగా రీచ్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం. సినిమాని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత డా॥ బత్తిని కీర్తి లత గౌడ్ అన్నారు.

సినిమాగా ఇదీ దాసరి చరిత్ర



నట్టికుమార్

దాసరి లాంటి పెద్దలు చేసిన మంచి పనులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాల్సిన కొంతమంది నేటి సినీ పెద్దలు అలాంటి వాటికి తిలోదకాలు ఇచ్చే స్థితికి చేరుకోవడం దారుణమని నిర్మాత నట్టి కుమార్ విమర్శించారు.

గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, '7 లక్షల మెడిక్లెయిమ్ పాలసీని కౌన్సిల్‌లోని ప్రతీ సభ్యుడికీ అందజేయాలి. నిధులు తక్కువగా ఉంటే కనీసం 5 లక్షల పాలసీ అయినా అందరికీ వర్తింపచేయాలి. సినీ పరిశ్రమ నిలబడటానికి దాసరి లాంటి పెద్దలు కారణం. అందుకే ఆయన సినీ జీవిత ప్రయాణాన్ని పలు అంశాలతో నేటి తరానికి అందించాలన్న సంకల్పంతో 'ఇదీ దాసరి చరిత్ర' పేరుతో ఓ సినిమాను తీయాలని నిర్ణయించుకున్నాను. అయితే ఇది బయోగ్రఫీ కాదు. మే 4న దాసరి బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రారంభిస్తాం. ఏపీ ఫిలిం డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ ఇంతవరకు సినీ పరిశ్రమ వారితో ఎలాంటి మీటింగ్ పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. అలాగే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చిన్న నిర్మాతల కంటే పెద్దవాళ్లతోనే సత్ సంబంధాలు కలిగి ఉంటున్నారు. ఆయన కూడా అందరినీ కలుపుకుపోవాల్సిన అవసరం ఉంది. రాబోయే నిర్మాతల మండలి ఎన్నికల్లో స్వార్థపూరితంగా వ్యవహరించే వ్యక్తులకు ఓట్లు వేయవద్దని కోరుతున్నాను. ఇకనైనా మంచి మార్పు కోసం అందరూ ముందుకు రావాలి' అని తెలిపారు.

అందర్నీ మెప్పించే అమిగోస్



అషిక రంగనాథ్, కళ్యాణ్‌రామ్

కళ్యాణ్‌రామ్ త్రిపాత్రాభినయంలో నటించిన చిత్రం 'అమిగోస్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలో గురువారం చిత్ర బృందం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హీరో కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ, 'సినిమా అవుట్‌పుట్ పై అందరం చాలా నమ్మకంతో ఉన్నాం. ఓ మంచి కాన్సెప్ట్‌తోపాటు ఈ సినిమాలో నేను మూడు పాత్రల్లో నటించటం చాలా సంతోషంగా ఉంది. మూడు పాత్రలను చేసే విషయంలో అన్ని రకాల సవాళ్ళను ఎదుర్కొన్నాను. నూతన దర్శకుడు రాజేంద్రరెడ్డి ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. అలాగే మా నిర్మాతలు సినిమా నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. నేడు మీ ముందుకు రాబోతున్న ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం' అని తెలిపారు.

'ఇలాంటి మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా కోసం కళ్యాణ్‌రామ్ ఎంతో కష్టపడ్డారు. ఆయనతో నటించటం చాలా గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా ఫలితం కోసం అందరం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నాం' అని నాయిక అషిక రంగనాథ్ అన్నారు.

నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ మాట్లాడుతూ, 'బింబిసార' వంటి ఘన విజయం సాధించిన తర్వాత కళ్యాణ్‌రామ్ నటించిన సినిమా కావడంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఆ అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుందని కచ్చితంగా చెప్పగలం. కళ్యాణ్‌రామ్ కెరీర్‌లోనే కాకుండా మా బ్యానర్‌లోనూ మరో మంచి సినిమా అవుతుంది' అని చెప్పారు.

పేద విద్యార్థుల చదువు కోసం పోరాటం



సంయుక్త మీనన్, ధనుష్, వెంకీ అట్లూరి, సూర్యదేవర నాగవంశీ

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్' (తెలుగు)/ 'వాతి'(తమిళం).

శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు.

ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈనెల 17న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఏఎంబీ సినిమాస్‌లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా కథానాయకుడు ధనుష్ మాట్లాడుతూ, 'ఇది నాకు చాలా ప్రత్యేకమైన రోజు. ఇది నా మొదటి తెలుగు సినిమా. చాలా సంతోషంగా ఉంది. ఒకప్పుడు తెలుగు సినిమా, తమిళ సినిమా, కన్నడ సినిమా, హిందీ సినిమా అనేవాళ్ళు. కానీ ఇప్పుడు ఇండియన్ సినిమా అనడం సంతోషించదగ్గ విషయం. ఈ కథ చాలా బాగుంటుంది. పేద విద్యార్థుల చదువు కోసం ఓ మాస్టారు చేసే పోరాటమే ఈ సినిమా. నాకు ఇంతమంచి సినిమా ఇచ్చినందుకు వెంకీ అట్లూరికి ధన్యవాదాలు. అలాగే చినబాబు, నాగవంశీకి, త్రివిక్రమ్‌కి, సంయుక్త మీనన్, హైపర్ ఆది, మా టీమ్ అందరికీ ధన్యవాదాలు' అని అన్నారు.

'లాక్‌డౌన్ సమయంలో ఈ కథ రాసుకుని, వంశీకి నెరేట్ చేస్తే, ఆయనకు నచ్చింది. లాక్ డౌన్ కావడంతో అప్పుడు హీరోలు పెద్దగా కథలు వినే ధైర్యం చేయలేదు. కానీ ధనుష్ మాత్రం కథ చెప్పడానికి రమ్మన్నారు. ఈ సినిమా ఆయన చేసినా, చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి నాకు చాలు అనుకున్నాను. కానీ ఆయన కథ వినగానే ఈ సినిమా చేస్తున్నాను అనడంతో నాకు ఆ ఆనందంలో మాటలు రాలేదు. నాకు ఈ అవకాశమిచ్చిన వంశీకి, ధనుష్‌కి జీవితాంతం రుణపడి ఉంటాను. ఓ మంచి సినిమా చేశామనే సంతృప్తి ఉంది' అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

నాయిక సంయుక్త మీనన్ మాట్లాడుతూ,'ఇందులో ఓ మంచి పాత్ర పోషించినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా అందరినీ అలరిస్తుంది' అని అన్నారు. ఈ వేడుకలో ఈ చిత్రంలో నటించిన స్టూడెంట్స్, టీమ్‌తో కలిసి 'మాస్టారు.... మాస్టారు' గీతాన్ని హీరో ధనుష్ ఆలపించడం విశేషం.



జైలుకైనా పోతాం.... జాగాలను వదలం

(మొదటిపేజీ తరువాయి)

పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న దన్నారు. 23 జిల్లాల్లో, 47 పోరాట కేంద్రాల్లో, నిలువ నీడలేని పేదలు ప్రభుత్వ భూముల్లో 28వేల మంది దాకా గుడిసెలేసుకున్నారనీ, సెంటు భూమి కూడా లేనివారు 78 పోరాట కేంద్రాల్లో, 11వేల ఎకరాల ప్రభుత్వ భూమిలో సాగుచేసుకుంటున్నారనీ, వాటికి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి జాగా, ఇల్లులేని పేదలకు ఒక్కొక్కరికి 120 గజాల జాగాతోపాటు, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే లోపే, సర్కారు వీటన్నింటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం గొప్పగా చెబుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు సగం కూడా పూర్తి కాలేదని వీరయ్య ఈ సందర్భంగా చెప్పారు. కట్టినిండ్లను పేదలకు ఇవ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని కోరారు. తమకు ఇండ్లు, ఇండ్ల జాగాలు కావాలని పోరాటం చేస్తున్న పేదలపై జక్కలొద్దితో పాటు అనేక చోట్ల లాఠీ ఛార్జ్ చేశారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారని చెప్పారు. కష్టజీవులైన ఈ పేదలు గొంతెమ్మ కోర్కెలు కోరటం లేదన్నారు. మంది సొమ్ము అడగటం లేదని చెప్పారు. మిగులు భూములు, శిఖం భూమినే అడుగుతున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యేలోపు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉధతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అసెంబ్లీలో రూమ్ లేదని ఆందోళన.. పోతినేని



పేదలు, అందునా మహిళలు బట్టలు మార్చుకోటానికి చాటు లేదనీ, కన్నార్పటానికి, సేదదీరటానికి కనీసం గుడిసె లేదని ఆందోళన చేస్తుంటే.. వీటిపై మాట్లాడాల్సిన బీజేపీ శాసన సభ్యులు అసెంబ్లీలో తమకు టిఫిన్ చేయటానికి రూమ్ లేదంటూ ఆందోళన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అదానీ, అంబానీలకు రూ.19లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం పేదలకు ఎన్ని ఇండ్లు కట్టించిందో చెప్పాలన్నారు. బీజేపీ హయాంలో భూ స్వాములకు, పెట్టుబడి దారులకే ప్రయోజనం జరుగుతున్నదని వాపోయారు.

రాజీవ్ గృహకల్ప ఇండ్లను పేదలకు పంచాలి... జూలకంటి



గత ప్రభుత్వాలు నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇండ్లను అర్హులైన పేదలకు పంచాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పలు సార్లు అధికార్ల దృష్టికి తీసుకుపోయామని గుర్తు చేశారు. 75ఏండ్ల స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఇంటి జాగా కోసం, ఇండ్ల కోసం ఆందోళన చయాల్సిన దుస్థితి రావటం బాధాకర మన్నారు. అధికారంలో ఉన్న వారు దోచుకుని దాచుకోవటం తప్ప, పేదలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల ఇబ్బడి ముబ్బడిగా నిత్యావసరాల ధరలు పెరుగుతుంటే పేదలెట్లా బతుకుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తులను హోల్ సెల్‌గా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

ఐక్యంగా ఉంటే..ఫలితం వస్తుంది.. హైమావతి



ఇండ్లు సాధించుకునే వరకు పోరాటాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి హైమావతి ఆపొద్దన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే విజయాలు సిద్ధిస్తాయని చెప్పారు. సర్కారు మాటలు నీటి మూటలుగా ఉన్నా యన్నారు. ఎన్నికల సమయంలో పేదల కిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని ముందస్తు అరెస్టు పేరుతో నిర్బంధించటమేంటని ప్రశ్నించారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: చుక్కారాములు



పేదలు ప్రభుత్వ భూముల్లో వేసుకున్న ఇండ్లు ఒదిలిపెట్టి పోవటానికి సిద్ధంగా లేరని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు చెప్పారు. పట్టాలు ఇచ్చేంత వరకు పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వానికి పేదల గొంతు వినపడాలనే ధర్నా చౌక్ నుంచి నినదిస్తున్నామని చెప్పారు.

రాజీపడేదే లేదు..: టి సాగర్



కష్టజీవులైన నిరుపేదలు తాము ఉండటానికి ప్రభుత్వ భూముల్లో ఇండ్లేసుకుంటే.. వాటికి పట్టాలిచ్చి, ఇండ్లు కట్టించాల్సింది పోయి, వారిపై సర్కారు పోలీసులతో జులుం చేయిస్తున్నదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తెలిపారు. పేదలు చేస్తున్న పోరాటంలో విజయం సాధించే వరకు పోరాటం ఆగదనీ, రాజీపడేదే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం కట్టించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పాడై పోతున్నాయన్నారు. పీఎంఏవైలో కోటి 20లక్షల ఇండ్లను ఇచ్చామంటున్నారనీ, ఈ రాష్ట్రానికి ఎన్నిండ్లు ఇచ్చారో..? ఎక్కడ ఇచ్చారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల గోస ప్రభుత్వ పెద్దలు వినాలే.. పాలడుగు భాస్కర్



పేదల గోస ప్రభుత్వ పెద్దలు వినాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ చెప్పారు. 'మేం ప్రయి వేటు జాగాలను కబ్జా చేయలే..ప్రభుత్వ భూమిలోనే గుడిసెలేసుకున్నం' ఇది నేరం కాదు..అయినా పేదలపై దౌర్జన్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలు తల దాచుకునేందుకు గుంట భూమివ్వరు గానీ.. ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలు, ప్రగతి భవన్‌కు, రింగు రోడ్లకు మాత్రం భూములెక్కడివని ప్రశ్నించారు. బడా బాబులకు కార్పొరేట్లకు కార్పెట్లు పరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

పట్టించుకునేవారే కరువయ్యారు.. : జి నాగయ్య



సెంటు భూమి లేని పేదలు తమకు తల దాచుకునేందుకు గుంట భూమి కావా లని అడిగితే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై అనేక సార్లు అధికారులను కలిసి అర్జీలిచ్చామన్నారు. పేదలంతా ఒక్కటై దండు కట్టి ప్రభుత్వ భూముల్లో జెండాలు పాతారని చెప్పారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేయాలి: డీజీ నర్సింహారావు



అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను తక్షణం పూర్తి చేసి పేదలకు కేటాయించాలని పట్నం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. పేదలు ఇంటి కిరాయిలు కట్టలేక, ఇండ్ల స్థలాలు లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారని చెప్పారు.

పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం..

పేదలకు న్యాయం చేసే వరకు పోరాటం ఆపేది లేదనీ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, సాగు భూములకు పట్టాలు, పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, ఎస్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆశయ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, జీఎంపీఎస్ ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, మత్స్య కార్మికుల, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెల్లెల బాలకృష్ణ, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, భూపాల్, ఉపాధ్యక్షులు ఎస్‌వి రమ, బుర్రి ప్రసాద్, కోట రమేష్ పి.శ్రీకాంత్, కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే..పేదల బతుకులు మారటం..: ఎండీ అబ్బాస్



పేదల బతుకులు మారకుండా దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందబోదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ చెప్పారు. ఇప్పటికీ 50శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు. అందరికీ విద్యా, వైద్యం, తిండి, బట్ట, ఇండ్లు ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

పూర్తయినా కేటాయించలే..: వెంకట్రాములు



ప్రభుత్వం ఇస్తామంటూ సాగదీస్తున్న డబుల్ బెడ్‌రూమ్‌లను పేదలకు ఎందుకు కేటాయించటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రశ్నించారు. పేదలు గుడిసెలేసుకుంటే ఎందుకు ఖాళీ చేయమం టున్నారో అర్థం కావటం లేదన్నారు. వారికి ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని చెప్పారు.

మోగిన ఎమ్మెల్సీ నగారా

న్యూఢిల్లీ :తెలుగురాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. తెలంగాణలో ఒక ఉపాధ్యాయ, ఒక స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదల అయింది. తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కాటేపల్లి జనర్ధన్ రెడ్డి పదవీ కాలం మార్చి 29తోనూ, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సయ్యద్ అస్సాన్ జాఫ్రి పదవీకాలం మే1తో ముగియనున్నది. అలాగే ఏపీలో 14 ఉపాధ్యాయ, పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మార్చి 16 వెల్లడిస్తారు.రెండు రాష్ట్రాల్లో నోటిఫికేషన్ తేదీతో పాటు ఎన్నికల తేదీ, ఫలితాల వెల్లడి ఒకే రోజున జరగనున్నది.

ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్	ఫిబ్రవరి 16
నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ	ఫిబ్రవరి 23
నామినేషన్ల పరిశీలన.	ఫిబ్రవరి 24
నామినేషన్ల ఉపసంహరణ.	ఫిబ్రవరి 27
పోలింగ్	మార్చి 13
ఎన్నికల ఫలితాలు	మార్చి 16

ఉత్తరాఖండ్‌లో పేపర్ లీక్ నిరసనపై లాఠీచార్జ్..

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు ప్రయత్నించారు. పోలీసుల చర్య నిరసనకారుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. తమ డిమాండ్లను వినిపించడానికే డెహ్రాడూన్ రోడ్డును దిగ్బంధించినట్టు రాష్ట్ర నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు బాబీ పన్వార్ తెలిపారు. " యువత చాలా ఆగ్రహంగా ఉన్నది. పోలీసులు లాఠీ చార్జీ చేశారు. కొందరిని నిర్బంధించి విడిచిపెట్టారు. రాష్ట్రంలో రిక్రూట్‌మెంట్ స్కామ్‌లలో, నియామక సంస్థలపై సీబీఐ దర్యాప్తునకు మేము డిమాండ్ చేస్తున్నాము" అని పన్వార్ అన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. పోలీసు చర్యను ఖండించింది. యువత గళాన్ని బలవంతంగా అణచివేసేలా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించింది. యువతపై దాడులను నిరసిస్తూ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో తమ పార్టీ ప్రదర్శలను చేపడుతుందని కాంగ్రెస్ తెలిపింది. యువత తప్పుదోవ పట్టొద్దనీ, నియామక పరీక్షలు పారదర్శకంగా జరపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అంతకముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ నిరసనకారులను కోరారు.

అమృత కాలం కాదు..విష కాలం

(మొదటిపేజీ తరువాయి)

రేషన్ ఇస్తున్నదని ప్రధాని మోడీ చెప్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకి రూ. 90 వేల కోట్ల కోత విధించారు. ఇది అమృత కాలం కాదు.. విష కాలం" అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్ అన్నారు. త్రిపురలోని అమర్‌పుర్‌లో నిర్వహించిన ర్యాలీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. వారు (బీజేపీ) రాజకీయాలతో మతాన్ని కలుపుతున్నారని అన్నారు. వారి హిందూత్వ భావజాలానికి హిందూ మతానికి సంబంధం లేదని తెలిపారు. ఎన్నికల్లో ప్రయోజనాల కోసం మన ప్రజల మధ్య విభజన తీసుకురావడానికి ఇది ఒక రాజకీయ ఆయుధం అని అన్నారు. రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తూ అధికార బీజేపీ బుల్డోజర్ రాజకీయాలను నడిపిందని ఆరోపించారు. భారత దేశ ప్రజాస్వామ్య పునాదిని కాషాయ పార్టీ నాశనం చేస్తున్నదన్నారు. అనామక ఎలక్టోరల్ బాండ్లను జారీ చేస్తూ బీజేపీ కోట్ల రూపాయలను పోగు చేసుకుంటున్నదని బృందా కరత్ ఆరోపించారు. "ఆదివాసుల హక్కుల కోసం పోరాడుతున్న లెఫ్ట్ ఫ్రంట్‌తో చేతులు కలపాలని మేము వారికి (టిప్రా మోతా) చెప్పాము. కానీ వారు స్పందించలేదు.ఈ ఎన్నికల్లో తమకు, వామపక్ష-కాంగ్రెస్ కూటమికి మధ్య విభేదాలతో బీజేపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నది" అని ఇంతక ముందు త్రిపురను పాలించిన రాచరిక కుటుంబానికి చెందిన టిప్రా మోతాను ఉద్దేశిస్తూ ఆమె అన్నారు.త్రిపురలో ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. బీజేపీ ఎలాగైనా మళ్లీ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి మత, 'విద్వేష' రాజకీయాలకు ఇప్పటికే తెర లేపింది. అయితే, బీజేపీ వైఫల్యాలను ప్రజలకు తెలియపరుస్తూ సీపీఐ(ఎం) పార్టీ ప్రచారంలో ముందుకెళ్తున్నది.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి - సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. గురువారం ఆమె అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు అనేది ప్రపంచంలోనే అతి పెద్ద సామాజిక కంటి పరీక్షల కార్యక్రమని అని తెలిపారు. సీఎస్‌తో పాటు రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు తాత మధు, కౌశిక్ రెడ్డి కూడా కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో ఉన్నారు.

ఆర్టీసీపై చర్చ వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

శాసనసభలో టీఎస్‌ఆర్టీసీపై చర్చను స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వాయిదా వేశారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, కాలె యాదయ్య, అంజయ్య యెల్గనమోని టీఎస్‌ఆర్టీసీ సరకు రవాణా, సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని పెంచ డానికి తీసుకుంటున్న చర్యలు, సబర్బన్ బస్సుల పెంపు దల అంశాలపై ప్రభుత్వానికి రాతపూర్వకం గా ప్రశ్న లు అడిగారు.ఈ అంశంపై ప్రభుత్వ వినతి మేరకు చర్చను వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటిం చారు. ఇదే అంశంపై శాసనమండలిలో ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి అడిగిన ప్రశ్నకు హరీశ్‌రావు సమాధానం చెప్పిన విషయం తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.